thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 287 | కరీంనగర్ బుధవారం, 24 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే విధ్వంసమే

చెన్నై : ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని, ఉగ్రవాదులు మళ్లీ తోకాడిస్తే సర్వనాశనమేనని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా హెచ్చరించారు. తమిళనాడులోని మదురైలో జరిగిన బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో త్రివిధ దళాలు ఉగ్ర స్థావరాలను నాశనం చేశాయన్నారు.

పాక్ ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్‌లను మన సైనికులు కూల్చివేశారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు తమిళనాడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాలపైనా అమిత్‌షా కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాట వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు.




## 'ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు చేయలేదు'

హైదరాబాద్, డిసెంబర్ 23: ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేస్తున్న వార్తలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ వార్తల్లో మాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. కాసేపటిక్రితం.. రాష్ట్ర ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్‌ను రద్దు చేసినట్లు, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి. ఒక సర్క్యులర్ కూడా బాగా వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో వెంటనే స్పందించిన తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ.. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ రద్దు అంశంపై స్పందించింది. ఆ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేసింది. ఇప్పటివరకు ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని క్లారిటీ ఇచ్చింది.

## ఉద్యోగుల సమస్యలపై స్పెషల్ ఫోకస్..

## సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఇవాళ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు.

**పూర్తి వివరాలు ఇవ్వాలి..** ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హెూచ్‌వోడీలు వెరిఫై చేయాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. ఈ ప్రక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

**ఆ పాలసీ లేకపోవడంతో సమస్యలు..** 'ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయి. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం.

రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ –2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని వ్యాఖ్యానించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**అధికారుల సహకారం ఉండాలి..** 'ఎంత గొప్ప కార్యాచరణ తీసుకున్నా అధికారుల సహకారం ఉండాలి. అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలి. ప్రతీ నెల కార్యదర్శుల పనితీరుపై సీఎస్ సమీక్షిస్తారు. కార్యదర్శులు సీఎస్‌కు ప్రతీ నెల రిపోర్ట్ సమర్పించాలి.

ప్రతీ మూడు నెలలకు ఒకసారి మీ పనితీరుపై నేనే స్వయంగా సమీక్షిస్తా. ఆయా శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి ఫలితాలు రావు. అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయడం అత్యంత కీలకం. తెలంగాణ అభివృద్ధి విషయంలో శాఖల మధ్య సమన్వయం చేసుకునేందుకు ఒక మెకానిజం ఏర్పాటు చేసుకోవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## కేసీఆర్, హరీష్ కు ఫోన్ ట్యాపింగ్ ఉచ్చు - కీలక పరిణామం, నెక్స్ట్ ఇక..!?





హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో వరుసగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసు దర్యాప్తులో సిట్ వేగాన్ని పెంచింది. ఇప్పటికే రివ్యూ కమిటీలోని వారిని సిట్ విచారించింది. ఈ ట్యాపింగ్ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో రివ్యూ కమిటీలో ఉన్న జీఏడీ సెక్రటరీ, సీఎస్‌లు, ఇంటెలిజెన్స్ చీఫ్‌ను సిట్ మరోసారి విచారణకు పిలిచింది. కాగా.. రాజకీయ నేతల పైన సిట్ ఫోకస్ చేసింది. అందులో భాగంగా మాజీ సీఎం కేసీఆర్.. హరీష్ కు సిట్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ విచారణ కొత్త మలుపు తీసుకుంది. ఈ కేసును విచారణ చేస్తున్న సిట్ ఇప్పటికే మాజీ సీఎస్.. ఇంటలిజెన్స్ చీఫ్ ల నుంచి స్టేట్ మెంట్లను రికార్డు చేసింది. ఈ కేసులో కీలకంగా ఉన్న ప్రభాకర్ రావు విచారణ సమయంలో అనేక అంశాలను రాబట్టింది. ప్రభాకర్ రావు పదే పదే మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, మాజీ ఇంటలిజెన్స్ అధికారి అనిల్ కుమార్ పేర్లను ప్రస్తావన చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే మహేందర్ రెడ్డి స్టేట్ మెంట్ ను సిట్ రికార్డు చేసింది. కాగా, ఈ కేసులో మాజీ సీఎం కేసీఆర్.. మాజీ మంత్రి హరీష్ కు సిట్ నోటీసులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.కేసీఆర్ కు నోటీసులు జారీ అంశం ఈ కేసులో కీలక మలుపుగా మారనుంది. ఈ నెల 29వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనుండటంతో.. ఆ తరువాత కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే సిట్ ఈ కేసులో ముగ్గురు మాజీ ఐఏఎస్‌లతోపాటు మాజీ ఐపీఎస్ అధికారులను సిట్ సాక్షులుగా విచారించింది. మాజీ సీఎస్‌లు సోమేష్ కుమార్, శాంతి కుమారిలను విచారించింది. అలాగే సాధారణ పరిపాలన శాఖ మాజీ పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావుతోపాటు మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్‌ను కూడా విచారించింది. ఎస్ఐబీ ఓఎస్డీగా ప్రభాకర్ రావును నియమించడంపై ఐఏఎస్‌లకు సిట్ పలు ప్రశ్నలు సంధించింది. గత ప్రభుత్వంలో ఈ ముగ్గురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కీలకంగా వ్యవహరించారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలతో పాటు మీడియా ప్రతినిధుల ఫోన్లను సైతం ప్రభాకర్ రావు ట్యాప్ చేసినట్లు తమ దర్యాప్తులో సిట్ గుర్తించింది. ప్రభాకర్ రావు ఇచ్చిన నెంబర్లను యథావిధిగా హెూం శాఖకు ఈ మాజీ ఐపీఎస్ అధికారులు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనుబంధ ఛార్జ్‌షీట్ ఫైల్ చేసేందుకు సిట్ ప్రయత్నాలు చేపట్టింది. ఇప్పుడు కేసీఆర్ కు నోటీసుల వ్యవహారం తో పాటుగా సిట్ తీసుకునే నిర్ణయాల పైన రాజకీయంగానూ ఉత్కంఠ పెంచుతోంది.



## ప్రజల దృష్టి మళ్లించడానికే నోటీసుల డ్రామా: కేటీఆర్

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనలో మీడియాకు లీకులు.. ప్రత్యర్థులపై కేసులు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ మద్దతుతో కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను కేటీఆర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. నదీ జలాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవగాహన శూన్యమని, సాగునీటి మంత్రులది అంతులేని అజ్ఞానమని వ్యాఖ్యానించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సహకారసంఘాల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. "రెండేళ్లుగా రోజుకో కేసు అంటూ మీడియాకు లీకులు ఇస్తున్నారు తప్ప.. ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని కూడా చేయలేదు. చిట్ చాట్‌ల పేరుతో వెనుక దాక్కోవడం కాదు.. కెమెరాల ముందుకొచ్చి మాట్లాడే ధైర్యం సీఎంకి లేదు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు. ప్రజల దృష్టి మళ్లించడానికే నోటీసుల డ్రామా? అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సహా 420 హామీలను అమలు చేయలేక రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.



# అస్సలు తగ్గేదే లే!

# అసెంబ్లీలో జలయుద్ధమే!

## టీంకు దిశానిర్దేశం చేసిన సీఎం రేవంత్!

హైదరాబాద్‌ః రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలను ఈ నెల 29 నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల సమావేశంలో నిర్ణయించినట్టు సమాచారం. అదేవిధంగా జనవరిలో సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు వెళ్ళాలని కూడా నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. నిబంధన ప్రకారం ఆరు నెలల్లోగా సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నందున, శీతాకాల సమావేశాలను 29న ప్రారంభించి, ఆ తర్వాత వచ్చే నెల 2వ తేదీ నుంచి కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందే. సమావేశాలు ప్రారంభించిన తర్వాత రెండు రోజుల్లో (31 డిసెంబర్, జనవరి 1) వేడుకల కోసం విరామం తీసుకుని ఆ తర్వాత రెండో తేదీ నుంచి కొనసాగించుకుందామని పలువురు మంత్రులు చేసిన ప్రతిపాదనకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల అంశంతో పాటు ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై హాట్‌హాట్‌గా చర్చ జరిగినట్లు సమాచారం.

**స్థానిక ఎన్నికలను సీరియస్‌గా తీసుకోండి: సిఎం హెచ్చరిక...** ఇదిలాఉండగా రాబోయే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొంత కటువుగానే చెప్పినట్లు సమాచారం. గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ కొందరు మంత్రుల జిల్లాలు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పార్టీ కంటే బిఆర్ఎస్ మద్దతు ఇచ్చిన సర్పంచులే అత్యధికంగా గెలవడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలా ఫలితాలు ప్రతికూలంగా వచ్చిన జిల్లాల్లో నల్లగొండ, వరంగల్, మహబూబ్ నగర్ జిల్లాలు ఉన్నాయని వాటికి సంబంధించిన గణాంకాలాను మంత్రులకు అందజేసి అలా ఎందుకు జరిగిందని నిలదీసినట్లు తెలిసింది. కొంత మంది పార్టీ ఎమ్మెల్యేల పని తీరు నచ్చలేదని, అనవసరంగా బంధు, మిత్రులను బరిలోకి దించడం వల్ల నష్టపోయామని ఆయన ఆందోళన వ్యక్తం చేశారని తెలిసింది. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి వత్తిళ్ళకు లొంగకుండా, కఠినంగా ఉండాలని, పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న వారికే టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకోవాలని సిఎం సూచించారని తెలిసింది. ఆ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను ఎక్కువ సంఖ్యలో గెలిపించే బాధ్యతను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు తీసుకోవాలని ముఖ్యమంత్రి మంత్రులనుద్దేశించి అన్నారని విశ్వసనీయ సమాచారం. అభ్యర్థుల ఎంపిక ఆచితూచి జరగాలని, గెలిచే అభ్యర్థులనే బరిలోకి దింపాలని ఈ విషయంలో ఏ మాత్రం రాజీపడరాదని కూడా ఆయన ఈ సందర్భంగా వివరించినట్లు తెలిసింది. స్థానిక ఎన్నికల ముందు మండల, జిల్లా స్థాయిలో విపక్షాల నుంచి ముఖ్య నాయకులు ఎవరైనా పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరిస్తే వారిని చేర్చుకునేందుకు కూడా ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలాఉండగా పాలమూరు–రంగారెడ్డి నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రతిపక్ష నేత, మాజీ సిఎం కెసిఆర్ లేవదీసిన అంశాలపై చర్చించినట్లు తెలిసింది. కెసిఆర్ లేవదీసిన అంశాలపై అసెంబ్లీలో నిలదీయాలని, ఆ పార్టీ నాయకులను ఇరకాటంలో పెట్టే విధంగా, వారి హయాంలో తీసుకున్న నిర్ణయాలను సభ ముందు ఉంచి ఆత్మరక్షణలో పడేసే విధంగా వ్యూహాన్ని అనుసరించాలని మంత్రులకు ముఖ్యమంత్రి దిశా నిర్ధేశం చేసినట్లు తెలిసింది. ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్ష నాయకుడు చర్చకు రప్పించేలా ఆ పార్టీకి సవాళ్ళు విసరాలని, ఎదురు దాడికి దిగడం ద్వారా వారిని ఇరకాటంలోకి నెట్టాలని సూచించినట్లు తెలిసింది. ప్రధాన ప్రతిపక్షానికి అసెంబ్లీలో చర్చకు తాను బలంగా సమాధానం చెప్పగలనని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారని తెలిసింది. ఈ సమావేశాల్లో ప్రధానంగా గోదావరి కృష్ణా జలాలపై చర్చకు పెట్టి ప్రతిపక్ష బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను ఎండగట్టి ప్రజల్లోకి తీసుకెళ్ళాలని కూడా ఈ సందర్భంగా సిఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి వార్డుల విభజనపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ ముఖ్యమంత్రి సవివరంగా వివరించినట్లు సమాచారం. ప్రధానంగా అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో ఆశించిన దానికంటే తగ్గిన సీట్లు, రాబోయే స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల అంశం ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఆ ఎన్నికల్లో పార్టీ హామీ ఇచ్చిన మేరకు నలభై రెండు శాతం రిజర్వేషన్లను పార్టీ పరంగా అమలు చేసే విషయంపై మంత్రుల అభిప్రాయాలను సిఎం తీసుకున్నట్లు తెలిసింది. శీతాకాల సమావేశాల్లో ఏడు ఆర్డినెన్స్‌ల స్థానే బిల్లులపై కూడా మంత్రులకు సిఎం రేవంత్ రెడ్డి వివరించినట్లు తెలిసింది.




హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా పంచాయతీల్లో నూతన పాలక వర్గం కొలువు దీరింది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్ లుగా, ఉప సర్పంచ్ లుగా, వార్డు మెంబర్లుగా బాధ్యతలు స్వీకరించిన సోదర సోదరీమణులకు సీఎం రేవంత్ రెడ్డి విషెస్ చెప్పారు. మంచి పాలన అందించి, పంచాయతీలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్ది.. ప్రజల మన్ననలు పొందాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పల్లెల్లో కొత్త పాలన మొదలైంది. దాదాపు రెండేండ్ల తర్వాత కొత్త పాలకవర్గాలు డిసెంబర్ 22న కొలువుదీరాయి. 12,702 పంచాయతీలకు సర్పంచులు, ఉపసర్పంచులు, 1,11,803 వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. సర్పంచులు సొంత ఖర్చులతో ఆఫీసులకు రంగులు వేయించారు. పలువురు సర్పంచులు బాజాబజంత్రీలు, ఊరేగింపులతో వచ్చి బాధ్యతలు స్వీకరించగా.. మరికొందరు గెలిచిన తొలిరోజే హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. పలుచోట్ల చిన్నచిన్న ఘర్షణలు, గందరగోళం మినహా రాష్ట్ర వ్యాప్తంగా ప్రమాణస్వీకార కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. పలుచోట్ల పాలక వర్గాల ప్రమాణస్వీకారోత్సవాలు కన్నులపండువగా జరిగితే ఇంకొన్నిచోట్ల వసతుల లేమితో ఇబ్బందిపడ్డారు. నిర్మల్ జిల్లా తానూర్ మండలం బొంద్రాట్ సర్పంచ్ రవీందర్ పటేల్ గుర్రంపై బాజాబజంత్రీల నడుమ ఊరేగింపుగా వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

## 3 నెలలకోసారి కార్యదర్శుల పనితీరుపై సమీక్షిస్తా: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అధికారులు సమన్వయం చేసుకొని పనిచేయడం కీలకమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సచివాలయంలోని అన్ని విభాగాల కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి ఫలితాలు రావని సీఎం అన్నారు. ప్రతి నెలా కార్యదర్శుల పనితీరుపై సీఎస్ సమీక్షిస్తారని తెలిపారు. ప్రతి నెల కార్యదర్శులు.. సీఎస్‌కు నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ప్రతి 3 నెలలకోసారి కార్యదర్శుల పనితీరుపై స్వయంగా సమీక్షిస్తానని సీఎం చెప్పారు. "అధికారులు సమన్వయం చేసుకొని పనిచేయడం కీలకం. అభివృద్ధి విషయంలో సమన్వయం కోసం మెకానిజం ఉండాలి. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయ్యింది. రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం.. ప్రణాళికలు రూపొందించుకున్నాం. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ పాలసీలు లేవు. దీంతో అనేక సమస్యలు వచ్చాయి. ముఖ్యమైన విభాగాలకు పాలసీలు తీసుకొచ్చాం. తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశాం. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధానాలతో ముందుకెళ్తున్నాం. గొప్ప కార్యాచరణ అమలుకు అధికారుల సహకారం ఉండాలి" అని సీఎం అన్నారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## అసెంబ్లీకి రావడానికి కేసీఆర్ భయపడుతున్నారు: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



తల్లాడ: ప్రజా ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి నేతలు విషం కక్కుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయట్లేదని వివరించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ఏడా రూ. 12,500 కోట్లు విద్యుత్‌శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. తోలు తీస్తామని బీఆర్ఎస్ నేతల మాదిరిగా దిగజారి మాట్లాడలేమన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్.. మీడియా సమావేశంలో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభకు రావడానికి కేసీఆర్ భయపడుతున్నారన్నారు.

## కేసీఆర్ ప్రెస్ మీట్ తర్వాత రేవంత్ సర్కార్ డిఫెన్స్‌లో పడింది: హరీశ్



రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ ఇటీవల ప్రెస్ మీట్ తర్వాత రేవంత్ సర్కార్ డిఫెన్స్‌లో పడిందని ఆయన అన్నారు. '25 ఏళ్ళుగా రాజకీయాల్లో ఉన్నా. రాత్రి 9:30 గంటలకు ముఖ్యమంత్రి చిట్ చాట్ పెట్టడం నేను చూడలేదు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ షోలు, గ్లోబల్ సమ్మిట్‌లు అన్నం పెడతాయా? సీఎం రేవంత్ రెడ్డికి వాస్తు భయం పట్టుకుంది. అందుకే సచివాలయానికి వెళ్లడం లేదు' అని ఆయన విమర్శించారు. ఇటీవల జరిగిన తెలంగాణా పంచాయతీ ఎన్నికల్లో.. బీఆర్ఎస్ 4 వేల సర్పంచ్ స్థానాల్లో గెలుపొందిందని హరీశ్ రావు అన్నారు. 'బీఆర్ఎస్ దెబ్బకు డీసీసీబీలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. కాంగ్రెస్ కార్యకర్తలను నామినేట్ చేయాలని చూస్తున్నారు. పోలీసులు లేకుండా ఉస్మానియాకు వస్తానని.. పోలీస్ పహారాల మధ్య ఓయూకు వచ్చారు. ఇరిగేషన్‌పై పీపీటీని స్వాగతిస్తున్నాం. పీపీటీపై అసెంబ్లీలో మాకూ అవకాశం ఇవ్వాలి. అసెంబ్లీలో మా గొంతు నొక్కడం.. మైక్ కట్ చేయవద్దు. ఎవరి వాదన నిజమో ప్రజలే తేల్చుతారు. సీపీఐ, ఎంఐఎం, బీజేపీ కంటే తక్కువ సమయం బీఆర్ఎస్‌కు ఇస్తున్నారు. బీఆర్ఎస్‌కు ప్రభుత్వం భయపడుతోంది. అవకాశం ఇస్తే.. అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్ బట్టలు విప్పుతాం' అని కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు హరీశ్.

## ప్రజా పాలన కాదు.. పక్కా మాఫియా పాలన: కేటీఆర్



హైదరాబాద్: తెలంగాణలో నడుస్తోంది ప్రజాపాలన కాదని.. పక్కా మాఫియా పాలన అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. నాడు ఎన్నికల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుపై బాంబులు వేశారని.. నేడు ఇసుక మాఫియా కోసం చెక్‌డ్యామ్‌ల మీద జిలెటిన్ స్టిక్స్ వేస్తున్నారని ఆరోపించారు. ఇది మానవ నిర్మిత విధ్వంసమని 'వాటర్ మ్యాన్' రాజేంద్రసింగ్ మొత్తుకుంటున్నా.. ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో కేటీఆర్ పోస్ట్ చేశారు. "డ్రిల్లింగ్ మెషీన్లతో రంధ్రాలు చేసి జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చారని ఆయన సాక్ష్యాలతో సహా నిరూపించారు. ఇసుకను దోచుకోవడానికి అడ్డుగా ఉన్నాయని.. రూ.కోట్ల ప్రజాధనంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌లను డైనమైట్లు పెట్టి పేల్చేస్తారా? భూగర్భ జలాలు పెరగాలని మేం చెక్‌డ్యామ్‌లు కడితే.. వాటిని కూల్చివేసి రైతుల పొలాలను ఎడారిగా మారుస్తున్నారు. ఇసుక కాంట్రాక్టర్ల లాభాల కోసం తెలంగాణ రైతులు బలి కావాలా? ప్రకృతి విపత్తులతో కూలిపోయాయని కట్టుకథలు అల్లిన కాంగ్రెస్ మంత్రులకు రాజేంద్రసింగ్ రిపోర్టు చెంపపెట్టు" అని కేటీఆర్ పేర్కొన్నారు.




## తరచూ రోడ్డు ప్రమాదాలు.. హయత్‌నగర్‌లో స్థానికుల ఆందోళన

హైదరాబాద్: నగరంలోని హయత్‌నగర్‌లో జాతీయ రహదారిపై స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్-విజయవాడ హైవేపై ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు. హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ నరసింహారెడ్డితో పాటు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కాలనీ వాసులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. 'ఇది జాతీయ రహదారా? మృత్యు రహదారా?' అంటూ నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఇటీవల రోడ్డు దాటుతూ వైద్య విద్యార్థిని ఐశ్వర్య మృతిచెందిన నేపథ్యంలో స్థానికులు నిరసనకు దిగారు.

## వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకం: వెంకయ్య నాయుడు



హైదరాబాద్, డిసెంబర్ 23: మాజీ ప్రధాని, దివంగత నాయకుడు, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ జీవితం తెరిచిన పుస్తకం అని.. ప్రతి పేజీ స్ఫూర్తి దాయకం అని పేర్కొన్నారు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం వాజ్‌పేయ్ నిరంతరం కృషి చేశారని చెప్పారు. కేంద్ర సాంస్కృతిక శాఖ, త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణగూడ కేశవ్ మెమోరియల్ కళాశాలలో భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అటల్ బిహారీ వాజపేయి జీవితం గురించి, ఆయన పరిపాలనా దక్షత గురించి వెంకయ్య నాయుడు కీలక ప్రసంగం చేశారు. బీజేపీకి బలమైన పునాది వేసిన వ్యక్తుల్లో వాజ్‌పేయి ముందు వరుసలో ఉంటారని కీర్తించారు. వాజ్‌పేయిని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ శిష్యుడిగా ఎంచుకున్నారని చెప్పారు. వాజ్‌పేయి పాలన అంటే సుపరిపాలన అని.. యువతకు వాజ్‌పేయ్ ఆదర్శనం అన్నారు వెంకయ్య. తాను పదవి విరమణ మాత్రమే చేశానని.. పెదవి విరమణ చేయలేదన్నారు. వాజ్‌పేయి చూపిన మార్గంలో నడుస్తున్నామా? లేదా? అనేది ప్రతీ కార్యకర్త ఆలోచించుకోవాలని సూచించారాయన. నైతిక పాలన, సామాజిక బాధ్యత, రాజ్యాంగం పట్ల అంకిత భావంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే అంకిత భావంతో పని చేసినట్లు కాదన్నారు. రాజకీయ నాయకులకు తప్పుడు భాష మాట్లాడటం అలవాటు అయిపోయిందంటూ ప్రస్తుత నాయకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు వెంకయ్య నాయుడు. రాజకీయ నాయకులు శత్రువులు కాదని.. కేవలం ప్రత్యర్థులు మాత్రమేనని చెప్పారు. భారత్‌ను శక్తివంతమైన దేశంగా ప్రపంచం ముందు నిలబెట్టిన వ్యక్తి వాజ్‌పేయ్ అని చెప్పారు. 'నా వల్లే చదువుకుంటున్నారు.. నా వల్లే యుద్ధాలు ఆగిపోతున్నాయని ట్రంప్ చెప్పుకోవడం ఏమాత్రం సరైనది కాదు.' అని వెంకయ్య నాయుడు అభిప్రాయపడ్డారు. 'ప్రస్తుత సమాజంలో వ్యక్తులు స్వార్థం కోసం పని చేస్తున్నారు.. వాజ్‌పేయి శాంతిని ప్రేమించే వారు.. దేశ రక్షణ విషయంలో కఠినంగా ఉండేవారు. పీవీ సంస్కరణలు తీసుకువస్తే.. ఆ సంస్కరణలను ఆచరణలోకి తెచ్చిన వ్యక్తి వాజ్‌పేయి. ఆయనను ప్రత్యర్థులు కూడా అజాత శత్రువు అని పిలిచే వారు. గ్రామీణ సడక్ యోజన ద్వారా గ్రామాల్లో రోడ్లు వేయించింది వాజ్‌పేయి.' అని చెప్పారు వెంకయ్య. రాజనీతి, దౌత్య నీతి ప్రదర్శించే వ్యక్తి మోదీ అంటూ ప్రధానిపై ప్రశంసలు కురిపించారు వెంకయ్యనాయుడు. ఆపరేషన్ సింధూర్ ను విజయవంతం చేసిన ఆర్మీ, శాస్త్రవేత్తలకు హ్యాట్సాఫ్ చెప్పారు మాజీ ఉపరాష్ట్రపతి. ప్రభుత్వాలు ఉచితాలు ప్రకటిస్తూ.. ప్రజలను సోమరిపోతులను తయారు చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారాయన. ఉచిత బస్సు ఇవ్వమని మహిళలు అడిగారా? అని ప్రశ్నించారు. నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వాలకు సూచించారు వెంకయ్య. ఉచితాలకు స్వస్తి పలికి.. కష్టపడే వారికి చేయూతనివ్వాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మైనార్టీలను ప్రోత్సహించకూడదన్నారు వెంకయ్య.



## మేడారంలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

తాడ్వాయి: ములుగు జిల్లా మేడారంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క పర్యటించారు. తొలుత వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను వారు దర్శించుకున్నారు. అనంతరం మేడారం మహాజాతర ఏర్పాట్లు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు పలు సూచనలు చేశారు. జనవరి 28 నుంచి 31 వరకు మేడారం జాతర జరగనుంది.




## సీఐడీ ముందుకు మళ్లీ మంచు లక్ష్మీ

హైదరాబాద్ : బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో సీఐడీ ముందు మంచు లక్ష్మీ మరోసారి హాజరయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఐడీ అధికారుల ఎదుట ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు అధికారులు పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇదే వ్యవహారంలో ఇప్పటికే ఈడీ అధికారుల ఎదుట ఆమె హాజరయ్యారు. అలాగే ప్రముఖ నటులు ప్రకాశ్ రాజ్, రానా, విజయ్ దేవరకొండ సైతం ఈడీ అధికారుల ముందు హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఇదే కేసులో హీరోయిన్ నిధి అగర్వాల్, యాంకర్ శ్రీముఖి, నటి అమృత చౌదరి కూడా సీఐడీ అధికారుల విచారణకు గతంలో హాజరై వివరణ ఇచ్చిన విషయం విదితమే. ఈ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కోసం జరిగిన లావాదేవీలపై గతంలోనే వీరిని అధికారులు ప్రశ్నించారు. ఈ విచారణలో బెట్టింగ్ యాప్స్‌కు ఎందుకు ప్రమోట్ చేశారు?. అందుకు ఎంతెంత తీసుకున్నారు?. యాప్ నిర్వాహకులతో చేసుకున్న ఒప్పందాలపై వీరి నుంచి అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది.


## మహిళలపై వ్యాఖ్యలు... శివాజీకి మహిళా కమిషన్ నోటీసులు

హైదరాబాద్, డిసెంబరు 23 : ప్రమఖ సినీనటుడు, మా అసోసియేషన్ సభ్యుడు శివాజీ మహిళలపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. నిన్న(సోమవారం) హైదరాబాద్‌లో జరిగిన దండోరా సినిమా ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణను ఉద్దేశించి శివాజీ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై మహిళా కమిషన్ సీరియస్ అయింది. ఈ క్రమంలోనే శివాజీకి నోటీసులను ఇవాళ(మంగళవారం) జారీ చేసింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు మహిళ కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద. శివాజీ మాట్లాడిన మాటలను మహిళా కమిషన్ లీగల్ టీమ్ పరిశీలించిందని తెలిపారు. ఆయన మహిళలపై చేసిన వ్యాఖ్యలపై యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించారు. నటులు సినీ వేడుకల్లో మాట్లాడే సమయంలో చాలా జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. మహిళల గురించి అవమానకరంగా మాట్లాడితే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు నేరెళ్ల శారద.




# బహుముఖ ప్రజ్ఞకు ప్రతి రూపం భానుమతి - డిసెంబర్ 24...భానుమతీ రామకృష్ణ వర్ధంతి

భానుమతీ రామకృష్ణ ... తెలుగు సినిమా ప్రేక్షకులకు, ప్రజలకు పరిచయం అవసరం లేని మహా కళాకారిణి. భారతదేశం గర్వించదగ్గ నటీమణుల్లో ఆమె ఒకరు. భానుమతి కేవలము ప్రముఖ దక్షిణ భారత సినిమా నటి మాత్రమే కాదు, నిర్మాత, దర్శకురాలు, స్టూడియో అధినేత్రి, రచయిత్రి, గాయని, సంగీత దర్శకురాలు. చిత్ర సీమలో ఆమె చేరుకున్న శిఖరాగ్రాలు అనితర సాధ్యం. ఏడు దశాబ్దాలు ఆమె సినీ కళామతల్లికి చేసిన సేవలు అజరామరం. భానుమతీ రామకృష్ణ (సెప్టెంబరు 7, 1926 – డిసెంబరు 24, 2005) ఒంగోలులో జన్మించింది. శాస్త్రీయ సంగీత కళాకారుడైన, తండ్రి బొమ్మరాజు వెంకట సుబ్బయ్య వద్ద సంగీతం అభ్యసించింది. అనేక కట్టుబాట్లు గల కుటుంబ వాతావరణంలో పెరిగినప్పటికీ ఆమె ఎంతో ధైర్యంగా 13 ఏళ్ళ చిరు ప్రాయంనాడే 1939 లో విడుదలైన "వరవిక్రయం" అనే సినిమాలో నటించింది. అయితే సినిమా నిర్మాణ సమయములో తన కుమార్తెను తాకరాదని ఆమె తండ్రి షరతు విధించగా, హీరో, నిర్మాతలు అలాగే నడుచు కున్నారట. నటిగా, గాయనిగా, దర్శకురాలిగా, నిర్మాతగా, రచయితగా, సంగీత దర్శకురాలిగా విభిన్న కోణాలను స్పృశిస్తూ సాటిలేని మేటి తెలుగు కళాకారిణిగా ఎదిగింది. ఆమె 1943, ఆగష్టు 8 న తమిళ, తెలుగు చిత్ర నిర్మాత, డైరెక్టరు, ఎడిటరు అయిన శ్రీ పి.యస్. రామకృష్ణారావును ప్రేమ వివాహం చేసుకుంది. ఏకైక సంతానం భరణి. భరణి పేరు మీదనే భరణీ స్టూడియో నిర్మించి, అనేక చిత్రాలు నిర్మించారు. భానుమతి శ్రీ విద్యోపాసకురాలనీ, ఆమెకు జ్యోతిష్య, సాముద్రిక శాస్త్రాలలో మంచి అనుభవం ఉందన్న సంగతి కొద్ది మందికే తెలుసు. 1950 ప్రాంతాల్లోనే ఆమె నాడీ గ్రంధాల మీద పరిశోధన సాగించారని, హస్త సాముద్రిక వేత్త అని చెపుతారు. అలాగే శృంగేరీ పీఠాధిపతి అభినవ విద్యాతీర్థ స్వామివారి నుండి ఉపదేశం పొంది నిత్యమూ లలితా సహస్ర నామాలతో శ్రీ చక్రాన్ని అర్చించేవారనీ , సప్తశతీ పారాయణ చేసేవారనీ ప్రతీతి. 2005 డిసెంబర్ 24 న చెన్నై లోని తన స్వగృహంలో భానుమతీ రామకృష్ణ పరమ పదించింది. భానుమతి అర్ధ శతాబ్దానికి పైబడి సినీ రంగంలో ఉన్నప్పటికీ, నటించిన సినిమాలు వంద వరకే. విజయా వారి మిస్సమ్మ సినిమాలో ప్రధాన పాత్రకు మొదట భానుమతినే ఎంపిక చేసు కున్నారు. అయితే అయితే కారణాంతరాల వల్ల ఆమె స్థానంలో సావిత్రిని తీసుకున్నారు. ఈ సంగతి గురించి ప్రస్తావిస్తూ, "నేను మిస్సమ్మలో నటించక పోవడం వల్ల సావిత్రిలాంటి గొప్పనటి వెలుగులోకి వచ్చింది", అని సంతోషించింది. 1956లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గౌరవ పురస్కారము, మూడు సార్లు జాతీయ అవార్డులు (అన్నై అను తమిళ సినిమాకు, అంతస్తులు, పల్నాటి యుద్ధం అను తెలుగు సినిమాలకు), అన్నాదురై నడిప్పుకు ఇళక్కనం (నటనకు వ్యాకరణం) అని బిరుదు పొందింది. 1966లో ఆమె వ్రాసిన అత్తగారి కథలు అను హాస్యకథల సంపుటికిగాను పద్మశ్రీ బిరుదు ఇచ్చి, భారత ప్రభుత్వము సత్కరించింది. ఇదే సంపుటికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడెమీ అవార్డు కూడా వచ్చింది. 1975లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు కళా ప్రపూర్ణ ఇచ్చి సత్కరించింది. 1984లో కలైమామణి బిరుదుతో తమిళనాడు లోని ఐయ్యల్ నాటక మన్రము సత్కరించింది. బహుకళా ధీరతి శ్రీమతి అను బిరుదుతో 1984 ననే లయన్స్ క్లబ్బు సత్కరించింది. 1984లో తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటుతో సత్కరించింది. 1986లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డును ఇచ్చింది. 1986లో ఉత్తమ దర్శకురాలిగా అవార్డును ఆంధ్ర ప్రభుత్వము నుండి అందుకుంది.



గాయనిగా భానుమతి ఎంతో పేరుప్రతిష్ఠలు సంపాదించుకుంది. సినిమా పాటలే కాక రేడియోలోనూ, రికార్డుల్లోనూ ఆమె పాడిన పాటలు పాడింది. విజయవాడ రేడియో కేంద్రం ప్రారంభ మైనప్పుడు వినిపించిన ప్రారంభగీతం "పసిడి మెరుంగుల తళతళలు" బాలాంత్రపు రజనీకాంతరావుతో కలిసి ఆమె పాడినదే. పెళ్ళికానుక (1998), బామ్మమాట బంగారుబాట (1990), ముద్దుల మనవరాలు, (1986), మంగమ్మ గారి మనవడు (1984), గడసరి అత్త సొగసరి కోడలు (1981), మట్టిలో మాణిక్యం (1971), పల్నాటి యుద్ధం, (1966), అంతస్తులు (1965), తోడు నీడ (1965), బొబ్బిలి యుద్ధం, వివాహ బంధం (1964), బాటసారి (1961), నల దమయంతి, వరుడు కావాలి (1957), తెనాలి రామకృష్ణ, చింతామణి (1956), విప్రనారాయణ, అగ్గిరాముడు, చక్రపాణి (1954), చండీరాణి (1953), ప్రేమ (1952), మల్లీశ్వరి, మంగళ (1951), అపూర్వ సహోదరులు (1950), లైలామజ్ను, రాజశేఖర (1949), రత్నమాల (1947), స్వర్గసీమ (1945), తాసీల్దార్ (1944), గరుడ గర్వభంగం, కృష్ణ ప్రేమ (1943), ధర్మపత్ని (1941), వరవిక్రయం, (1939) విభిన్న పాత్రల కు జీవం పోసిన ప్రజ్ఞాశాలి. అసాధ్యురాలు (1993) పెరియమ్మ (తమిళం) (1992) భక్త ధ్రువ మార్కండేయ (1982/%×) భక్త ధ్రువ మార్కండేయ (1982/%××) ఒకనాటి రాత్రి (1980), రచయిత్రి (1980), మనవడి కోసం (1977), వాంగ సంథంది వాంగ (తమిళం) (1976), ఇప్పడియుమ్ ఒరు పెన్ (తమిళం) (1975), అమ్మాయి పెళ్ళి (1974), విచిత్ర వివాహం (1973), అంతా మన మంచికే (1972), గృహలక్ష్మి (1967), చండీరాణి (1953/%×%) తదితర చిత్రాలకు దర్శక బాధ్యతలు నిర్వహించింది. బాటసారి (1961), వరుడు కావాలి (1957), చింతామణి (1956), విప్రనారాయణ (1954), చక్రపాణి (1954), చండీరాణి (1953/%×), %చండీరాణి (1953/%××%), ప్రేమ (1952), లైలామజ్ను (1949/%×%), రత్నమాల (1947) తదితర చిత్రాలకు నిర్మాతగా పని చేసింది... ప్రేమ (1952) (కథ) అత్తగారి కథలు ఆమె రచనలు. చింతామణి (1956) చక్రపాణి (1954) చిత్రాలకు సంగీత దర్శకురాలిగా వ్యవహరించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# అలనాటి మేటి గాయకుడు రఫీ - డిసెంబర్ 24...మహమ్మద్ రఫీ జయంతి



ప్రముఖ ఉత్తర భారత నేపథ్యగాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. హిందీ సినిమా రంగం 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళ్లు నిజం. తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ 24 డిసెంబర్ 1924 పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. ఆలా చిన్నప్పటి సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటుదేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడటానికి 1944లో బొంబాయి వెళ్లాడు. గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్యగాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం. జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కొడుకు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ. నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ – జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ పీ నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ – ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా మరియు ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నిస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో "తేరా జల్వా జిస్ నే దేఖా" మరియు జుగ్ను (1947) చిత్రంలో "వో అప్ని యాద్ దిలాన్ కో" పాటల కోసం తెరపై కనిపించాడు. 1948 – స్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్లాల్ నెహ్రూ చేతుల ద్వారా ప్రదానం చేయబడింది. 1967 – భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేయ బడింది. 2001 – హీరో హొండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా "బెస్ట్ సింగర్ ఆఫ్ ద మిలీనియం గౌరవ ప్రదానం. 2013 – సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు. 'చౌధవీఁ కా చాంద్ హెూ , తేరి "ప్యారీ ప్యారీ సూరత్ కో", "చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే", ''బహారో ఫూల్ బర్సావో", "మై గావూ తుమ్ సోజావో", "ఖిలోనా జాన్ కర్", "క్యా హువా తేరా వాదా", ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రంలోని ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ, ఎన్టీఆర్ 'ఆరాధన'లో నా మది నిన్ను పిలిచింది గానమై.. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన సిపాయి పాట నేటికీ తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి వుంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచిపోయారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# సినీ చరిత్రలో ఒక అద్భుతమైన అధ్యాయాన్ని లిఖించిన సి. కృష్ణవేణి - డిసెంబర్ 24...సి. కృష్ణవేణి జయంతి

సి. కృష్ణవేణి అంటే తెలుగు చలనచిత్ర రంగంలో ఒక మరుపురాని పేరు. నటిగా, గాయనిగా, నిర్మాతగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ మహిళ, తెలుగు సినీ చరిత్రలో ఒక అద్భుతమైన అధ్యాయాన్ని రాశారు. రాజమండ్రికి చెందిన కృష్ణవేణి, సినిమాలలోకి రాకముందు రంగస్థల నటిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1936లో 'సతీ అనసూయ/ధృవ' చిత్రంతో బాలనటిగా సినీ రంగప్రవేశం చేశారు. తరువాత కథానాయకిగా తెలుగులో 15 చిత్రాలలో నటించడమే కాకుండా, తమిళ మరియు కన్నడ భాషా చిత్రాలలో కూడా నటించారు. ప్రముఖ దర్శక-నిర్మాత మీర్జాపురం రాజాను వివాహం చేసుకున్న కృష్ణవేణి, తరువాత స్వయంగా అనేక సినిమాలు నిర్మించారు. తన భర్తతో కలిసి 'మానదేశం' వంటి క్లాసిక్ చిత్రాలను నిర్మించి తెలుగు సినీ రంగానికి అనేక మంచి చిత్రాలను అందించారు.

**కృష్ణవేణి ప్రత్యేకత:** కృష్ణవేణి తన అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను అలరించారు. ఆమె నటనలో సహజత్వం, భావోద్వేగం కనిపిస్తాయి. నటిగా మాత్రమే కాకుండా, కృష్ణవేణి మంచి గాయని కూడా. ఆమె పాడిన పాటలు ఇప్పటికీ ప్రేక్షకులను కదిలిస్తాయి. కృష్ణవేణి ఒక మంచి నిర్మాత కూడా. ఆమె నిర్మించిన చిత్రాలు అన్నీ కూడా ప్రేక్షకులను అలరించాయి. సినిమాల్లోనే కాకుండా, సామాజిక సేవలో కూడా కృష్ణవేణి చురుగ్గా పాల్గొన్నారు. కృష్ణవేణి తెలుగు చలనచిత్ర రంగానికి అనేక విధాలుగా కృషి చేశారు. ఆమె తన అద్భుతమైన నటన, గానం, నిర్మాణం ద్వారా తెలుగు సినిమాను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. ఆమె నటించిన చిత్రాలు ఇప్పటికీ ప్రేక్షకులకు స్ఫూర్తిగా నిలుస్తాయి. సి. కృష్ణవేణి తెలుగు చలనచిత్ర రంగపు ఒక అమూల్యమైన రత్నం. ఆమె తన అద్భుతమైన ప్రతిభతో తెలుగు సినీ చరిత్రలో చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆమె జీవితం మరియు కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**






# ఆధునిక ఆవిష్కరణల కేంద్రంగా క్వాంటమ్ వ్యాలీ

అమరావతి: ప్రస్తుతం అందరూ క్వాంటమ్ టెక్నాలజీ గురించే ఆలోచిస్తున్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఆధునిక పరిశోధల కేంద్రంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఉంటుందని చెప్పారు. వేలాది టెక్ విద్యార్థులతో ఆన్‌లైన్‌లో 'క్వాంటమ్ టాక్' నిర్వహించిన సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. అన్ని రంగా ల్లోనూ క్వాంటమ్ కంప్యూటింగ్ పనిచేయబోతోందన్నారు. క్యూబిట్, వైసర్ సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. "1970లో చైనా ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చింది. 1991లో భారత్‌లో ఆ సంస్కరణలు వచ్చాయి. ఆ తర్వాత ఎక్కడా వెనక్కి తిరిగి చూడలేదు. వ్యవసాయ రంగంలో సంస్కరణలతో ఆర్థికాభివృద్ధికి ముందడుగు పడింది. హరిత విప్లవంతో దేశ స్థితిగతులు సమూలంగా మారాయి. ఆహార ధాన్యాల విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించింది. సామాన్యుల సాధికారతే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం సంస్కరణలు తీసుకొస్తోంది. విశాఖకు చాలా ఐటీ కంపెనీలు వస్తున్నాయి. భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీ, టెక్నాలజీకి ఆ నగరం చిరునామాగా మారబోతోంది. తిరుపతిలో స్పేస్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాం" అని చంద్రబాబు వివరించారు.

# పీపీపీ విధానం లక్ష్యం అదే: మంత్రి సత్యకుమార్

విజయవాడ, డిసెంబర్ 23: ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల బాలికల నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ ఈరోజు (మంగళవారం) ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైద్య కళాశాలలో బాలికల వసతిగృహం నిర్మాణానికి జగన్ రూ. 5 కోట్లు కూడా ఇవ్వలేదని.. నిధులు ఇవ్వని వ్యక్తికి పీపీపీ కళాశాలల గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు.

ఈ కళాశాల వసతి గృహం భవనం నిర్మాణం పూర్తి చేయడంలో జగన్ చేతులెత్తేశారని విమర్శించారు. విద్యార్థులకు ఉన్నత వైద్య విద్య, ఉత్తమ చికిత్సే లక్ష్యంగా పీపీపీ విధానాన్ని ప్రభుత్వ అమలు చేస్తోందన్నారు. 80 శాతం పూర్తైన భవన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని మండిపడ్డారు.

త్వరలో మొత్తం 5 ఫ్లోర్లను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. సిద్ధార్థ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వసతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

**అందుకే పీపీపీ మోడల్ తెచ్చాం: ఎంపీ...** మెడికల్ కాలేజీ హాస్టల్‌కు 2017లోనే రూ.21 కోట్లు నిధులు మంజూరు చేశారని.. గత ప్రభుత్వం నిధులు నిలిపివేయటంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఎంపీ కేశినేని శివనాథ్ మండిపడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాగానే మిగిలిన నిధులు మంజురు చేసి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హాస్పిటల్‌కు కావలసిన నిధులను చంద్రబాబు,



మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిర్మాణాలకు అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చూస్తామని చెప్పారు. క్యాన్సర్ చికిత్సకు పూర్తి సౌకర్యాలతో ప్రత్యేక ఆసుపత్రి అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లోనూ కార్పొరేట్ వైద్యం అందేలా పీపీపీ మోడల్ తెచ్చామని ఎంపీ కేశినేని శివనాథ్ వివరించారు.

కాగా.. ఎంబీబీఎస్ విద్యార్థినులు, సీనియర్ రెసిడెంట్ మహిళా డాక్టర్స్ కోసం నూతన వసతి గృహ నిర్మాణ భవనాన్ని నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీ శా, అడిషనల్ డి. ఏమ్. ఈ వెంకటేష్, సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

# జనవరి 2 నుంచి టోకెన్లు లేకున్నా దర్శనానికి అనుమతిస్తాం: తితిదే ఛైర్మన్



తిరుమల: వైకుంఠద్వార దర్శన ఏర్పాట్ల కోసం రెండు నెలలుగా పనిచేస్తున్నామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం సబ్‌కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్‌పై బీఆర్ నాయుడు స్పందించారు. "టోకెన్లు లేకుంటే తిరుమలకు రానివ్వరంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. అలాంటి ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నా. తిరుమలకు వచ్చే వారికి అనుమతి నిరాకరించే హక్కు ఎవరికీ లేదు. టోకెన్లు ఉన్న భక్తులనే దర్శనానికి అనుమతిస్తామని చెప్పాం.

జనవరి 2 నుంచి టోకెన్లు లేకున్నా దర్శనానికి అనుమతిస్తాం. తిరుమలలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 8 వరకు వైకుంఠద్వార దర్శనం" అని తితిదే ఛైర్మన్ వివరించారు.




# ఏపీలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, సిబ్బంది నివాస ప్రాంతాల్లో అనిశా సోదాలు

అమరావతి: ఏపీలోని పలువురు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు సిబ్బందికి సంబంధించిన 14 నివాస ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. అవినీతి జరుగుతుందనే సమాచారంతో గత నెల 5, 6 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనిశా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 4 క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి మంగళవారం పలుచోట్ల అనిశా అధికారులు సోదాలు చేపట్టారు. విశాఖలోని జగదాంబ సెంటర్‌లో ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఎస్.మోహన్‌రావు, ఇద్దరు సిబ్బందికి చెందిన మొత్తం 4 చోట్ల అధికారులు సోదాలు చేపట్టారు. విజయనగరం జిల్లా భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ పందిళ్లపల్లి రామకృష్ణ, ఐదుగురు సిబ్బంది నివాస ప్రాంతాల్లో అధికారులు సోదాలు చేపట్టారు. అనంతపురం జిల్లా చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఇన్‌ఛార్జి మీనుల ప్రసాద్ బాబు, సీనియర్ అసిస్టెంట్, ఆ కార్యాలయంలోని ఓ ప్రైవేట్ వ్యక్తికి చెందిన నివాస ప్రాంతాల్లో అనిశా సోదాలు నిర్వహించింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న షేక్ మహమూద్, సీనియర్ అసిస్టెంట్, మరొక సిబ్బందికి చెందిన రెండు నివాస ప్రాంతాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు.

# కన్నతండ్రి ఘాతుకం.. ఇద్దరు కుమార్తెలను కాలువలోకి తోసేసి!

బొమ్మనహాళ్: ఓ తండ్రి తన ఇద్దరు కుమార్తెలను కాలువలోకి తోసేసిన ఘటన అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కల్లప్ప అనే వ్యక్తికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు సింధు, అనసూయ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదు, ఆరు తరగతులు చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇంటివద్దే ఉన్న కుమార్తెలకు తండ్రి మాయమాటలు చెప్పి హెచ్ఎల్‌సీ కాలువ దగ్గరకు తీసుకెళ్లాడు. మొదటగా పెద్ద అమ్మాయిని అందులోకి తోసేశాడు. చిన్న కుమార్తె అక్కడినుంచి పరుగెత్తడంతో మళ్లీ పట్టుకుని వచ్చి తోసేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కుమార్తెలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అతడిని గట్టిగా నిలదీశారు. కర్ణాటకలోని సిరిగేరి క్రాస్ వద్ద హెచ్ఎల్‌సీ కాలువలోకి తోసేశానని ఓసారి.. గ్రామ సమీపంలోని హెచ్ఎల్‌సీ కాలువలోకి



తోసేశానని మరోసారి చెప్పాడు. అంతలోనే అపస్మారక స్థితికి వెళ్లడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు కల్లప్పను ఆసుపత్రికి తరలించారు. బాలికల ఆచూకీపై పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పెద్దకుమార్తె అనసూయ మృతదేహాన్ని కాలువలో గుర్తించి బయటకు తీశారు.

చురకలు

## సంపాదకీయం

# రాజకీయ నాయకులు జెన్ జెడ్ పై ఎందుకు ఫోకస్ చేస్తున్నారు?

జెన్ జెడ్.. ఇప్పుడు వీళ్లదే రాజ్యం.. బంగ్లాదేశ్ లో ప్రభుత్వాన్ని కూల్చేశారు. షేక్ హసీనాను దేశం వదిలి పోయేలా చేశారు. ఇక నేపాల్ లో జెన్ జెడ్ యువత చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. విధ్వంసం సృష్టించారు. ఏకంగా ప్రధానిని పారిపోయేలా చేశారు. పాకిస్తాన్ లోనూ జెన్ జెడ్ నిరసనలు కొనసాగు తున్నాయి.. ఈ క్రమంలోనే రాజకీయ నాయకుల చూపు ఇప్పుడు జెన్ జెడ్ పైన పడింది. వారినే ప్రోత్సహిస్తున్నారు. రాజకీయాల్లో తట్టి లేపుతున్నారు. తమ రాజకీయ మనుగడకు ఒక పావుగా వాడుకోవాలని చూస్తున్నారు. రాజకీయ నాయకులు జెన్ జెడ్ పై ఎందుకు ఫోకస్ చేస్తున్నారు? కారణమేంటన్నది తెలుసుకుందాం. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో జెన్ జెడ్ యువత ప్రభావం రోజురోజుకు పెరుగుతోంది. ప్రపంచ రాజకీయాలను మార్చేస్తున్నారు. బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో ప్రభుత్వాలను కూల్చిన జెన్ జెడ్ నిరసనల తర్వాత ఇవన్నీ యువత శక్తికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ పరిణామాలతో రాజకీయ నాయకుల చూపంతా ఇప్పుడు జెన్ జెడ్ పైనే పడింది. ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం జెన్ జెడ్ పై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. తాజాగా జరిగిన కీలక సంస్థాగత సమావేశంలో పార్టీ నేతలను ఉద్దేశించి మాట్లాడిన పవన్.. పార్టీని బేస్ లెవల్ నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతను.. జెన్ జెడ్ ను.. జనసేన వైపు ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు. శక్తివంతమైన రాజకీయ కుటుంబాల చుట్టూ ఒక్క రాత్రిలో ఎదిగిన పార్టీల మాదిరిగానే జనసేనను నిర్మించలేమని పవన్ కళ్యాణ్ చెప్పారు. క్రమశిక్షణ, నిర్మాణం, కఠిన శ్రమతోనే పార్టీ ఎదగాలని షార్ట్ కట్స్ లేదా వారసత్వ రాజకీయాలపై ఆధారపడబోమని తేల్చిచెప్పారు. పార్టీ తన సొంత బలంపై నిలబడాలని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మార్చి 14న జరుగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఈసారి జెన్ జెడ్ థీమ్ తో నిర్వహించనున్నట్లు పవన్ ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతకు ప్రేరణ ఇచ్చేలా, వచ్చేతరం ముందు పార్టీ విజన్ ను స్పష్టంగా ఉంచేలా కార్యక్రమాలు రూపొందించనున్నట్టు తెలిపారు. ప్రపంచ రాజకీయాల్లో పెనుమార్పులకు శ్రీకారం చుడుతున్న జెన్ జెడ్ వైపు పవన్ మాత్రమే కాదు అగ్ర రాజకీయ నాయకుల చూపు మళ్లింది. వీరు వాడే టెక్నాలజీ , సోషల్ మీడియా వ్యూహాలను అర్థం చేసుకోవడం పాతతరం నేతలకు సవాల్ గా మారింది. రాబోయే ఎన్నికల్లో ఈ యువతే నిర్ణయాత్మక శక్తి అని నాయకులు గుర్తించారు. కేవలం హామీలతో సరిపెట్టకుండా.. యువతకు ఉద్యోగాలు, పారదర్శకత చూపించకపోతే తమ పరిస్థితి కూడా హసీనా, ఓలీల లాగానే మారుతుందని భయపడుతున్నారు. జెన్ జెడ్ కేవలం ట్రెండ్ లను ఫాలో అవ్వడమే కాదు. ట్రెండ్ లను సెట్ చేస్తోంది. రాజకీయాల్లోనూ కొత్త మార్పులను కోరుతోంది. బంధుప్రీతిని, అవినీతిని సహించబోమంటూ వీరు ఇస్తున్న నినాదాలు రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయా? లేదా అస్థిరతకు దారితీస్తాయా? అనేది వేచిచూడాలి.

# డిసెంబర్ 24...అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం



భూమిపై జీవాల మధ్య భేదాన్నే 'జీవవైవిధ్యం' అంటాం. సృష్టిలో గల జీవరాశులలో ఏ ఒక్కటి అధికం కాదు, ఏదీ తక్కువ కాదు. అన్ని సమానమే. అన్ని ఒకదాని మీద ఒకటి ఆధారపడి జీవనం సాగిస్తుం టాయి. మనిషి తన ప్రతి అవస రానికి ప్రకృతి మీద ఆధార పడ తాడు. ప్రకృతి లేనిదే మనిషి జీవితం లేదు. ఇది గమనించిన భారతీయ ఋషులు జీవ వైవిధ్య చక్రం సక్రమంగా సాగేలా, మనిషి వాటిలో కల్పించుకునే వీలు లేకుండా మానవ ధర్మాలను వివరించారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవంను డిసెంబర్ 24 న జరుపు కుంటారు. నేడు భూమిపై ఉన్న అనేక మిలియన్ల వివిధ జాతుల జీవ వైవిధ్యం సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల పరిణామం. మన జీవన శైలితో పర్యావరణం కాలుష్యం చెందడంతో భూగోళం వేడెక్కిపోతుంది. దీంతో జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. వివిధ కారణాల వల్ల ఎన్నో జీవ జాతులు అంతరించి పోతున్నాయి. ప్రపంచంలోని 12 మహా జీవ వైవిధ్య ప్రాంతాలలో భారత దేశం ఒకటి. సుమారు 45 వేల వృక్ష జాతులు, దాదాపు 77 వేల జంతు జాతులు ఈ దేశంలో గతంలో ఉండేవి. కారణాంతరాల వల్ల అనేక జీవాలు కనుమరుగు అవుతు న్నాయి. నేడు జీవ సంపదలో 10 శాతానికిపైగా ప్రమాదంలో ఉంది. వాటిలో చాలా జాతులు అంతరించి పోయే దశలో ఉన్నాయి. గత కొన్ని దశాబ్దాలలో 50 శాతానికి పైగా అరణ్యాలు, 70 శాతానికి పైగా నీటి వనరులు మృగ్యమై పోయాయి. విస్తారంగా ఉన్న పచ్చిక బయళ్ళను స్వార్థ ప్రయోజనాల కోసం రూపు మాపడం జరిగింది. అరణ్యాలలోని వన్యప్రాణుల్ని వేటాడి మరీ అంత మొందించడం నిత్య కృత్యం అవుతున్నది. వ్యవసాయంలో రసాయనిక ఎరువులకు, కీటక నాశనులకు ప్రాధాన్యత పెరిగింది. మందుల కంపెనీల లాభాపేక్ష వాటిని అధికంగా, విచక్షణా రహితంగా వాడేలా చేస్తున్నది. దీంతో నేలను, దానిపై నివసించే విలువైన జీవ సంపదను కోల్పోవాల్సి వస్తున్నది. అత్యధిక కీటక నాశనులను ఉత్ప త్తి చేసే దేశంగా భారత్ విరాజిల్లు తోంది. ఇటువంటి అవాంఛనీయ చర్యల వల్ల దారుణంగా నష్ట పోతున్నాం. అంతే కాదు ఎన్నో జీవ జాతులు కాల క్రమంలో అంతరించి పోయాయి. భారత దేశంలో ఆదివాసులు (గిరిజనులు, కొండజాతి ప్రజలు) అధికంగా ఉన్నచోట జీవ వైవిధ్యం ఎక్కువగాను, పదిలంగానూ ఉంది. మన దేశంలో 53 మిలియన్ల కంటే ఎక్కువ మందే ఆదివాసులు నివసి స్తున్నారని సర్వేలు చెబు తున్నాయి. వారిలో దాదాపు 53 తెగలున్నాయి. మేఘాలయ, నాగా లాండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్‌లో 80 శాతాని కంటే ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారు. అక్కడే జన్యు వైవిధ్యం కూడా ఎక్కువగా ఉంది. ఎన్నో పంటలలో వైవిధ్యాలు, రకాలు, ఆదివాసులు నివాసాలున్న ప్రాంతాలలోనే అధికం. ఇటీవల జన్యుమార్పిడి కూడా జీవ వైవిధ్యాన్ని దెబ్బ తీస్తోంది. వీటిని రూపొందించే, ప్రవేశపెట్టే విషయాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రక్షణ సంబంధమైన నియంత్రణలను పాటించాలి. జన్యు మార్పిడి వల్ల వచ్చే ప్రభావాలు స్వల్ప కాలంలో, దీర్ఘకాలంలో ఎలా ఉంటాయో పూర్తి అధ్యయనం చేయకుండా వీటిని ఏ జీవ జాతుల్లోనూ ప్రవేశ పెట్ట కూడదు. తొందర పడితే ప్రస్తుతం మనుగడ లోని జీవజాతికే ప్రమాదం వాటిల్లు తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ సృష్టిలో అన్నిటిలో ఏకత్వం ఎంత ఉందో, భౌతికంగా, మానసికంగా భిన్నత్వం కూడా అంతే ఉంది. వైవిధ్యమే సృష్టి లక్షణం అంటారు స్వామి వివేకానంద. వ్యవసాయ పద్ధతులే కావచ్చు, జీవన విధానమే కావచ్చు, ఆహారపు అలవాట్లే కావచ్చు, అన్ని సృష్టి చక్రానికి లోబడే ఉంటాయి. చెరువులో ఉండే కీటకాలను తిని కప్ప జీవిస్తుంది. కప్పను తిని పాము జీవిస్తుంది, పామును గద్ద తింటుంది, గద్ద మరణించాక దాన్ని క్రిములు తిని భూమిలో కలిపే స్తాయి. అది మొక్కలకు ఎరువుగా మారుతుంది. ఇదంతా ఒక గొలుసు కట్టు విధానం, ఒక నిరంతర ఆవృత వృత్తం. వీటిలో ఏ ఒక్క ప్రాణి అంతరించినా మిగితా అన్నిటి మీద ప్రత్యక్షంగా తీవ్ర ప్రభావం ఉంటుంది, మిగతా ప్రాణుల మీద పరోక్షంగా ముప్పు ఉంటుంది. ఇలా జగత్తులో అనేక వృత్తాలు ఉంటాయి. వాటిలో మనిషి ఏ మాత్రం జోక్యం చేసుకున్నా అది వినాశనానికి దారి తీస్తుంది, ఏ ఒక్క జీవి అంతరించినా, మానవ మనుగడ ప్రశ్నార్ధకమవుతుంది. అనారోగ్యాలకు చికిత్స, వైద్యం చేయడానికి జీవవైవిధ్యం చాలా ముఖ్యం. అనేక మొక్కలు, జంతు వులు, శిలీంధ్రాలను మందుల తయారీకి వాడడం చూస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఏటా వేలాది జాతుల జీవరాశులు అంతరించి పోతున్నాయి. వాతావరణ సమతుల్యానికి, పర్యావరణ పరి రక్షణకు జీవరాసులను కాపాడు కోవాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇందుకోసం చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన తరుణం ఆసన్నమైంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# అపోలో 8 మిషన్ విశ్వాన్వేషణలో తొలి అడుగు - డిసెంబర్ 24, 1968...మానవ చరిత్రలో చారిత్రాత్మక రోజు



డిసెంబర్ 24, 1968, అంతరిక్ష పరిశోధనలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిన రోజు. ఆ రోజు, నాసా చేపట్టిన అపోలో 8 మిషన్ చంద్రుడి కక్ష్యలోకి చేరింది. ఇది మానవుల అంతరిక్ష పరిశోధనకు కీలక ఘట్టంగా నిలిచింది. అపోలో 8 మిషన్ ద్వారా మానవులు తొలిసారి చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించి, చంద్రుడి చుట్టూ పరిభ్రమించిన చరిత్ర సృష్టించారు. అపోలో 8 మిషన్, అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన అపోలో ప్రోగ్రామ్‌లో భాగంగా జరిగింది. 1968 డిసెంబర్ 21న, కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ మిషన్ ప్రారంభమైంది. వ్యోమగాములు ఫ్రాంక్ బోర్మన్, విలియం ఆండర్స్, జేమ్స్ లవెల్ చంద్రుడి కక్ష్యలోకి వెళ్లిన తొలి మానవులుగా నిలిచారు. డిసెంబర్ 24న అపోలో 8 చంద్రుడి కక్ష్యలో ప్రవేశించింది. వ్యోమగాములు చంద్రుడి చుట్టూ 10 సార్లు పరిభ్రమించారు. ఆ ప్రయాణంలో, వారు భూమి వైపు తిరిగి చూసి ప్రపంచానికి "ఎర్త్‌రైజ్" అనే ప్రసిద్ధ ఫొటో పంపారు. ఆ ఫోటో భూమిని చంద్రుడి నుండి ఆకాశంలో ఒక నీలి గోళంలా చూపిస్తుంది. ఇది భూమి అందాన్ని, పర్యావరణ పరిరక్షణను గుర్తుచేసే అత్యంత ప్రభావవంతమైన దృశ్యాల్లో ఒకటిగా నిలిచింది. డిసెంబర్ 24, 1968న అపోలో 8 నుంచి వ్యోమగాములు చందమామ నుంచి ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ఈ ప్రసారంలో వారు బైబిల్లోని ఆదికాండం మొదటి అధ్యాయాన్ని చదివి, ప్రపంచ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇది చరిత్రలో అత్యధికంగా వీక్షించబడిన ప్రత్యక్ష ప్రసారముగా నిలిచింది. వారి సందేశం ప్రపంచ ప్రజలందరికీ శాంతి, సామరస్యానికి ప్రేరణ ఇచ్చింది. అపోలో 8 మిషన్, మానవుడు చంద్రుడిపై అడుగు పెట్టడానికి మార్గదర్శకమైంది. ఈ మిషన్ ద్వారా నాసాకు చంద్రుడి గురుత్వాకర్షణ, రేడియేషన్ స్థాయిలు వంటి అనేక ముఖ్యమైన సమాచారం లభించింది. అపోలో 8 మిషన్ విజయవంతమవడం, అంతరిక్ష పరిశోధనలో సాంకేతిక సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది. చంద్రుడి కక్ష్యలో ప్రవేశించి సురక్షితంగా భూమికి తిరిగి రావడం మానవ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. "ఎర్త్‌రైజ్" ఫొటో ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. భూమి ప్రకృతి అందాలను కాపాడాల్సిన బాధ్యతను గుర్తు చేసింది. ఇది ఆపై పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు స్ఫూర్తిగా మారింది. మానవజాతి ఐక్యతకు సంకేతంగా మారి, ఈ మిషన్, మానవజాతి ఏకమై ఉన్నత లక్ష్యాలు సాధించగలదని ప్రపంచానికి సందేశం అందించింది. డిసెంబర్ 24, 1968, అంతరిక్ష పరిశోధన చరిత్రలో చిరస్మరణీయమైన రోజు. అపోలో 8 మిషన్ ద్వారా మానవజాతి తన శాస్త్ర, సాంకేతిక ప్రగతిని చాటింది. ఈ రోజు మానవుల ఆత్మవిశ్వాసాన్ని, భవిష్యత్తు శోధనలకు నాంది పలికింది. "ఎర్త్‌రైజ్" ఫొటో మన భూమి విలువను గుర్తుచేస్తూ, మనం సంరక్షించాల్సిన బాధ్యతను తెలియజేస్తుంది. అపోలో 8 మిషన్ మానవ చరిత్రలో శాశ్వతంగా నిలిచే ఒక అద్భుత విజయగాథ.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# డిసెంబర్ 24...జాతీయ వినియోగ దారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం




వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం.. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల యొక్క హక్కు అని అర్థం. భారత దేశంలో 1986లో వినియోగ దారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. భారత రాష్ట్రపతి ఆమోదంతో 1986 డిసెంబర్ 24న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ చట్టం ప్రకారం వినియోగ దారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగ దారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాద కారక వస్తువులు, సేవల నుంచి రక్షణ పొందే హక్కు... అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు, సేవలను పొందాలి. సమాచారం పొందే హక్కు...అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగ దారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియ జేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు...వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసు కోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. ప్రాతినిధ్యం వహించే హక్కు...వినియోగ దారుల ఆసక్తిని, వారి అవసరాలను సరైన వేదికలు, ఫోరంలలో వినిపించడం. వినియోగ దారుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన వివిధ వేదికలలో ప్రాతినిధ్యం వహించడం. వినియోగ దారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, వస్తు లోపాల నుండి పరిహారం పొందే హక్కు... వినియోగ దారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగ దారుల విద్య హక్కు... వినియోగ దారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచు కోవడం, నైపుణ్యాలను పెంపొందించు కోవడం ఎంతో అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగ దారులు హక్కుల పట్ల అవగాహన లేక ఎంతో మోస పోతున్నారు. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈ-కామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రజలను మోసగించే సైబర్ నేరాలు దీని వల్ల చోటుచేసు కుంటున్నాయి. వినియోగ దారులను తప్పుడు ప్రకటనలు, సందేశాలతో మోసగించడం పెరిగి పోతున్నది. దీంతో వినియోగ దారుల హక్కుల రక్షణ కోసం కొత్త చట్టాల ఆవశ్యకత ఏర్పడింది. 1986నాటి చట్టం స్థానంలో 2019లో మరో చట్టాన్ని రూపొందించారు. అది ఈ 2020 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. వాణిజ్య వ్యాపారాల్లో, ప్రభుత్వ యంత్రాంగంలో, సేవా సంస్థల్లో పనిచేసే వారు నిర్లక్ష్యంగా, మోస పూరితంగా వ్యవహరించి నప్పుడు కఠిన చర్యలు తీసుకు నేందుకు ప్రపంచం లోని చట్టాలన్నింటి కన్నా మెరుగ్గా భారత దేశంలో తొలిసారి 1986లో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని రూపొందించారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుముతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. ఇప్పుడు సైబర్ నేరాల కారణంగా దాని స్థానంలో కొత్త చట్టాన్ని తెచ్చారు. ఈ నూతన చట్టాన్ని 2020 జూలై 20 నుంచి దేశవ్యాప్తంగా అమలు పరుస్తున్నారు. వినియోగ దారులకు తక్కువ ఖర్చులో, ఇబ్బందులకు తావు లేని రీతిలో, శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో దేశ వ్యాప్తంగా వేరు వేరు స్థాయిలలో వినియోగదారు వేదికలను నెలకొల్పడం జరిగింది. వినియోగదారు రక్షణ చట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కార సంస్థల ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. (ఎ) కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. (బి). కేంద్ర ప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే రాష్ట్ర వినియోగదారు పరిష్కార సంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. (సి). రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఆ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఏర్పాటు చేసే వినియోగదారు వివాదాల పరిష్కార వేదిక. ఈ కోర్టునే డిస్ట్రిక్ట్ ఫోరమ్ గా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ- జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం.. అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 30 రోజులకు బదులుగా 45 రోజులుగా కాలవ్యవధిని నిర్ణయించారు. రాష్ట్ర కమిషన్‌లో ప్రెసిడెంట్‌తో పాటు విధిగా నలుగురు సభ్యులుండాలి. రెండు బెంచీలు నిర్వహించి వినియోగ దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషిచేయాలి. ఈ మేరకు రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అధ్యక్షులు, సభ్యుల నియామకం కాలాన్ని ఐదేండ్లకు బదులు నాలుగేండ్లకు కుదించారు. గరిష్ఠ వయస్సు 65 ఏండ్లుగా నిర్ణయించారు. రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో వినియోగ దారుల హక్కుల పరిరక్షణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. నూతన వినియోగ దారుల హక్కుల పరిరక్షణ చట్టంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో, కళాశాల, విశ్వ విద్యాలయాల్లో పాఠ్య పుస్తకాల్లో, పాఠ్యాంశాల్లో వినియోగ దారుల విద్య, చట్టం ప్రాధాన్యం, అమలుపై గురించి తెలియ జేయాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ధర్మపురితో పివి అనుబంధం...




పాములపర్తి వెంకట నరసింహా రావుకు ధర్మపురి క్షేత్రంతో అవినాభావ సంబంధం ఉంది. బ్రాహ్మణ అగ్రహారమైన ధర్మపురి వాసులతో బంధుత్వం లేకున్నా, ఇక్కడి శ్రీ నృసింహ గురు పీఠం తో, అలాగే సమకాలీన రాజకీయాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న, నాయకులతో గల సన్నిహిత సంబంధాల దృష్ట్యా, తరుచుగా వి.వి. క్షేత్రానికి వస్తూ పోతూ ఉండేవారు. అష్టాదశ పురాణములను ఔపోసనం పట్టి, నిత్య పురాణ ప్రవచనాలతో భక్తులను ఆధ్యాత్మిక లోకాలలో విహరింప చేసిన, అపర శుక యోగేంద్రునిగా పేరుగాంచిన గుండి రాజర్షి వద్దకు వచ్చి, శ్రద్ధగా విని, సందేహ నివృత్తి చేసుకున్న నేపథ్యం, అపర ధన్వంతరి, నాటక సంస్థ స్థాపకులు, దర్శకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి కాసర్ల వెంకట రాజయ్య, కొరిడే కిష్టయ్య, వొజ్జల కోటయ్య, పాత కాంతయ్య, పెండ్యాల లక్ష్మీ నరహరి, పానుగంటి బాపు, తదితరులతో, కొరిడే కిష్టయ్య ఇంటి అరుగుపై రోజుల కొద్దీ రాజకీయ చర్చలు చేసిన విషయాలు క్షేత్ర పాతతరం వారికి నిత్య జ్ఞాపకాలుగా ఉన్నాయి. 1967లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా, లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న పి.వి. తర్వాత సీఎం బ్రహ్మానంద రెడ్డి, ఆర్థిక మంత్రి మర్రి చెన్నారెడ్డిలతో చర్చించి, స్థానికులు స్వాతంత్ర్య సమర యోధులు సమరయోధుడు కే.వీ. కేశవులకు ఏక సభ్య దేవస్థాన పునరుద్ధరణ కమిటీ బాధ్యులుగా నియమింప చేసి, దేవాలయాల అభివృద్ధికి, శ్రీ వెంకటేశ్వర విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలకు పి.వి. చేయూత అందించారు. ధర్మపురి క్షేత్రంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సహకారంతో నిర్వహించ బడిన శ్రీ రాజ రాజేశ్వర వెంకటేశ్వర సంస్కృత పాఠశాల కోసం శాశ్వత భవనం నిర్మించాలని, నాటి దేవస్థాన పాలక వర్గ కమిటీకి సూచించి, 1970 అక్టోబర్ 2న రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా, శంకు స్థాపన చేశారు. తర్వాత సదరు పాఠశాల భవనం 1976 ఆగస్టు 11న నాటి రాష్ట్ర వ్యవసాయ, రవాణా శాఖల మంత్రి జువ్వాడి చొక్కారావు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి రాజా సాగి సూర్య నారాయణ రాజు చేతుల మీదుగా ప్రారంభం చేసుకోవడం జరిగింది. 1971 శాసనసభ సార్వత్రిక ఎన్నికల సమయంలో సీఎం హోదాలో నాటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి. రాములుకు మద్దతుగా ధర్మపురి లో ప్రచార సభలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా గోదావరి నుండి త్రాగు నీటి సరఫరా పథకం మంజూరీ ఇచ్చి, దివంగత ఎమ్మెల్యే వెలిచాల జగపతి రావును నీటి సరఫరా పథకం పనులు చేయాలని కోరడం జరిగింది. తమ సన్నిహితులు రొట్టె విశ్వనాథ శాస్త్రి కోరిక పై స్థానిక లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలని నాటి కరీంనగర్ కలెక్టర్ కే. ఎస్. శర్మను ఆదేశించారు. సదరు కళాశాల భవనాన్ని లాభాపేక్ష లేని స్థానిక కాంట్రాక్టర్ సంగి కిష్టయ్య నిర్మాణం గావించారు. నాటి ఎమ్మెల్యే జువ్వాడి రత్నాకర్ రావు అభ్యర్థనపై పలు నిధులు మంజూరు చేశారు. 1945 నుండి పి.వి.కి ధర్మపురి నేతలతో సన్నిహిత సంబంధాలు ఉండేవని, ఆయన సమకాలిక నేత, పలువురు కాంగ్రెస్ అగ్ర నాయకు లతో సాన్నిహిత్యం కలిగి ఉన్న దాదా గారి కిషన్ రావు చెప్పేవారు. క్షేత్రంలో గోదావరి రక్షిత మంచినీటి సరఫరా పథకం, తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మశాల, సంస్కృత పాఠశాల భవనం, ఓరియంటల్ డిగ్రీ కళాశాల భవనం పి.వి. చొరవ వల్లనే సాధ్య మైనాయని పి.వి. సన్నిహితులు, ప్రభుత్వ సన్మానితులు, నరసింహా పీఠ నిర్వాహక బాధ్యులు బ్రహ్మశ్రీ రొట్టె విశ్వనాథ శాస్త్రి చెపుతుండే వారు. సాంప్రదాయ పద్య నాటకంలో తన ప్రదర్శన తిలకించి "నట కిరీటి" బిరుదుతో గౌరవించి, సన్మానించిన సంఘటనను, తమ ఇంటిలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యాలయంలో నెల రోజులు బిజీగా పార్టీ పటిష్టతకు అంకిత భావంతో పనిచేసిన, తనతో పాటే నిద్రించిన నేపథ్యాన్ని విశ్వనాథ శాస్త్రి తరుచూ గుర్తు చేసుకునే వారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# పిలుస్తోంది.. ప్రకృతి ఒడి..!

కొత్తగూడెం: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రం ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు సిద్ధమవుతోంది. డిసెంబర్ 29న కనువిందు చేసే తెప్పోత్సవం, 30న అత్యంత పవిత్రమైన ఉత్తర ద్వార దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరానున్నారు. రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు పర్యాటకంగా ఆకట్టుకునే ప్రాంతాలు భద్రాద్రి జిల్లాలో కొలువై ఉన్నాయి.

**వనవాస స్మృతుల వేదిక..**

భద్రాచలం నుంచి 35కిలోమీటర్ల దూరంలో గోదావరి తీరాన వెలిసిన పర్ణశాల.. రామాయణ కావ్యాన్ని కళ్లముందుంచే ఒక అద్భుత దృశ్యం. సీతాదేవి స్నానమాచరించి తన నారచీరలను ఆరవేసిన గుర్తులు ఇక్కడి రాళ్లపై ఇప్పటికీ దర్శనమిస్తాయి. పర్ణశాల వద్ద గోదావరి నదిలో భక్తులు బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను వీక్షించవచ్చు. పర్ణశాల సమీపంలోని 'గుండాల' వద్ద భూమిలో నుంచి వేడినీరు ఉబికి రావటం ఒక ప్రకృతి వింత. భక్తులు ఇక్కడ స్నానం చేయటాన్ని పవిత్రంగా భావిస్తారు.

**అరుదైన జంతుజాలాలకు వేదిక 'పులిగుండాల'**

పచ్చని అడవులు, అరుదైన పక్షిజాతులు, జంతువులు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు.. ఇలా ప్రకృతి అందాలకు చిరునామాగా మారాయి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కనకగిరి గుట్టలు, పులిగుండాల అటవీప్రాంతం. ఇక్కడ ఎకో టూరిజం అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. పర్యాటకులు కనకగిరి కొండ వ్యూ పాయింట్ ద్వారా ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తున్నారు.

**కనువిందు చేసే కిన్నెరసాని అందాలు**

దట్టమైన అడవులు, ఎత్తైన కొండల మధ్య నిర్మించిన కిన్నెరసాని ప్రాజెక్టు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పర్యాటకశాఖ ఇక్కడ బోటింగ్ సదుపాయాన్ని కల్పిస్తోంది. నీలిరంగు నీటిపై పడవలో ప్రయాణిస్తూ.. చుట్టూ ఉన్న కొండలను చూస్తుంటే ఏదో తెలియని ప్రశాంతత



కలుగుతుంది. జలాశయం మధ్యలో అక్కడక్కడా కనిపించే చిన్నచిన్న దీవులు ప్రకృతి ప్రేమికులకు పసందైన విందును అందిస్తాయి. కిన్నెరసాని పర్యటనలో పిల్లలు, పెద్దలను సమానంగా ఆకట్టుకునే మరో ప్రదేశం జింకల పార్కు. ఇక్కడ వందలాది జింకలు తమ సహజసిద్ధమైన వాతావరణంలో స్వేచ్ఛగా విహరిస్తుంటాయి. అద్దాలమేడ, కాటేజీల నుంచి ప్రాజెక్టును వీక్షించటం ద్వారా మధురానుభూతి పొందవచ్చు.

**మరిన్ని చూడదగిన ప్రాంతాలు..**

దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్పలో పంటపొలాలు, ఆదివాసీ ఆవాసాలు, ఆహార అలవాట్లను పరిశీలించవచ్చు. పర్యాటకుల కోసం ఇక్కడ ప్రత్యేకంగా క్యాంప్ ఫైర్, రేలా నృత్య ప్రదర్శనలు ఉండనున్నాయి.భద్రాచలంలో గిరిజన మ్యూజియం మరింత ఆకర్షణగా నిలవనుంది. ముక్కోటి వేడుకలకు వచ్చే భక్తులు.. ఆదివాసీ గిరిజనుల సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఇదో చక్కని వేదిక.

భద్రాచలం గోదావరి గట్టుపైన సెల్ఫీ పాయింట్ ద్వారా గోదావరి నది అందాలను బంధించవచ్చు.

# గుట్టుగా కొని.. సరిహద్దు దాటించి

నిర్మల్ : రాష్ట్రం, ప్రదేశాలు, పరిస్థితులను బట్టి కొన్ని వస్తువుల ధరల్లో హెచ్చుతగ్గులుంటాయి. వంటగ్యాస్ ఇదే కోవలోకి వస్తుంది. నిత్యావసరమైన గ్యాస్ ధరలు మన ప్రాంతంతో పోలిస్తే మహారాష్ట్రలో తక్కువగా ఉన్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు దళారులు గుట్టుగా గ్యాస్ సిలిండర్లను సరిహద్దు దాటిస్తున్నారు.


**అక్కడి వారి సహకారంతో..**

జిల్లాకు చెందిన కొందరు దళార్లు పొరుగు రాష్ట్రంలోని నాందేడ్, ధర్మాబాద్ ప్రాంతాల గ్యాస్ డీలర్ల సహకారంతో ఈ తంతు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మన ప్రాంతంలోని ఖాళీ సిలిండర్లను అక్కడకు తీసుకెళ్లి వారివద్ద సిలిండర్లు తీసుకుంటున్నారు. మన ప్రాంతంతో పోలిస్తే అక్కడ గృహావసరాలకు వినియోగించే సిలిండర్ ధర రూ.51 వరకు తక్కువ కాగా, వాణిజ్య సిలిండర్ ధర రూ.170 వరకు తక్కువగా లభ్యమవుతోంది. అక్కడ పెద్దమొత్తంలో సిలిండర్లను కొనుగోలు చేస్తూ స్థానికంగా ఎక్కువ ధరతో విక్రయిస్తున్నారు.

తానూరు, కుభీరు, కుంటాల, సారంగాపూర్ మండలాల పరిధిలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలున్నాయి. వీటిలో ప్రధాన రహదారులే కాకుండా అంతర్గతంగా ఉండే అనువైన ప్రాంతాల నుంచి సిలిండర్లను తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎక్కువ వ్యాపారం జరిగే హోటళ్లను సైతం తమ విక్రయకేంద్రాలుగా మార్చుకుంటున్నారు.

వాహనాల్లోనూ..గ్యాస్ సిలిండర్లతో నడిచే వాహనాల వినియోగమూ




ఎక్కువగానే ఉంది. ఎల్‌పీజీ ఫిల్లింగ్ కేంద్రాలతో పోలిస్తే నేరుగా సిలిండర్ నుంచి గ్యాస్ నింపుకోవడం ఖర్చు తక్కువవుతుంది. అద్దెకార్లు తిప్పేవారు ఎక్కువగా ఇలా రాయితీపై వచ్చే సిలిండర్లను తమ అవసరాలకు వాడుతున్నారు.

**నెలకు రూ.3 లక్షలకు పైగా వ్యాపారం**

ప్రధానంగా 14.2 కిలోలు, 19 కిలోల సిలిండర్లను ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. సగటున రోజుకు 80 వరకు గృహావసర సిలిండర్లు, 40 వరకు వాణిజ్య సిలిండర్లు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన రోజుకు రూ. 10,800, నెలకు రూ. 3.24 లక్షలు చొప్పున వారికి గిట్టుబాటవుతోంది. ఇందులో రవాణా, ఇతరత్రా ఖర్చులు పోయినా 2 లక్షలకు పైగానే వెనకేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

**ఆపేవారెవరు**సరిహద్దు ప్రాంతాల్లో గతంలో ఉన్న తనిఖీ కేంద్రాల ఎత్తివేత కూడా వీరికి కలిసొచ్చినట్లయ్యింది. అడిగేవారు, ఆపేవారు లేకపోవడంతో చాలా సులభంగా సరిహద్దు దాటిస్తున్నారు. పరిశీలించి చూస్తే తప్ప వేబిల్లు, పన్ను చెల్లింపుల వ్యవహారం గుర్తించడం కష్టం.

# పట్టుగొమ్మల.. ప్రగతి రెమ్మలు



తాండూరు: పంచాయతీలో నూతన పాలకవర్గం త్వరలో కొలువుదీరనుంది. వీరంతా ప్రధానంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాల్సి ఉంది. రెండేళ్లుగా సర్పంచులు లేక పల్లెల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వీటిని పరిష్కరించేవారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దేశానికి పట్టుగొమ్మలైన పల్లెలను ప్రగతి పథంలో నడిపించాల్సిన గురుతర బాధ్యత వీరిదే. ఈ నేపథ్యంలో ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశాలు ఇలా..

**పారిశుధ్యం**

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యం సక్రమంగా ఉండడం ముఖ్యం. పరిసరాల పరిశుభ్రతతో పాటు మురుగు కాల్వల నిర్వహణ సజావుగా సాగాలి. వీధుల్లో చెత్త లేకుండా నిరంతరం చర్యలు తీసుకోవాలి.

**విద్యా ప్రమాణాల మెరుగు:**

ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేయాలి. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యే చూడాలి. క్రీడలు సాధన చేసేలా సౌకర్యాలు కల్పించాలి.

**స్వచ్ఛమైన తాగునీరు**

స్వచ్ఛమైన తాగునీరు అందించడం పంచాయతీ ప్రథమ లక్ష్యాల్లో ఒకటి. కలుషిత నీటితో రోగాలబారిన పడకుండా ఉండేలా ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు అందించాలి. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తూ పైపులైన్లు లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**వైద్య సేవలు**

ప్రజల అనారోగ్య సమస్యలపై దృష్టి సారించాలి. స్థానికంగా ప్రాథమిక వైద్యం అదే విధంగా చర్యలు చేపట్టాలి. కాలానుగుణ, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

**వీధి దీపాలు**

వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలి. అన్ని వార్డుల్లో దీపాలు వెలిగేలా బల్బులు అమర్చాలి. నిరంతరాయం వెలగకుండా చూడాలి. వృథా అరికట్టి, బిల్లుల భారం లేకుండా చూడాలి.

**సమావేశాలు**

పంచాయతీలో ప్రతి నెలా తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి. రెండు నెలలకు ఒకసారి గ్రామసభ నిర్వహించి ప్రజా సమస్యలపై చర్చించి ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

దారుల నిర్మాణం

అంతర్గత రహదారులు నిర్మించాలి. పంచాయతీ నిధులతో అవసరమైన మరమ్మతులు చేపట్టడమే కాకుండా 'ఉపాధి' నిధులతో సీసీ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

ఉపాధి

గ్రామంలోనే స్థానికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధిహామీ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుని పలు అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా పథకం ద్వారా అవసరమైన పనులు ప్రతిపాదించాలి.

# మహమ్మారికి 'చెక్'



వికారాబాద్ : మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'ఆరోగ్య మహిళా' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేకంగా 8 రకాల.. గుర్తించిన వ్యాధులపై చికిత్స అందిస్తున్నారు. ప్రత్యేక పరీక్షల్లో మహిళలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడుతున్నట్లు గుర్తించారు. యుక్త వయసులోని వారు ఎక్కువ మంది ఉంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ముందు జాగ్రత్తగా హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమ వైరస్) టీకా ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టనుంది. వైద్యులు, ఇతర సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జనవరిలో కార్యక్రమం ప్రారంభించొచ్చని వైద్యశాఖాధికారులు చెబుతున్నారు.

**వైద్య సిబ్బందికి శిక్షణ..**

జిల్లాలో పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు టీకాలిచ్చే విధానాలపై శిక్షణ అందిస్తున్నారు. ఈనెల 16న కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. త్వరలో మార్గదర్శకాలపై అవగాహన కల్పించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్టాఫ్‌నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశాలకు శిక్షణ కార్యక్రమం పూర్తి కావొస్తోంది. జిల్లాలోని 14-15 ఏళ్ల మధ్య వయసున్న కిషోర బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నారు. విద్యాశాఖ నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

**హార్మోన్ల మార్పులు జరిగే వేళ..**

కిషోర బాలికలు కొందరికి హార్మోన్ల మార్పులు జరిగే వేళ ఇన్‌ఫెక్షన్లు సోకి క్యాన్సర్‌కు దారితీసే అవకాశాలున్నాయి. దీనికి వెంటనే చికిత్స తీసుకోకుంటే చికాకు, నొప్పితోపాటు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదముంది. మల, మూత్ర విసర్జన అనంతరం సరైన పరిశుభ్రత పాటించకపోవడంతోనూ ఇన్‌ఫెక్షన్ ఏర్పడి సమస్యలు తలెత్తుతాయని వైద్యులు తెలిపారు.

**మార్గదర్శకాలు రానున్నాయి.. : డా.స్వర్ణకుమారి, జిల్లా వైద్యాధికారిణి**

క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాక్సిన్ ఇంకా సరఫరా చేయలేదు. దీనిపై శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వచ్చే నెల హెచ్‌పీవీ టీకా ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించవచ్చు. ప్రభుత్వం విడుదల చేసే మార్గదర్శకాలకు అనుగుణంగా అందిస్తాం.

**విద్యార్థినులతోపాటు ఇతర బాలికలకు.. : డా.రవీంద్రయాదవ్, జిల్లా ఉప వైద్యాధికారి**

జిల్లాలో 14-15 ఏళ్ల బాలికలు ఎంతమంది ఉన్నారో సమాచారం సేకరిస్తున్నాం. విద్యార్థినులకు, అర్హత ఉన్న ఇతర బాలికలకూ టీకా ఇవ్వనున్నారు. క్యాన్సర్ టీకాపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం.

# దేవుడికే ఎసరు.. మిగిలింది కొసరు

బొమ్మలరామారం : ఆలయ భూముల ఆలనాపాలనా చూడాల్సిన వారే వాటిని అమ్ముకుంటున్నారు. దేవాదాయ, రెవెన్యూ శాఖలు చూసీచూడనట్లుగా ఉండటంతో అక్రమార్కులకు కలిసివస్తోంది. దేవుడి భూముల్లో వరి తదితర పంటలను సాగు చేసుకుంటున్నారు. మరి కొందరు ఇసుక మట్టి తవ్వుకొని విక్రయించి లాభాలు గడిస్తున్నారు. ఆలయాలకు ఆదాయం లేక దేవుడికి ధూపదీప నైవేద్యం సమర్పించడం కష్టంగా మారింది.

**ఎక్కడంటే..**బొమ్మలరామారం మండలం జలాల్‌పురంలో పెద్దమ్మ, ముత్యాలమ్మ ఆలయాలకు 248 సర్వే నెంబరులో 37 గుంటలు, చీకటిమామిడి గ్రామంలోని శ్రీతిరుమలనాథస్వామి ఆలయానికి 561 సర్వే నెంబరులో 16.01 ఎకరాలు, 563లో ఆరు గుంటలు, 564లో 1.13 ఎకరాలు, 565లో 12.19 ఎకరాలు, 566, 567లో 13 ఎకరాలు, 560, 562, 566లో 13 ఎకరాలు, బొమ్మలరామారం గ్రామంలో 4.25 ఎకరాలు ఇలా అన్ని గ్రామాల్లో 73.77 ఎకరాల భూములు ఉన్నాయి. కొందరు వీటిని విక్రయించగా మరికొందరు ఆక్రమించుకున్నారు. చీకటిమామిడి శ్రీతిరుమలనాథస్వామి ఆలయ భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించి మట్టి, ఇసుకను తరలించారు. ఇటుక బట్టీలు నిర్వహించి గుంతలుగా మార్చారు. మర్యాల శ్రీరంగనాయకుల ఆలయం వద్ద ఉత్సవాలు నిర్వహించేందుకు స్థలం లేకుండా పోయింది. ఆలయం భూమి శామీర్‌పేట వాగు వెంట 22 ఎకరాలు ఉంటుంది. ఇసుక, మట్టి కోసం తవ్వకాలు జరపడంతో గుంతలు ఏర్పడ్డాయి.

తూంకుంట గ్రామంలో 3.03 ఎకరాల ఆలయ భూమి విక్రయించారు. కొనుగోలు చేసిన వ్యక్తి పంటలు సాగు చేసుకుంటున్నారు. జలాల్‌పురం గ్రామంలోని పెద్దమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో కనీసం పూజలు జరిపేందుకు అవకాశం లేకుండా పోయింది. బొమ్మలరామారంలో హనుమాన్ ఆలయ భూమి ఆక్రమణకు గురైంది.

చర్యలు తీసుకోవాలి: పండుగ రాజు, ఆలయ ఉత్సవాల కమిటీ ఛైర్మన్, బొమ్మలరామారం

వివిధ గ్రామాల్లో దేవుడి భూములు స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని దేవుడి భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలి. అమ్మకాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

స్వాధీనం చేసుకుంటాం: గాదె నరేందర్‌రెడ్డి, ఈవో, దేవాదాయశాఖ

బొమ్మలరామారం మండలంలోని వివిధ గ్రామాల్లో దేవుడి భూములు స్వాహా చేసిన విషయం మా దృష్టికి వచ్చింది. తహసీల్దార్ కార్యాలయం నుంచి రికార్డులు తీసుకుని స్వాధీనం చేసుకుంటాం.

# పైసల్లేవు.. పనులెలా..?

ఆదిలాబాద్ : జిల్లాలో ఎన్నికైన పంచాయతీ పాలకవర్గం ఈ నెల 22న కొలువుదీరనుంది.. అభివృద్ధిపై కొత్త పాలకులపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే పంచాయతీల ఖజానా ఖాళీగా ఉండటంతో పనులెలా చేయాలనే ఆందోళన నెలకొంది. ఇప్పటికే గత సర్పంచులు చేసిన పనులకు సంబంధించి రూ.11 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘ నిధులతోపాటు సాధారణ, ఉపాధి హామీ పథకం, పన్నుల వసూలు తదితర నిధులే ప్రధాన ఆదాయం. ఉద్యోగుల జీతభత్యాలకు 30 శాతం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మంచినీరు తదితర వాటికి 15 శాతం చొప్పున, రహదారులు, కాల్వలకు 20, ఇతర అవసరాలకు 10 శాతం నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

నిధుల్లో కోత : 2019లో ఎన్నికల తర్వాత జిల్లాకు రూ.118.95 కోట్లు మంజూరైతే.. గత మూడేళ్ల నుంచి నిధుల్లో పూర్తిగా కోత పడింది. 2022-23లో రూ.52.32 కోట్లు రాగా, 2023-24లో రూ.39.61 కోట్లకు తగ్గింది. గతేడాది కేవలం రూ.26.10 కోట్లు వచ్చాయి. చివరకు ట్రాక్టర్ల కిస్తీలు కట్టలేని పరిస్థితి.

ఇలా సమకూర్చుకోవాలి : ప్రతి పంచాయతీకి సొంత వనరుల ద్వారా, ప్రభుత్వ గ్రాంట్లు, తమ వాటాగా లభించేవి, విరాళాల ద్వారా ఆదాయం వస్తుంది. జనాభాను బట్టి ఒక వ్యక్తికి రూ.618 చొప్పున ప్రభుత్వ గ్రాంటు మంజూరవుతుంది. సొంత వనరుల్లో ఇంటి పన్నులతో పాటు ప్రత్యేకంగా లైసెన్స్ ఫీజు, లేఅవుట్ ఫీజు, భవన నిర్మాణాలకు అనుమతుల రుసుం, కాంపౌండింగ్ ఫీజు, సంతల రుసుము, వేలం ద్వారా వచ్చే ఆదాయం ఉంటుంది.

**స్పందిస్తేనే.. :** పథకాలపై అవగాహన పెంచుకొని స్పందిస్తే సగం సమస్యలను పరిష్కరించే వీలుంది. ఉపాధి హామీ కింద కొన్ని పనులు పూర్తి చేసుకునే వీలుంది. వీటితో పాటు సమస్యలను ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకెళ్లి నిధులు రాబట్టుకోవచ్చు.

# మేం మారమంతే!

భైంసా : ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి నిలయాలుగా మారుతున్నాయి. వివిధ శాఖల్లో కొందరు అధికారులు, ఉద్యోగులు అత్యాశకుపోయి లంచావతారం ఎత్తుతున్నారు. చేయి తడపందే పనవ్వదని, దస్త్రాలు కదలవని నిరూపిస్తున్నారు. సాధారణ పౌరులైనా, శాఖలోని ఉద్యోగులైనా ముడుపులు చెల్లించాల్సిందే. వీరి ఆగడాలకు విసిగిపోయి అవినీతి నిరోధక శాఖను ఆశ్రయిస్తున్నారు. భైంసాలో తరచూ ఏసీబీ దాడులు జరుగుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదు.

**ఆబ్కారీశాఖలో..**

ఈ ఏడాది ఫిబ్రవరి 25న రూ.10వేలు లంచం తీసుకుంటూ భైంసా ఎక్సైజ్ ఎస్సై నిర్మల, కానిస్టేబుల్ సుజాత ఏసీబీకి పట్టుబడ్డారు. కామోల్ గ్రామానికి చెందిన తెల్లకల్లు లైసెన్స్‌దారుడు తన ఏరియాలో మరో లైసెన్స్‌దారుడు అమ్మకాలు చేస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. ఇద్దరి మధ్య వివాదాన్ని పరిష్కరించడానికి రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా డీఎస్పీ విజయ్‌కుమార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**ఆర్టీఏలోనూ..** అక్టోబర్ 22 అర్ధరాత్రి మహారాష్ట్ర సరిహద్దులోని బెల్తరోడ ఆర్టీఏ చెక్‌పోస్టును ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిం



చారు. ఉదయం 5 గంటల వరకు కంప్యూటర్‌లోని లావాదేవీలు, జరిమానా వివరాలపై ఆరా తీశారు. అక్కడ లభ్యమైన రూ. 3 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

**ఆరోగ్యశాఖలో..**

సామాన్య ప్రజలకే కాకుండా, శాఖలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది లంచాలకు బాధితులుగా మారుతున్నారు. అందుకు తాజాగా భైంసాలో పట్టుబడిన వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగి భీమన్న ఉదాహరణ. ఓ ఉద్యోగికి సంబంధించిన ఎఫ్‌టీఏ, సరెండర్ లీవ్, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంటు ఫైల్‌ను రూపొందించి ఉన్నతాధికారులకు పంపేందుకు రూ.9వేలు లంచం సొమ్మును ఫోన్‌పే లో తీసుకుని అనిశా అధికారులకు చిక్కారు.

**రెవెన్యూశాఖలో...** రెండేళ్ల క్రితం ఖానాపూర్‌లో తహసీల్దారుగా పనిచేసిన నరేందర్ సైతం ఏసీబీ వలకు చిక్కారు.

పురపాలికలో.. 2024 మే 22న భైంసా పురపాలక కమిషనర్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి ఆస్తిపన్ను తగ్గించేందుకు రూ.30వేలు డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారులు దాడి చేయగా కమిషనర్‌తోపాటు బిల్‌కలెక్టర్ వారికి చిక్కారు.

# అంతా ఖాళీ.. అంతం ఎలా చేసేది!

కుష్ఠు రహిత సమాజానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ గడువు పొడిగిస్తూనే ఉంది. కొత్తగా కేసులు వస్తుండటమే ఇందుకు కారణం. జిల్లాలోనూ కొత్త కేసులు బయటపడుతూనే ఉన్నాయి. వచ్చే అయిదేళ్లలో ఈ వ్యాధిగ్రస్థుల ఊసే ఉండదంటూ ఈ విభాగంలో నియామకాన్ని 1995లోనే నిలిపివేశారు. ఈ ఏడాది సైతం సర్వే ప్రారంభించగా ఈ విభాగం మాత్రం పూర్తిగా ఖాళీగా కనిపిస్తోంది.

**పట్టింపు కరవు..** ఈ వ్యాధి గుర్తింపు పక్షంరోజుల పాటు నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ సిద్ధమైంది. ప్రతి సంవత్సరం ఈ సర్వే సమయంలోనే హడావుడి తప్పితే.. ఆ తర్వాత పరిస్థితిపై ఆరా తీసేవారే కరవయ్యారు. కనీసం గ్రామాలు, ఇతర పట్టణాల్లో ఆశా కార్యకర్తలతో నెట్టుకొస్తుండగా జనాభా రెండు లక్షలకు చేరువైన మంచిర్యాలలో మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి సర్వే నిర్వహించింది లేదు. ఆశాకార్యకర్తలు వందకు పైగా ఉండాల్సిన చోట ఒక్కరు కూడా లేరు. ఆరోగ్యశాఖలో ప్రతి విభాగానికి ప్రత్యేక సిబ్బందిని కేటాయిస్తుండగా భయంకరమైన ఈ అంటువ్యాధి కుష్ఠుకు సంబంధించి జిల్లా మొత్తం ఒకే ఒక్కరు(సూపర్‌వైజర్ స్థాయి వ్యక్తి, ఈయన మరికొద్ది రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు) ఉన్నారు.


**రద్దు చేసేందుకు సన్నాహాలు..**

ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఒక ఏపీఎంఓ(అసిస్టెంట్ పారామెడికల్ ఆఫీసర్), వీరి పర్యవేక్షణకు మరో ఆరుగురు డీపీఎంఓలు ఉండాల్సి ఉండగా జిల్లాలోని 18కి పైగా కేంద్రాల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా అందుబాటులో లేరు. ప్రస్తుతం ఉన్న సూపర్‌వైజర్ కూడా ఒక్కరే ఉండటం, మరో నెలలో ఉద్యోగ విరమణ చేస్తుండటంతో పూర్తిగా ఖాళీ అయ్యేందుకు సిద్ధంగా ఉంది.

# ఇంటి పెరట్లోనే గం'జాయ్'

హైదరాబాద్: ఆంధ్రా- ఒడిశా సరిహద్దులు, ఏజెన్సీ ప్రాంతాలకు పరిమితమైన గంజాయి మొక్కల సాగు నగరానికి విస్తరించడం కలకలం రేపుతోంది. మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై నిఘా పెరగడంతో కొందరు కేటుగాళ్లు ఇలా దారులు వెతుక్కుంటున్నారు. కొన్నిరోజులుగా ఇంటి పెరడు, మిద్దె, అపార్టుమెంట్ల టెర్రస్ మీద గుట్టుగా గంజాయి మొక్కలను పెంచుతూ పోలీసులు, ఆబ్కారీ శాఖ తనిఖీల్లో పట్టుబడుతున్న ఉదంతాలు వరుసగా నమోదవుతున్నాయి. అత్యాశకు పోయి కొందరు రాజధాని శివార్లలోని వ్యవసాయ భూముల్లో సాగు చేస్తూ పట్టుబడుతున్నారు. ఆబ్కారీ శాఖ గత మూడేళ్లలో రాష్ట్రంలో 21,035 మొక్కల్ని స్వాధీనం చేసుకుంది. ఈ ఏడాది అక్టోబరు వరకూ రాజధాని పరిధిలో దాదాపు 90 చోట్ల గంజాయి మొక్కలు సాగుచేస్తూ దర్యాప్తు సంస్థలకు చిక్కారు.

**అధిక ధరకు కొనలేక..**



ఉపాధి, వివిధ అవసరాల కోసం ఒడిశా సహా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు నగరానికి వేల సంఖ్యలో వస్తుంటారు. ఇలా వచ్చేవారిలో కొందరికి మత్తు పదార్థాలు తీసుకునే అలవాటు ఉంటుంది. తాముండే ప్రాంతాల్లో తక్కువ ధరకు దొరికే గంజాయి.. హైదరాబాద్‌లో రూ.వేలల్లో ఉండడంతో సొంతంగా మొక్కలు పెంచుతున్నారు. ఉదాహరణకు ఏవోబీ దగ్గర గంజాయి కిలో రూ.5 వేలుంటే.. నగరంలో అంతకు 10 రెట్లు ధర ఉంటుంది. డిమాండ్‌ను బట్టి ధర మరింత పెరుగుతుంది. ఇంత మొత్తం చెల్లించలేక కొందరు గంజాయి విత్తనాలు తెప్పించి.. నగరంలో తాముండే ప్రాంతాల్లో పెంచుతున్నారు. ఇటీవల మలక్‌పేటలోని మహబూబ్‌మిషన్ మార్కెట్లోని భవనం టెర్రస్ మీద మొక్కలు పెంచుతూ ఇద్దరు బిహారీలు పట్టుబడడమే దీనికి నిదర్శనం. దీనికితోడు మత్తు పదార్థాలకు అలవాటుపడిన యువత కూడా ఇంటి దగ్గరే మొక్కలు పెంచుతూ పోలీసులకు చిక్కుతున్నారు. ఒక్కమొక్క బాగా పెరిగితే సుమారు 3-5 కిలోల గంజాయి వస్తుందని ఆబ్కారీ శాఖ అధికారులు చెబుతున్నారు.

# ఇసుకంతైనా దయలేదు

నిజామాబాద్: జిల్లాలో నాలుగు నెలల కిందట కురిసిన భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో భారీగా ఇసుక మేటలు వేశాయి. రైతులు పంట కోల్పోవడంతోపాటు మళ్లీ సాగుచేసుకునే పరిస్థితి లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో పొలాల్లో పేరుకుపోయిన ఇసుకను ఉచితంగా తీసివేస్తామని ప్రకటించగా.. సంబంధిత అధికారులు సర్వేలు సైతం చేశారు. అనంతరం దీని ప్రస్తావనే లేకపోవడంతో ఇసుకను తొలగించడానికి కర్షకులు రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

**వేల ఎకరాల్లో..**

ఆగస్టులో కురిసిన వానలకు జిల్లాలోని 42 వేల ఎకరాల్లో పంటలు నీట మునగగా.. 12 వేల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. మోకాలులోతు మేర పేరుకుపోయిన ఇసుకను రైతులు బ్లేడ్ ట్రాక్టర్ ద్వారా తొలగించి చేను చుట్టూ కుప్పలుగా నిల్వచేస్తున్నారు. అయినా ఇసుక ఇక్కట్లు తీరడంలేదు. అడుగుభాగంలో మళ్లీ నల్లమట్టిని తెచ్చిపోస్తున్నారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో యాసంగి సీజన్‌లో నాట్లేయడం కొనసాగుతుండగా.. వీరు మాత్రం తమ పొలాలు బాగు చేసుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

**ఈ ప్రాంతాల్లో అధికం..**



నందిపేట్, డొంకేశ్వర్, ఆలూరు, నవీపేట, బోధన్ మండలాల్లో మంజీరా, గోదావరి నదులు, సిరికొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, భీమ్‌గల్ మండలాల్లో వాగులు ఉగ్రరూపం దాల్చడంతో భారీగా ఇసుక మేటలు వేశాయి. దీంతోపాటు బోర్లు సైతం ఇసుకలో కూరుకుపోయి కూలిపోయాయి. వీరంతా సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కొంతమంది రూ.లక్షల్లో ఖర్చు చేయలేక పొలాలను అలాగే వదిలేసే దయనీయ పరిస్థితి నెలకొంది.

**కుప్పలుగా చేయడానికి..**

నా పొలంలో వేసిన ఇసుక మేటలను కుప్పలుగా ఒకచోట చేర్చడానికే ఇప్పటివరకు రూ.లక్షల్లో ఖర్చయ్యింది. ఈ నిల్వలను ఎక్కడికి తీసుకెళ్లాలి. నా చేనులో పంట ఎలా పండించాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి. రాములు, కొండూరు గ్రామం, సిరికొండ

# ఒకే గూటికి వరద నాలాలు



హైదరాబాద్: వరద కష్టాల నుంచి నగరాన్ని రక్షించేందుకు జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకుంది. వేర్వేరు విభాగాల ఆధ్వర్యంలోని నాలాలన్నింటినీ.. ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చింది. పురోగతిలోని పనులు మినహా.. మిగిలిన పనులన్నింటినీ వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డీపీ) విభాగానికి అప్పగించాలని ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేసింది.

**పూర్తయిన జీఐఎస్ సర్వే**

ఆరు నెలల కిందట వరద నాలాల జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) సర్వే మొదలైంది. 150 డివిజన్ల పరిధిలోని పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నాలాలను జల్లెడ పట్టారు. త్వరలోనే సర్వే నివేదిక సిద్ధం కానుంది.

**విలీన ప్రాంతాల్లోనూ..**

శివారులోని 27 పట్టణ స్థానిక సంస్థలు(యూఎల్‌బీ) జీహెచ్ఎంసీ విలీనమై.. వార్డుల సంఖ్య 300కు పెరిగింది. త్వరలోనే శివారు ప్రాంతాల్లోని వరద నాలాల సర్వేపై కమిషనర్ ఆర్వీ.కర్ణన్ నిర్ణయం తీసుకుంటారని, సమీక్షలు జరుగుతున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు.


**టెండరు దశలోని పనులు సైతం..**

జీహెచ్ఎంసీ పరిధిలోని నాలాలను ప్రస్తుతం ప్రాజెక్టులు, నిర్వహణ, ఎస్ఎన్‌డీపీ విభాగాలు పర్యవేక్షిస్తున్నాయి. పని భారాన్ని దృష్టిలో ఉంచుకుని వేర్వేరు పనులను వేర్వేరు విభాగాలు చూస్తున్నాయి. రూ.650కోట్లతో చేపట్టిన రెండో దశ నాలాల నిర్మాణం.. ఏడాదైనా పట్టాలెక్కట్లేదు. ఈ నేపథ్యంలో.. ఆయా సమస్యలను నివారించి.. ప్రణాళికాబద్ధంగా పనులను పూర్తి చేసేందుకు నాలాల వ్యవస్థను పూర్తిగా ఎస్ఎన్‌డీపీకి అప్పగించాలని జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకుంది. పురోగతిలోని పనులను ప్రస్తుత విభాగాలే పూర్తి చేయాలని, అంచనాలు, ప్రణాళిక, టెండరు దశల్లోని పనులన్నీ ఎస్ఎన్‌డీపీకి అప్పగించాలని ముఖ్య ఇంజినీరు సహదేవ్ రత్నాకర్ ఇంజినీర్లను ఆదేశించారు.

అంతర్గత నాలాలు: 1,200కి.మీ

ప్రధాన నాలాలు: 390కి.మీ

# కొలువుదీరిన పుస్తకం



హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ఫెయిర్' శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కళాభారతి(ఎన్టీఆర్ స్టేడియం)లో ఆచార్య కోదండరామ్, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా.రియాజ్, బుక్‌ఫెయిర్ కార్యవర్గంతో కలిసి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ నెల 29 వరకు జరగనున్న ఈ మేళాలో జాతీయ స్థాయి పబ్లికేషన్ల స్టాళ్లను ఏర్పాటుచేశాయి. రోజూ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 9 గంటల ప్రదర్శన కొనసాగుతుంది. మొదటి రోజే సందడి వాతావరణం నెలకొంది. మొత్తం 265 స్టాళ్లను ఏర్పాటుచేశారు. వీటిలో అధికంగా ఇటీవల రచయితలు, పబ్లిషర్లుగా మారిన వాళ్లవే ఎక్కువగా ఉండటం విశేషం. రచయితలతో మాటామంతీ..

మొదటి 20 స్టాళ్లలో ప్రభుత్వానికి చెందిన గ్రంథాలయాలు, పర్యాటక, పురావస్తు తదితర శాఖల స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందించే సేవల సమాచారం అందజేస్తారు. చాలావరకు స్టాళ్లలో పుస్తక రచయితలు కూడా అందుబాటులో ఉంటున్నారు. వాళ్లు రాసిన పుస్తకాలకు సంబంధించిన విశేషాలు, ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ పుస్తక ప్రియులను సంతోషపరుస్తున్నారు. చాలామంది యువ రచయితలు ఎన్నో రోజుల కిందటే పుస్తక రచన పూర్తయినా.. ప్రత్యేకంగా బుక్ ఫెయిర్‌లోనే ఆవిష్కరించడానికి సిద్ధమయ్యారు. ప్రత్యేకంగా స్లాట్లు బుక్ చేసుకున్నారు.

10-20 శాతం వరకు రాయితీ

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఆధ్యాత్మికం, ఫిక్షన్, నాన్-ఫిక్షన్, రైతుల కోసం, ప్రముఖుల జీవిత చరిత్రలు, మ్యాగజైన్లతో పాటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారికి సైతం తెలుగు అకాడమీ పుస్తకాలను అందుబాటులో ఉంచింది. చాలా పుస్తకాలకు 10 నుంచి 20శాతం వరకు రాయితీ ఇస్తున్నారు. పిల్లల కోసం కామిక్, 3డీ పుస్తకాలతో పాటు స్టేషనరీ స్టాళ్లు కూడా ఏర్పాటుచేశారు. పోలీసు శాఖ ఏర్పాటుచేసిన 'సురక్ష' స్టాల్ ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది.

# జంట జలాశయాలు.. కాలుష్య కాసారాలు



హైదరాబాద్ : భాగ్యనగరానికి రక్షిత నీటిని అందించే జంట జలాశయాలు వ్యర్థాలతో కలుషితం అవుతున్నాయి. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లలోకి మురుగును నేరుగా విడుదల చేస్తుండటం, మానవవ్యర్థాలకు డంపింగ్ కేంద్రంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నగరంలో నీటి సరఫరాలో కీలకంగా ఉన్న జంట జలాశయాల పర్యవేక్షణపై జలమండలి ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. రోజుకు 45 ఎంజీడీల నీటిని సరఫరా చేసే సామర్థ్యం కలిగిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చుట్టుపక్కల నివాస ప్రాంతాలు అంతకంతకూ పెరుగుతుండటంతో ఆ ప్రాంతాల మురుగు నేరుగా జలాశయాల్లో చేరుతోంది. నగరంలోని కొన్ని ప్రాంతాల నుంచి తీసుకువచ్చే మానవ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలకు జలాశయాలు డంపింగ్‌యార్డుల్లా మారాయి. జలమండలి రెండు జలాశయాల నుంచి నేరుగా వస్తున్న నీటిని (రా వాటర్) జలమండలికి చెందిన అత్యాధునిక ప్రయోగశాలల్లో పరీక్షిస్తున్నారు. ఈ పరీక్షల్లో ఈకోలి, కోలీఫాం బ్యాక్టీరియా, ఇతర రసాయనాలు ఉంటున్నాయని గుర్తించారు. ఉస్మాన్‌సాగర్ జలాలు తొలుత ఆసిఫ్‌నగర్ ఫిల్టర్‌బెడ్‌లకు వస్తుండగా.. హిమాయత్‌సాగర్ జలాలు మీరాలం ఫిల్టర్‌బెడ్‌లకు చేరుతాయి. వచ్చిన నీటిని ప్రమాణామేరకు పూర్తిగా శుద్ధి చేసిన తర్వాత జలమండలి సరఫరా చేస్తోంది.

**పర్యవేక్షణ అంతంతమాత్రమే**

జలాశయాల నుంచి నీటిని వినియోగించుకుంటున్న జలమండలి వాటి పరిరక్షణపై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతోనే వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. పెట్రోలింగ్ సిబ్బంది నామమాత్రంగా ఉండటంతో పలువురు వ్యర్థాలను నీటిలో పోస్తున్నారు.

**దుస్థితికి కారణాలు ఎన్నో..**

అజీజ్‌నగర్, హిమాయత్‌సాగర్ ప్రాంతాలు, ఫాంహౌస్‌లు ఇతర నివాస ప్రాంతాల్లోని మురుగునీటిని నేరుగా జలాశయాల్లోకి వదిలిపెడుతున్నారు. తాత్కాలిక కాలువలను ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వతంగా సిమెంట్ కాలువలు నిర్మించి నీటిని జలాశయాల్లోకి వదిలిపెడుతున్నారు. స్థానిక సంస్థలతో పాటు ప్రైవేటు వ్యక్తులు మురుగును జలాశయాల్లో కలిపేస్తున్నారు. నగరం వెలుపల ఓఆర్ఆర్ సమీపంలో ప్రాంతాల్లో సెప్టిక్ ట్యాంకులు ఉన్నాయి. ఇవి నిండిన తర్వాత మానవ వ్యర్థాలను ట్యాంకర్లలో తీసుకువచ్చి జలాశయాల్లో కలిపేస్తున్నారు. బుధవారం ట్యాంకర్ ద్వారా మానవవ్యర్థాలను తెచ్చి హిమాయత్‌సాగర్‌లో వదిలిపెడుతుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రాత్రి పూట నిర్మాణ వ్యర్థాలతో పాటు ఇతర వ్యర్థాలను ట్రక్కులు, లారీల్లో తెచ్చి జలాశయాల్లో పడేస్తున్నారు.

# అదే పనిగా మోగుతోందా..!

హైదరాబాద్: పాత డీజిల్ జనరేటర్లను వినియోగిస్తుండటంతో నగర వాయు నాణ్యతపై తీవ్ర ప్రభావం పడుతోంది. కార్పొరేట్ కార్యాలయాలు, ఫంక్షన్‌హాళ్లు, ఎత్తైన భవనాలు, షాపింగ్‌మాళ్లలో పది నుంచి పదిహేనేళ్ల కిందటి డీజీసెట్‌లు దర్శనమిస్తున్నాయి. సీపీసీబీ మార్గదర్శకాలకు విరుద్ధంగా వాటిని వాడుతుండటంతో సూక్ష్మధూళి కణాలైన పీఎం 2.5, పీఎం 10, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్, సల్ఫర్ డయాక్సైడ్‌లు విడుదలవుతున్నాయి.**నిబంధనలు ఏం చెబుతున్నాయి..**తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉత్తర్వుల ప్రకారం.. 61 కిలోవాట్‌కు పైగా సామర్థ్యం ఉన్న డీజీసెట్లపై రెట్రోఫిటెడ్ ఎమిషన్ కంట్రోల్ డివైస్(ఆర్ఈసీడీ)ని అమర్చడం గానీ, గ్యాస్ ఆధారిత జనరేటర్లకు మారడం గానీ చేయాలి.. మార్చి 20నుంచి ఈ నిబంధనలు అమలులోకి వచ్చాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్వహించిన ఎమిషన్ ఇన్వెంటరీ, సోర్స్ అపోర్షన్‌మెంట్, క్యారీయింగ్ కెపాసిటీ అధ్యయనాల ప్రకారం డీజిల్ ఇంజిన్ ఉద్గారాలు పీఎం 2.5, కార్సినోజెనిక్ పాలీ యారోమాటిక్ హైడ్రోకార్బన్లకు కారణమవుతున్నాయని తేలింది. ఇది నగరవాసుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.

సీపీసీబీ ఆమోదించిన 5ల్యాబ్‌లలో టైప్ అప్రూవ్డ్ ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించాలి.

ఆర్ఇసీడీ పనితీరును నిర్ధారించడానికి రియల్ టైమ్ మానిటరింగ్ వ్యవస్థ (15 నిమిషాలకోసారి డేటా ట్రాన్స్‌ఫర్) తప్పనిసరి. ఈ డేటాను టీజీపీసీబీ సర్వర్‌కు అనుసంధానించాలి.నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఎయిర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ 1981, ఎన్విరాన్‌మెంట్ (ప్రొటెక్షన్)యాక్ట్ 1986 ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తారు.

# నేటి నుంచి ముక్కోటి.. తరించాలి భక్తకోటి..!

భద్రాచలం : భద్రాచలం రామాలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి మహోత్సవాల వైభవం సాక్షాత్కరిస్తోంది. ప్రధాన వీధుల్లో స్వాగత ద్వారాలు ఆకట్టుకుంటున్నాయి. శనివారం (ఈనెల 20) నుంచి 28 వరకు రోజుకో రూపంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు దర్శనమిస్తారు. తొలిరోజు మత్స్యావతారంలో పూజలు అందుకుంటారు. ప్రధాన కోవెల నుంచి మిథిలా మండపానికి చేరుకున్నాక భక్తుల దర్శనార్థ కాసేపు అక్కడ వేంచేస్తారు. తిరువీధి సేవ అనంతరం తిరిగి కోవెలకు చేరుకుంటారు. ఇలా రోజంతా సందడే సందడి. అలంకరణకు పుష్పాలతో దండలు తయారుచేస్తున్నారు. ధ్వజస్తంభంతో పాటు కోవెలకు అలంకరించనున్నారు. కోవెల ప్రాంగణంలో పచ్చని మొక్కలు పేర్చి సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాల అలంకరణతో కోవెల కాంతులీనుతోంది.

**నిత్య కల్యాణాలు నిలిపివేత**

ముక్కోటి వేడుకలను పురస్కరించుకుని ఈనెల 30 వరకు నిత్య కల్యాణాలు జరగవని ఈఓ దామోదర్‌రావు ప్రకటించారు. భక్తులు శనివారం నుంచి ఈనెల 28 వరకు దేవుడి అలంకారాలను దర్శించుకోవచ్చు. 29న గోదావరిలో నిర్వహించే తెప్పోత్సవం కోసం హంస వాహన పనులు ముమ్మరమయ్యాయి. త్వరలోనే గోదావరిలో నీటిమట్టాన్ని అంచనా వేసేందుకు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. 30న ఉత్తర ద్వార దర్శన పూజల కోసం సుమారు 4వేల మంది కూర్చునేందుకు వీలుగా సెక్టార్లకు మార్కింగ్ చేసి క్యూలైన్లను సిద్ధం చేయనున్నారు. ఉత్సవాల నిర్వహణకు ఉద్యోగులకు విధులు



కేటాయించారు. ఇతర ఆలయాల నుంచి కొంతమంది ఉద్యోగులను ముక్కోటి ఉత్సవాలకు డిప్యుటేషన్‌పై రప్పించనున్నారు.

**గతేడాది మాదిరిగా...**

గతేడాది తరహాలోనే ఈసారి కూడా ముక్కోటి సందర్భంగా ఏరు మహోత్సవాలు నిర్వహించేందుకు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ చొరవ తీసుకున్నారు. ఘాట్‌కు సమీపంలో సుమారు 20 హట్స్ సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఈ ప్రదేశం వైకుంఠ ఘాట్‌కు సమీపంలో ఉండటంతో భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని కరకట్ట పైనుంచి హట్స్‌కు వెళ్లేందుకు మెట్లు నిర్మించనున్నారు. యాత్రికులకు సరైన ధరకు విడిది సదుపాయం లభించనుంది. మరుగుదొడ్లు, తాగునీరు, సెల్ఫీ పాయింట్, సోలార్ విద్యుద్దీపాలను సిద్ధం చేయనున్నారు. గోదావరిలో 'ఏరు' పేరిట బోట్ షికారు ఉంటుందని నీటిపారుదలశాఖ డీఈ మధుసూదన్ తెలిపారు. 29న తెప్పోత్సవం వేళ ఘాట్‌లో ఆదివాసీ ఉత్పత్తుల స్టాళ్లతో పాటు భక్తిరసమైన సాంస్కృతిక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.

# రాకాసి గుళ్లు.. చారిత్రక ఆనవాళ్లు!

అశ్వాపురం : రాకాసి గుళ్లు..! 3వేల ఏళ్లనాటి మౌనచరిత్రకు ఆనవాళ్లు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో గొందిగూడెం నుంచి వేములూరు మార్గంలో అడవిలో ఇవి దర్శనమిస్తాయి. ఎంతో ఆశ్చర్యాన్ని, అద్భుతాన్ని కలిగిస్తాయి. పురాతత్వ అధికారులూ పర్యటించారు. పరిశోధనలు, పరిశీలనలు జరిపారు. తరువాత ఏ చర్యలూ తీసుకోకపోవటంతో పట్టించుకునే వారే కరవయ్యారు. నిధులు, నిక్షేపాల పేరుతో దుండగుల దురాగతాలకు కొన్ని రాకాసి గుళ్లు గురవగా.. పరిసర గ్రామాల రైతులు పంటలు సాగుచేయటంతో మరికొన్ని రాకాసి గుళ్లు క్రమంగా కనుమరుగవుతున్నాయి.

**రకరకాల పేర్లు**

వీటిని రాకాసి గుళ్లు, రాకాసి బండలు, రాకాసి సమాధులు.. ఇలా రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. గోదావరి పరీవాహకంలో భద్రాద్రి జిల్లాలో గొందిగూడెం మొదలుకుని ములుగు జిల్లా తాడ్వాయి, భూపాలపల్లి జిల్లా దామరవాయి వరకు ఇవి దాదాపు 200 కిలోమీటర్ల పరిధిలో అడవులు, కొండలు, గుట్టలపై పలుచోట్ల దర్శనమిస్తాయి. వీటిలో 16 రకాలు ఉన్నాయనేది చరిత్రకారుల అభిప్రాయం. ఓ



రకం రాకాసి సమాధులు అశ్వాపురం మండలం వేములూరు, మనుబోతులగూడెంలో మరో రకం రాకాసి గుళ్లు పినపాక మండలం జానంపేట, అమరారం ప్రాంతాల్లో కనిపిస్తాయి. సుమారు 8-9 అడుగుల పొడవు, 4-5 అడుగుల వెడల్పు, 6-7 అడుగుల లోతుతో భూమిలో కందకాలు ఉంటాయి.

నాలుగు దిక్కులా నాలుగు పొడవైన పెద్దరాళ్లను నిలబెట్టి అంతే పరిమాణం కలిగిన మరో పెద్దరాయిని పైభాగంలో పెట్టి మూసివేసి ఎంతో పొందికగా సమాధులను ఏర్పాటుచేశారు. వేములూరు, మనుబోతులగూడెం వద్ద సుమారు 40 వరకు దర్శనమిస్తాయి. ఒకదానికి మరోదానికి మధ్య సుమారు 30 అడుగుల దూరం ఉంటుంది. మరికొన్ని పక్కపక్కనే కనిపిస్తాయి. పినపాక మండలం అమరారం అడవుల్లో గుట్టలపై ఇవి వందల సంఖ్యలో ఉన్నాయి. అంతంత పెద్దబండలను ఎత్తి సమాధులను ఎలా ఏర్పాటుచేశారనే అంశంపై ఆసక్తి నెలకొంది.ఇవి శిలాయుగం నాటి ఆదిమానవుల సమాధులు. ఆ కాలంలో ఆదిమానవులు కొన్ని ప్రత్యేక విశ్వాసాలతో సమూహాలుగా జీవించేవారు. రాకాసి గుళ్లు ఎంతో అరుదైనవి. ప్రాచీన చరిత్ర కలిగినవి. ఈ ప్రాంతాన్ని పర్యాటకులు సందర్శించేలా తీర్చిదిద్దగలిగితే మరింత మేలు జరుగుతుంది.కొండవీటి గోపి, చరిత్ర పరిశోధకుడు, భద్రాచలం

# ట్రాక్టర్ల కొనుగోళ్లలో చేతివాటం

ఆదిలాబాద్ : వాహనాన్ని ఎవరైనా షో రూం ధరకే కొనుగోలు చేస్తారు.. కంపెనీ ఆఫర్ చేస్తే.. కాస్త తక్కువే చెల్లిస్తారు. కానీ, బల్దియా అధికారులు మాత్రం షోరూం ధర కన్నా అధికంగా చెల్లించి మూడు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. అందుకు అనుగుణం గానే వాహనాల కొనుగోళ్లకు సంబంధించిన టెండరు తయారీ, ఆమోదం, సాంకేతిక అనుమతుల్లో గుత్తేదారుకు అనుకూలంగా ఎంబీ రికార్డులు నమోదు చేయడం బల్దియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బల్దియాలో ట్రాక్టర్ల కొనుగోళ్లలో అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ఈ ఏడాది ప్రారంభంలోనే కొనుగోలు చేయగా అప్పట్లో అనుమానం వచ్చిన పలువురు కౌన్సిలర్లు అవే కంపెనీకి చెందిన ట్రాక్టర్ల కొటేషన్లను ప్రైవేటుగా అడిగి తీసుకున్నారు. బల్దియా కొనుగోలు చేసిన ట్రాక్టర్ల ధరకు, ప్రైవేటుగా తీసుకున్న కొటేషన్లకు ధరలో వ్యత్యాసం రావడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశంతో బల్దియా ఈఈ పేరి రాజు విచారణ చేపట్టగా మొత్తం రూ. 2.76 లక్షలు తేడా



వచ్చినట్లు నిర్ధారించారు. తాజాగా ట్రాక్టర్లను సరఫరా చేసిన గుత్తేదారును రూ. 2.76 లక్షలు తిరిగి బల్దియాకు చెల్లించాల్సిందిగా ఆదేశించారు.

**గుత్తేదారుతో కుమ్మక్కు**

బల్దియాలో పారిశుద్ధ్య పనులకోసం మూడు ట్రాక్టర్లు అవసరమవగా.. గతేడాది డిసెంబరులో అధికారులు టెండరు ప్రకటన జారీ చేశారు. ఓ కంపెనీకి చెందిన డీఐ35 హెచ్‌పీ 39 సామర్థ్యం గల మూడు ట్రాక్టర్లను గుత్తేదారు కొనుగోలు చేసి బల్దియాకు అందజేశారు. ఒక్కో ట్రాక్టరుకు రూ. 8.70 లక్షల చొప్పున మూడు ట్రాక్టర్లకు మొత్తం రూ. 26.10లక్షలు వ్యయమైనట్లు బల్దియా అధికారులు ఎంబీ రికార్డులు చేసి గుత్తేదారుకు చెల్లించారు. కంపెనీకి చెందిన ఒక ట్రాక్టర్ వాస్తవ షోరూం ధర అన్ని రకాల పన్నులు, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీలు కలుపుకుని రూ. 7.78 లక్షలు మాత్రమే ఉంది. అంటే ఒక్కో ట్రాక్టరుకు రూ. 92 వేలు చొప్పున మూడు ట్రాక్టర్లకు కలిపి మొత్తం రూ. 2.76 లక్షలు గుత్తేదారుకు అధికంగా చెల్లించారు. ఈ వ్యవహారమంతా అప్పట్లో పనిచేసిన ఓ ఇంజినీరింగ్ అధికారి కనుసన్నల్లో జరిగింది.

# గొంతు తడపాల్సిన నీరు.. మురుగుపాలు

బెల్లంపల్లి : బెల్లంపల్లిలో ఇంటింటికి శుద్ధజలం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం అధికారుల తీరుతో నీరుగారుతోంది. లీకేజీలతోపాటు ఇంటింటికి ఏర్పాటు చేసిన కుళాయిలకు ఫ్లో కంట్రోల్ వాల్వులు లేక తాగునీరు మురుగు కాలువల్లోకి చేరుతోంది. వారానికి రెండుసార్లు నీరు సరఫరా చేస్తున్నారు. గంటల తరబడి వేల లీటర్లు శుద్ధజలం రహదారులపై పారుతుంది.

**లీకేజీలే అంతటా..**

బెల్లంపల్లి పట్టణంలో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చినా.. ఫ్లో కంట్రోల్ వాల్వ్‌లు బిగించలేదు. సరఫరా సమయంలో చాలామంది రోడ్లపైనే పడేయడంతో పెద్ద మొత్తంలో నీరు నేలపాలవుతోంది. వేసవిలో తీవ్రమైన నీటి ఎద్దడి తలెత్తుతోంది. పట్టణంలోని 34 వార్డుల్లో 15,000 వేల వరకు నివాసాలున్నాయి. తాగునీరు సరఫరాకు 20 వేల వరకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడ జనాభా సుమారుగా 42 వేల వరకు ఉంటుంది. పోస్ట్ ఆఫీస్ బస్తీ(29వ వార్డు), కాల్‌టెక్స్(12, 13),



రాంనగర్, హనుమాన్‌బస్తీ(33), శిశుమందిర్‌రోడ్డు, రైల్వేస్టేషన్, కన్నాలబస్తీ, బూడిదగడ్డబస్తీ, షంషీర్‌నగర్, రడగంబాలబస్తీ, శాంతిఖని, టేకులబస్తీ ప్రాంతాల్లో లీకేజీల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలో 1,500 కుళాయిలకు ఆన్ ఆఫ్‌లు లేక నీరంతా వృథాగా పోతోంది. బెల్లంపల్లి పట్టణంలో నీరు సరఫరా చేసే రోజు లక్షకుపైగా లీటర్ల శుద్ధజలం మురుగుపాలవుతోంది.

**ఒక్కో ఇంటికి రెండు మూడు కనెక్షన్లు**

కాల్‌టెక్స్ ప్రాంతంలో నివాసాలతోపాటు దుకాణ సముదాయాలకు రెండు, మూడు చొప్పున కనెక్షన్లను ఏర్పాటు చేసుకున్నారు. గోదావరి నుంచి, అడ ప్రాజెక్టునుంచి వచ్చే విధంగా ఇళ్ల యజమానులు అవసరానికి మించి వీటిని ఏర్పాటు చేయించుకున్నారు. వారంలో రెండురోజులు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అనవసరంగా ఏర్పాటు చేసిన కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. కాల్‌టెక్స్ ప్రాంతంలోని పైవంతెన సమీపంలో నీరంతా బయటకు ప్రవహించి మురుగు కూపంగా మారింది. ఏ ఇంటి ముందు చూసినా మురుగు కాలువలో పడేసిన పైపులే కనిపిస్తున్నాయి.

# కారును లిఫ్టు ఎక్కిద్దాం

హైదరాబాద్: జీహెచ్ఎంసీ కేబీఆర్ పార్కు వద్ద నిర్మించిన మొదటి బహుళ అంతస్తుల పార్కింగ్ కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ప్రయోగ పరీక్షలు విజయవంతమవడంతో.. శనివారం సేవలను ప్రారంభిస్తామని జీహెచ్ఎంసీ శుక్రవారం ప్రకటించింది. ఒప్పందం ప్రకారం..బల్దియా స్థలాన్ని ఇవ్వగా.. ప్రైవేటు సంస్థ సొంత నిధులతో నిర్మించింది. 15ఏళ్లపాటు అక్కడ పార్కింగ్ రుసుమును వసూలు చేసుకోవడం, కేంద్రంపై డిజిటల్ ప్రచారం చేసుకోవడం ద్వారా సంస్థ ఆదాయం పొందుతుంది.

విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ కేంద్రం కూడా.. రోజూ లక్షల వాహనాలు కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న రోడ్డు మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తుంటాయి. పార్కులో నడకకు వచ్చే వారు.. పార్కింగ్ వసతి లేకపోవడంతో.. తమ వాహనాలను రోడ్డుపై నిలిపేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వచ్చే సందర్శకుల వాహనాలతోనూ చుట్టూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఎన్టీఆర్ భవన్ చౌరస్తా నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వైపు వెళ్లే రోడ్డు పక్కన 405 చ.మీ విస్తీర్ణంలో ఐదు అంతస్తుల పార్కింగ్ కేంద్రాన్ని నిర్మించింది. అందులో 72 కార్లను నిలపొచ్చు. కార్లను ప్రవేశ ద్వారం వద్ద ఉంచితే.. నిలువుగా తిరిగే చక్రం వాటిని ఖాళీగా ఉన్న అంతస్తులోకి తీసుకెళ్తుంది. 20 ద్విచక్ర వాహనాలనూ పార్కింగ్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

# విలాసాలే లక్ష్యం.. 'మత్తు'మార్గం!



హైదరాబాద్: తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం.. పేదరికం.. చెడు స్నేహాలు యువత తప్పటడుగులు వేసేందుకు కారణాలుగా భావించేవారు. ఇటీవల సైబర్‌క్రైమ్, డ్రగ్ స్మగ్లింగ్ కేసుల్లో పట్టుబడుతున్న వారిలో అధికశాతం విద్యావంతులు, ఉన్నత ఉద్యోగులు, వ్యాపారులు ఉంటున్నారు. ఒక్క సంపాదన, ఈఎంఐలతో బతుకీడ్చటం నచ్చని వారు.. విలాస జీవితాన్ని ఆస్వాదించేందుకు అక్రమ కార్యకలాపాలను ఎంచుకుంటున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వస్తున్నాయి. అరెస్ట్ చేస్తున్న ప్రతి వెయ్యి మందిలో 800 మంది 25–40 ఏళ్ల మధ్య వయస్కులే. వీరందరి నోట వచ్చిన ఒకేమాట.. 40 ఏళ్ల లోపు ఆర్థికంగా స్థిరపడాలి. ఆ తర్వాత ఏ కష్టం చేయకుండా గడిపేయాలంటూ చెప్పటం ఆశ్చర్యానికి గురి చేసిందని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. నగదు స్వాధీనం చేసుకునేఅవకాశం లేకుండా క్రిప్టో రూపంలో మార్చేస్తున్నారు. విదేశాల్లోని మిత్రులను బినామీలుగా మార్చి ఆస్తులు బదిలీ చేస్తున్నారు.

**ఎంజాయ్ చేయాలని..**

చెన్నైకు చెందిన రాహుల్(31).. ఉన్నత విద్య పూర్తిచేశాడు. నెదర్లాండ్స్‌లోని ప్రముఖ కంపెనీలో భారీ వేతనంతో కొలువు సంపాదించాడు. పబ్‌లో సరదాగా తీసుకున్న డ్రగ్స్‌కు బానిసగా మార్చాయి. నెమ్మదిగా పెడ్లర్‌గా అవతారమెత్తాడు. హెరాయిన్, కొకైన్ పెద్దఎత్తున తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు. రెండుచేతుల సంపాదన.. వారాంతం ఇష్టమైనచోట వినోదాల విందు. రెండేళ్లకే రూ.కోటి చేసుకున్నాడు. నగరంలోని కొనుగోలుదారులకు డ్రగ్స్ ఇచ్చేందుకువచ్చి హెచ్‌న్యూపోలీసులకు చిక్కాడు. ఇదేబాటలో ఐటీఉద్యోగి రాహుల్, డీజే సిద్దార్థ, వ్యాపారి సంజయ్ మెహ్రా, ప్రైవేట్ ఉద్యోగి జాన్సన్‌రాజ్ డ్రగ్స్, క్రిప్టో కరెన్సీ మార్పిడితో అక్రమాలకు పాల్పడుతున్నారు.

**నగదు డ్రాతో ఊచలు..**

బిహార్‌కు చెందిన రంజీ క్రికెటర్ రిషి తుషార్(30). బరోడా జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్నాడు. ఇంజినీరింగ్ చదివిన ఆయన ఉద్యోగం చేస్తే వచ్చే చాలీచాలని జీతం వద్దనుకున్నాడు. గోవాలో పరిచయమైన సైబర్ నేరస్థులతో చేతులు కలిపి విదేశీ ఫోన్‌నంబర్లతో సామాజిక మాధ్యమాల గ్రూపులు రూపొందించి వేల మంది అమాయకులకు లాభాల వల విసిరి మోసాలకు సహకరించాడు. వారికి అవసరమైన బ్యాంకు ఖాతాలు సమకూర్చటం, అక్కడ జమ చేసిన నగదును క్రిప్టో, బిట్‌కాయిన్‌గా మార్చి విదేశాలకు తరలిస్తూ రూ.లక్షల సంపాదనకు అలవాటుపడ్డాడు. ఒక బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా చేసిన నగదు ఇతడిని సైబర్ క్రైమ్ పోలీసులకు పట్టిచ్చింది.

# ఇంతింతా వచ్చి.. అంతా ఆక్రమించి!



తాండూరు: జిల్లాలోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చాలా సంబర్భాల్లో ఆక్రమణలను నిర్ధారించుకోకుండా రెవన్యూ అధికారులు పట్టాలు జారీ చేస్తుండడంపై ఇటీవల హైకోర్టు తీవ్రంగా స్పందించింది. రెవెన్యూ, నీటి పారుదల శాఖల సమన్వయ లోపంతో అడ్డులేకుండా పోతోందన్న విమర్శలున్నాయి.

**పొలాల్లో కలిసిపోతున్న శిఖం భూములు..**

గ్రామాలకు దూరంగా ఉండే చెరువుల శిఖం భూములను ఆనుకునే వ్యవసాయ పొలాలున్నాయి. రాజకీయ అండదండలున్న కొందరు శిఖం భూములను పొలాల్లో కలిపేసుకుంటున్నారు. దీనికి కొందరు రెవెన్యూ అధికారులు వంత పాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు సమీపంలోని చెరువు శిఖం భూముల్లోనైతే ఏకంగా ఇళ్లు కట్టుకుంటున్నారు. వరద కాలువలను సైతం ఆక్రమిస్తున్నారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు వరద పారే పరిస్థితులు లేకపోవడంతో ముంపు సమస్య తలెత్తుతోంది. సమీప పొలాలు, కాలనీల్లోకి వచ్చి చేరుతోంది. తాండూరులో ఇప్పటికే మూడు కుంటలు కనుమరుగయ్యాయి.

**ఎక్కడెక్కడ..**

యాలాల మండలం కోకట్ చెరువు శిఖం భూమి 12 ఎకరాలుంటుంది. ఇప్పటికే ఎకరం భూమి ఆక్రమణకు గురైంది. స్థిరాస్తి వ్యాపారులు దీన్ని ప్లాట్లుగా చేసి విక్రయించారు. ఇప్పటికీ కొంత శిఖం భూమిలో నాపరాళ్ల వ్యర్థాలు, సుద్ద పోసి ఆక్రమణకు పాల్పడేందుకు తతంగం నడుపుతున్నారు.

వికారాబాద్ శివారెడ్డి పేటలో 11 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో లేఅవుట్లకు అనుమతి ఇవ్వడంతో ప్లాట్లు చేశారు. పరిగిలోని రుకుంపల్లి గేటు సమీపంలో చెరువు శిఖం భూమి 42 ఎకరాలు. ప్రస్తుతం 14– 20 ఎకరాలు మాత్రమే ఉంది. మిగిలింది ఆక్రమణకు గురైంది.

తాండూరు పట్టణంలోని గొల్లచెరువు శిఖం భూమి 78 ఎకరాలు. పదెకరాలు ఆక్రమణకు గురైంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్లు కడుతున్నారు.

ఏక్తా ఫసల్ కింద పంటలు సాగు చేయొచ్చు..

చెరువులు, కుంటల్లో నీరు లేకుంటే పంటలు పండించి ఆర్థికంగా లబ్ధి పొందొచ్చు. కొందరు సొంతానివని అమ్ముకొని సొమ్ము చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

మండలాలు: 20

చెరువులు, కుంటలు: 1,124

**రెవెన్యూ, పురపాలిక అధికారులకు ఫిర్యాదు చేశాం..**

– శిరీష, డీఈఈ, నీటిపారుదల శాఖ, తాండూరు

తాండూరు గొల్లచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని పురపాలిక, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. గొల్లచెరువు ఆక్రమణలకు సంబంధించి సంయుక్త సర్వేకు రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. ఎవరైనా శిఖం భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

# అనుమతి లేకపోతే బాదుడే



కరీంనగర్ : జిల్లాలోని నగర, పురపాలికల్లో నూతన భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కొత్తగా ఇంటిని నిర్మించుకునే కొందరు పట్టణ ప్రణాళిక ద్వారా అనుమతులు తీసుకోవడంలేదు. మరికొందరు అనుమతి ఒకలా, నిర్మాణాలు మరోలా చేపడుతున్నారు. అనుమతి కోసం వస్తే నిబంధనల పేరిట ముప్పు తిప్పలు పెడతారని, పెద్ద ఎత్తున ఫీజు చెల్లించాల్సి వస్తుందనే భయంతో అధికారుల వద్దకు రాకుండా, ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి ఎంతో కొంత అందించి పనులు పూర్తి చేసుకుంటున్నారు. కానీ ఆ తర్వాత వచ్చే చిక్కులు మాత్రం గుర్తించడం లేదు.

**ఆస్తిపన్నులో వందశాతం జరిమానా**

రూ.లక్షలు ఖర్చు చేసి అనుమతి లేకుండా అన్ని హంగులతో భవనాలు నిర్మించుకుంటున్నారు. ఇంటినంబర్ కోసం దరఖాస్తు చేసే సమయంలో ఈ విషయం బయటపడుతోంది. అనుమతి పత్రం లేకపోతే ఆస్తిపన్ను మదింపులో జరిమానా విధిస్తారని తెలుసుకోవడం లేదు.

మొత్తమే అనుమతి లేకపోతే వందశాతం, అదనపు నిర్మాణాలుంటే 25–75 శాతం అదనంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ భవనాలకు జాతీయ బ్యాంకుల్లో రుణాలూ మంజూరు కావు. ఈ విషయం తెలియక పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలోని పురపాలికల్లో నాలుగేళ్ల వ్యవధిలో భవన నిర్మాణానికి 7,144 దరఖాస్తు చేయగా 5,261 అనుమతులు ఇచ్చారు. 1,883 అర్జీలను తిరస్కరించారు. వీరంతా భవనాలు నిర్మించుకొని పరోక్షంగా ఆస్తిపన్నులో జరిమానా చెల్లించాల్సి వస్తోంది. కరీంనగర్‌లో అక్రమ నిర్మాణాల సంఖ్య లెక్కనే లేదు. వేల సంఖ్యలో ఉన్న ఇళ్లకు జరిమానా పడుతుందనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరముంది.

కొత్తగా బిల్డ్ నౌ ద్వారా అనుమతి

కొత్త పురపాలక చట్టం ప్రకారం భవన నిర్మాణ అనుమతులకు ప్రత్యేక విధానం రావడంతో నిర్దిష్ట సమయంలో అనుమతులు జారీ చేసేలా సులువు పద్ధతులు తీసుకొచ్చారు. సెప్టెంబరు 15లోపు టీజీబీపాస్ ద్వారా అనుమతులు ఇవ్వగా, ఆ తర్వాత నుంచి బిల్డ్ నౌ ఆప్, పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పట్టణ ప్రణాళిక అధికారులు మాత్రం ఏ విధానం వచ్చినా సరే పరిశీలించడంలో జాప్యం చేస్తున్నారు.

# కళ తప్పిన కూడళ్లు

మెదక్ : మెదక్ పట్టణంలో కూడళ్ల సుందరీకరణ ప్రకటనలకే పరిమితమైంది. ప్రధాన మార్గమైనా నర్సాపూర్–మెదక్–బోధన్ రోడ్డు విస్తరణలో నర్సాపూర్ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్, రాందాస్ చౌరస్తాలో శివాజీ, అంబేడ్కర్, గాంధీ, ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో అంబేడ్కర్, మరో చౌరస్తాలో ధ్యాన్‌చంద్ విగ్రహాలను తొలగించి కూడళ్లను విశాలం చేశారు. అయితే అభివృద్ధి పనులను విస్మరించారు. దీంతో వాటిల్లో పొదలు పెరుగుతున్నాయి. మరికొన్ని పశువుల ఆవాసాలకు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫ్లెక్సీల ఏర్పాటుకు, ప్రైవేట్ వ్యక్తుల ప్రచార బోర్డులకు అడ్డాగా మారుతున్నాయి.

**ప్రకటనలతో సరి**

అసెంబ్లీ, పురపాలిక ఎన్నికల సమయంలో చౌరస్తాలను అందంగా తీర్చిదిద్ది, మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. అనంతరం పట్టించుకోవడంలేదు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అధికారంలోకి వచ్చిన వెంటనే చౌరస్తాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినా అమలుకు నోచడంలేదు. అభివృద్ధిని రాందాస్ చౌరస్తా నుంచే



ప్రారంభిస్తామని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చిత్రాలను కూడా చూపించారు తప్పితే అడుగు ముందుకు పడలేదు. పట్టణానికి చెందిన ప్రముఖులు, యువకులు కమిటీగా ఏర్పడి డబ్బులు పోగు చేసుకొని రాందాస్ చౌరస్తాలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ పచ్చదనాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదు.

**ఎన్‌వోసీ రాగానే పనులు చేపడతాం**

– శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్

పట్టణంలోని ప్రధాన రోడ్డు ఎన్‌హెచ్ శాఖ పరిధిలో ఉండడంతో ఆయా కూడళ్లలో సుందరీకరణ పనులు, మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు వారి నుంచి అనుమతులకు లేఖ రాశాం. వారి నుంచి (ఎన్‌వోసీ) అనుమతి రాగానే పనులు చేపడుతాం.

# అక్రమ రవాణా.. అడిగే వారేరి!

జహీరాబాద్ : సులభంగా.. పారదర్శకంగా అన్న నినాదంతో ఆన్‌లైన్ పర్మిట్ల జారీ విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టులను ఎత్తివేసింది. అదే సమయంలో అక్రమ రవాణాపై నిరంతర నిఘాకు మొబైల్ స్క్వాడ్‌లు, ఈ–ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ కొనసాగుతుందని ప్రకటించింది. అయితే కొత్త విధానం మాత్రం అమలుకు నోచుకోలేదు. చెక్‌పోస్టులు ఎత్తేసి నెల దాటినా సంచార వాహన తనిఖీలు జాడ లేకపోవడం గమనార్హం. 65వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఏఎన్‌పీఆర్ (ఆటో నంబర్ ప్లేట్ రీడర్) ఎక్కడా కనిపించడం లేదు. అడిగే వారు లేక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది.

**ఐదు దశాబ్దాల పాటు..**

అక్రమాల అడ్డగింతకు రవాణా శాఖ చెక్‌పోస్టులు వెలిశాయి. ఆయా చోట్ల ఎంవీఐలు, ఏఎంవీఐలు ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఘటనలు అనిశా సోదాల్లో వెలుగుచూశాయి. ఈ కారణంగా ఐదు దశాబ్దాలుగా కొనసాగిన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం మాడ్గి శివారు హైదరాబాద్–ముంబయి జాతీయ రహదారిపై ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు అక్టోబరు 22న తొలగించారు.

**నిరంతరం తనిఖీ చేస్తామని..**

ఆన్‌లైన్ ద్వారా ఆదాయం ఆర్జించేలా రవాణా శాఖ సంచార వాహన తనిఖీ (మొబైల్‌స్క్వాడ్)లను ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. కానీ



ఇంతవరకు వాటి జాడే లేదు. చెక్‌పోస్టులు తొలగించాక అత్యాధునిక ఏఎన్‌పీఆర్ (ఆటో నంబరు ప్లేట్ రీడర్) కెమెరాలు బిగిస్తామని చెప్పిన కార్యరూపం దాల్చలేదు. అనుమతి తీసుకోకుండా వచ్చే వాహనాలను గుర్తించేలా పర్యవేక్షణ ఎక్కడా లేకుండా పోయింది. ఫలితంగా 65వ జాతీయ రహదారితో పాటు అంతర్రాష్ట్ర దారులు జహీరాబాద్–బీదర్, జహీరాబాద్–చించోళి–గుల్బర్గా మార్గాల్లో నిఘా కరవైంది.

**యథేచ్ఛగా తరలివెళ్తూ..**

జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ఎక్కువగా సరకు రవాణాతో పాటు ట్రావెల్స్ బస్సులు, మినీ బస్సులు, ట్యాక్సీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గతంలో చెక్‌పోస్టుల వద్ద అధికారులు వాటికి తాత్కాలిక అనుమతి పత్రాలు ఇచ్చేవారు. సరకు వాహనాలను క్షుణ్నంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కేసులు నమోదు చేసేవారు. ఇప్పుడక్కడ అధికారులు లేరు. దీంతో జోరుగా అక్రమ రవాణా సాగుతోంది. ముంబయి, గోవా తీర ప్రాంతాల నుంచి పన్ను ఎగ్గొట్టిన అలంకరణ సామగ్రి, మొబైల్స్ సహా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు, నిషేధిత రసాయనాలు తరలిపోతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

**ప్రత్యేక బృందాల ఏర్పాటు..**

అంతర్రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్టు ఎత్తివేయడంతో అక్రమ రవాణాపై దృష్టి సారిస్తాం. అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. త్వరలోనే సీసీ కెమెరాలు బిగించనున్నాం.

– వెంకటరమణ, ఉప కమిషనర్, ఉమ్మడి జిల్లా రవాణా శాఖ

## రూ. కోట్లు పోశారు.. 'రోడ్డు'న వదిలేశారు


ఎండాడ : నగరంలో 8వ వార్డులో కీలక ప్రాంతమైన ఎండాడ- బీచ్‌రోడ్డు అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది. సుమారు 3 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణ పనులు ఏడాదిగా నిలిచి పోయాయి. ఈ రహదారిని 60 అడుగులుగా విస్తరించేందుకు జీవీఎంసీ రూ.7 కోట్ల నిధులు కేటాయించింది. దీంతో రహదారులు, కల్వర్టులు పెద్దవి చేసి భవిష్యత్తులో మురుగునీటి పారుదలతో పాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని భావించారు. ఈ మేరకు దారి పొడవునా కంకర వేశారు. కొంత మేర పనులు సైతం చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఆ తర్వాత పనులు అర్ధాంతరంగా ఆపేశారు.ఎందుకిలా: పలువురు నాయకులకు సంబంధించిన గృహాలు, స్థలాలు ఇరువైపులా ఆక్రమించి ఉండటం, వాటిని తొలగించడానికి పట్టణ ప్రణాళిక అధికారులు ముందుకు రాకపోవడ తోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.



పనులు ఆపేయడంపై మండిపడుతున్నారు.
ఈ మార్గంలో: కళాశాలలు, బీచ్‌రోడ్డు, ఎంవీపీ, సాగర్‌నగర్, రుషికొండ, ఈపీడీసీఎల్ కార్యాలయం తదితర ప్రాంతాలకు ఇదే ప్రధాన మార్గం. దీంతో నిత్యం వేలాది మంది రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.అధికారుల మాట: జోన్-2 ఏసీపీ శాస్త్రి, ఏఈ శ్రీనివాస్‌లను వివరణ కోరగా.. పలుచోట్ల ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలు ఉండ టంతో కొంతమేర ఇబ్బందిగా మారిందని ఒకరు, పట్టణ ప్రణాళిక అధికారులు జాప్యం చేయడం తోనే పనులు నిలిచిపో యాయని మరొకరు సమాధానం చెప్పడం గమనార్హం.

## ముంచేదాకా తేల్చరా!

ఎలమంచిలి : జిల్లాలోని శారదా, వరాహ నదుల్లో లోలెవెల్ వంతెనల తూములకు అడ్డంగా తుప్పలు, భారీ వృక్షాల మానులు, పేరుకుపో వడంతో వరద నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఉ ధృతంగా ప్రవహించే వరద నీటికి ఇవి అడ్డుగా నిలిచిపోతుండటంతో ఎగువ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. వరద గట్లకు గండ్లు పడుతున్నాయి. మేజర్ శారదా నదిలో కొత్తూరు వద్ద, వరాహ నదిలో ఏటికొప్పాక వద్ద నీటి పారుదల లోలెవెల్ వంతెనలు ఉన్నాయి. పక్కన హైలెవెల్ వంతెనలు నిర్మించినా వీటిని తొలగించకుండా అలా వదిలేశారు. వరద సమయంలో నదిలో కొట్టుకువచ్చిన తుప్పలు, చెట్లు, తాటిమానులు లోలెవెల్ వంతెన తూముల వద్ద అడ్డంగా ఉండి



పోతున్నాయి. క్రమేపీ తూములు మూసుకుపోతున్నాయి. జలవనరుల శాఖ అధికారులు నదిలో వరదనీరు తగ్గిపోగానే వీటిని తొలగించాలి. నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా చూడాలి. మూడేళ్లుగా అధికారులు నిధుల కొరత కారణంగా ఈ పనులు చేపట్టలేదు. ఇటీవల వచ్చిన వరదలకు శారదా నదికి పలుచోట్ల గండ్లు పడటానికి ఇదే ప్రధాన కారణం. ప్రస్తుతానికి ఈ పాత వంతెనలు వినియోగంలో లేవు. పాత వంతెనలు కూల్చివేయడమో... తుప్పలు, దుంగలు తొలగించడమో చేయాలని పరివాహక ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ఎంతకాలం ఈ నిరీక్షణ!

మాధవధార: ఏదైనా వాహనం రోడ్డెక్కాలంటే రవాణా శాఖ జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికేట్ (ఎఫ్‌సీ) తప్పనిసరి. నిర్ణీత కాలంలో రవాణా, వ్యక్తిగత వాహనాలకు తప్పకుండా ఫిట్‌నెస్ పరీక్ష చేయించాల్సిందే. దీనికోసం జిల్లాలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఫిట్‌నెస్ కార్యాలయాలకు వాహనదారులు బారులుతీరుతున్నారు. అయితే వారం రోజులుగా జిల్లాలో ఎఫ్‌సీ జారీ చేసే ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం మాన్యువల్ పద్ధతిలో ఫిట్‌నెస్‌ను నిలిపివేసింది. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ద్వారానే ఫిట్‌నెస్ చేయించుకోవాలని ఆదేశించింది. దీంతో ప్రైవేటు ఏజెన్సీలు నిర్వహిస్తున్న ఏటీఎస్



కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.( జిల్లాలో గంభీరం వద్ద ఎఫ్‌సీలు జారీ చేసే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్) కేంద్రం పనులు ఇంకా పూర్తి కాలేదు. అందుకే సమీపంలోని అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న ఏటీఎస్ కేంద్రాల్లో ఎఫ్‌సీలు చేయించుకోవటానికి వెళుతున్నారు.
ఆయా కేంద్రాల వద్ద ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. వీరి సంఖ్య ఎక్కువగా ఉండటం...మరో వైపు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రోజుల తరబడి ఏటీస్ కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది.
ఏ వాహనమైనా ఎఫ్‌సీ లేకుండా రోడ్డు మీద ప్రయాణించడం చట్ట ప్రకారం నేరం. ప్రమాదం జరిగితే వాహన యజమాని, చోదకుడు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రమాదంలో ఎవరైనా మరణిస్తే బీమా సైతం వర్తించదు. దీంతో ఎఫ్‌సీ పొందేందుకు వాహన చోదకులు త్వరపడుతున్నా...ఆలస్యం తప్పటం లేదు. ఫిట్‌నెస్ పరీక్షల కోసం జిల్లాలో ప్రతి నెలా అన్ని రకాల వాహనాలు కలిపి సుమారు రెండు వేల వరకూ వస్తుంటాయి.

## వికృతమాలలో ఆక్రమణల పుట్టలు



శ్రీకాళహస్తి : తిరుపతి విమానాశ్రయం, పెద్దఎత్తున పరిశ్రమలు, ఐఐటీ, ఐసర్ వంటి కేంద్ర విద్యాసంస్థలు కొలువుదీరిన ఏర్పేడు మండలంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. శ్రీకాళహస్తి-తిరుపతి పుణ్యక్షేత్రాలకు మధ్యలోని ప్రాంతం కావడంతో అందరి కళ్లు మండలంపైనే పడింది. ఈ నేపథ్యంలోనే చెట్టు, పుట్ట, ప్రభుత్వ, ప్రైవేట్, కాలువ పోరంబోకు స్థలాలు అనే తేడా లేకుండా కొందరు విచ్చలవిడిగా ఆక్రమించుకుని వారి ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. రూ.కోట్లకు విక్రయించుకుంటూ సిరులు ఆర్జిస్తున్నారు.
విమానాశ్రయం, ఈఎంసీలు ఏర్పడిన వికృతమాల రెవెన్యూ ఆక్రమణలకు నిలయంగా మారుతోంది. ఎకరా భూమి రూ.నాలుగు కోట్ల వరకు పలుకుతుండటంతో స్థానికులతోపాటు బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇక్కడి భూములపై దృష్టిపెడుతూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే గ్రామానికి సమీపంలోని 97, 98 సర్వేనంబర్లలో సుమారు 5.58 ఎకరాల కాలువ పోరంబోకు స్థలాన్ని వైకాపా నేతలు ఆక్రమించుకుని అయినవారికి పంచిపెట్టడంతో విలువైన ప్రభుత్వ భూమి పెద్దలపరంగా మారింది.

**పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి..**
అధికారులు ఓవైపు ఆక్రమణలు తొలగిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ రోజురోజుకు పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏర్పేడు మండలంలోని మర్రిమంద, వికృతమాల, కోబాక, పల్లంతో పాటు శ్రీకాళహస్తి, తొట్టంబేడు, రేణిగుంట మండలాల్లో రాజకీయ పార్టీల పేర్లతో విచ్చలవిడిగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అవసరం ఉంది.
**వైకాపా బాటలోనే..**కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైకాపాలో జరిగిన ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టింది. అయితే కొందరివి మాత్రమే తొలగించి చేతులు దులుపుకోగా పెద్దల భూములను పదిలంగా ఉంచింది. తర్వాత కాలంలో మిగిలిన ప్రభుత్వ, కాలువ పోరంబోకు భూముల్లో కొందరి నేతల అనుచరులు విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఆక్రమణలు సాధారణంగా మారిందని వాపోతున్నారు.

## ప్రతి పనికీ పైసా వసూల్



అనకాపల్లి : 'ప్రభుత్వ శాఖల్లో ముఖ్యమైన రెవెన్యూ శాఖలో అవినీతి పెచ్చుమీరుతోంది. అక్రమార్జనకు వెనకడుగు వేసేదేలే అన్నట్లు రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారు. చేయి తడపందే చిన్నపనైనా చేయడం లేదు. తహసీల్దారు కార్యాలయాలను అడ్డాగా చేసుకుని పలువురు అధికారులు దందా సాగిస్తున్నారు. ఇటీవల దేవరాపల్లి, అనకాపల్లి రూరల్ మండలాల్లో పలువురు వీఆర్వోలు అవినీతి నిరోధక శాఖకు దొరికినా.. ఆ శాఖ తీరులో మార్పు రావడం లేదు.
జిల్లాలో ప్రస్తుతం పరిశ్రమలు వస్తుండటంతో భూములకు ప్రాధాన్యం పెరిగింది. దీంతో రెవెన్యూ సమస్యలు, పనులపై చాలామంది రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదునుగా చూసుకుని పట్టాదారు పాసుపుస్తకం నుంచి మ్యుటేషన్లు, సర్వేలు చేసేందుకు అధికంగా దండేస్తున్నారు. భూ సమస్య ఉందంటూ మండలాల్లోని తహసీల్దారు కార్యాలయాలకు వెళ్తే.. ఓపట్టాన ఫైల్ ముందుకు కదలడంలేదు. చాలాసార్లు ఏవో కొర్రీలతో మూలకు చేరుతున్నాయి.
ఇటీవల అచ్యుతాపురానికి చెందిన తహసీల్దారు డబ్బులకు ఆశపడి స్థానిక ప్రజాప్రతినిధి అండతో ఓ భూవ్యవహారంలో తలదూర్చాడు. తీరా ఆ వ్యవహారం డిప్యూటీ సీఎం దృష్టి వరకు వెళ్లడంతో.. తహసీల్దారుపై బదిలీ వేటు పడింది.

**పట్టుబడుతున్నా.. పట్టించుకోరు**
జిల్లాలో చాలా మండలాల్లో వీఆర్వో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు, మూడు పంచాయతీలకు ఒకరు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఏ చిన్న పనున్నా.. వీఆర్వోలు, మండల సర్వేయర్ల ద్వారానే జరగాలి. దీంతోపాటు తహసీల్దార్లకు అందిన ప్రతి అర్జీపై వీరే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించాలి. ఇదే అదునుగా చూసుకుని.. రైతులు, భూ యజమానుల దగ్గర నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. బీ దేవరాపల్లి మండలం ఎ.అలమండకు చెందిన ఓ వ్యక్తి.. తన తండ్రి పేరుమీద ఉన్న భూమిని తన పేరుమీదకు మార్చాలని మ్యుటేషన్‌కు అర్జీ పెట్టుకున్నారు. ఈ పనికోసం వీఆర్వో సూర్యనారాయణ రూ. 25 వేలు లంచం అడిగాడు. రూ.20 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వీఆర్వో సొమ్ము తీసుకుంటుండగా గతనెలలో అనిశాకు చిక్కారు.
అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంలో వీఆర్ఓగా పనిచేస్తున్న ఎం.సూర్యనారాయణ చిన్న పనైనా చేయి తడపందే పనిచేయకుండా వేధిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓ వితంతువు భర్త చనిపోయాడని.. భూమిని తన పేరుమీద మ్యుటేషన్ పెట్టుకుంటే ఆమె దగ్గర లంచం డిమాండ్ చేశాడు. సొమ్ము తీసుకుంటుండగా అ.ని.శాకు అడ్డంగా దొరికారు.
కొన్నాళ్ల క్రితం కశింకోట మండలం నర్సింగబిల్లిలో ఓ వీఆర్వో భూమి మ్యుటేషన్ కోసం డబ్బులు తీసుకుంటుంటూ నేరుగా అవినీతి నిరోధక శాఖకు దొరికిపోయారు.

## రూ.6 కోట్లు.. అధునాతన 'బజారు'



కర్నూలు : నగరంలోని సి.క్యాంపు రైతుబజారు విస్తరణకు అడుగులు పడుతున్నాయి. సి.క్యాంపు రైతుబజారును 1999లో రూ.కోటి నిధులతో 67 సెంట్ల విస్తీర్ణంలో అందుబాటులోకి తెచ్చారు. ఉమ్మడి జిల్లాలో 120 గ్రామాల రైతులు పంట ఉత్పత్తులు విక్రయించుకునేలా వీలు కల్పించారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలు సాగు చేస్తున్న 6,500 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. రైతుబజారుకు ప్రతిరోజూ వేలాది మంది వినియోగదారులు వస్తుంటారు. పండగ సమయాల్లో కాలు పెట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీన్ని విస్తరించాలంటూ‌లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. 'కూటమి' ప్రభుత్వం స్పందించి రూ.6 కోట్లు మంజూరు చేసింది.

**నిధులివ్వని వైకాపా**
రైతు బజారులో రద్దీ తీవ్రమవడం.. స్థలం సరిపోకపోవడంతో 2017-18లో అప్పటి తెదేపా ప్రభుత్వం రైతుబజారు విస్తరణకు చర్యలు చేపట్టింది. దీనిని ఆనుకుని ఆర్‌అండ్‌బీకి చెందిన పది క్వార్టర్లు కేటాయించింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడం.. వైకాపా అధికారంలోకి రావడంతో విస్తరణ పనులు ఆగిపోయాయి. 2022లో రూ.4.75 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించినా.. అది కేవలం ప్రకటనలకే పరిమితమైంది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

**వరుస కథనాలతో కదలిక**
రైతుబజారు విస్తరణ అత్యవసరం అంటూ లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. జిల్లా పాలనాధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు పలుమార్లు రైతుబజారును పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మే 17న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సి.క్యాంపు రైతుబజారును సందర్శించారు. రైతుబజారు విస్తరణతోపాటు ఆధునీకీకరించేందుకు రూ.6 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ నిధులు మంజూరు చేస్తూ వారం కిందట ఉత్తర్వులు విడుదలయ్యాయి.

**రెండంతస్తుల్లో నిర్మాణం**
సెంట్రల్ మార్కెట్ ఫండ్ (ఎస్ఎంఎఫ్) నిధులతో రైతుబజారును విస్తరించనున్నారు. టెండర్లు ఖరారైన తర్వాత ప్రభుత్వ నివాస గృహ సముదాయాలను తొలగించి రైతుబజారును విస్తరించనున్నారు.
ప్రస్తుతమున్న రైతుబజారుతోపాటు ఆర్‌అండ్‌కి చెందిన 10 నివాస గృహ సముదాయాలతో కలిసి మొత్తం 1.69 ఎకరాల స్థలం ఉంది. ఇందులో 85 సెంట్లలో రైతుబజారును విస్తరించనున్నారు.
కింది అంతస్తులో పార్కింగ్.. మొదటి అంతస్తులో 155 స్టాళ్లు, 33 దుకాణాలు, మరుగుదొడ్లు నిర్మించనున్నారు. రైతుబజారుకు వచ్చే అన్నదాతల సౌకర్యార్థం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నారు.
నిత్యం వచ్చే వినియోగదారులు : 2 వేల మంది
రోజువారీ విక్రయాలు : 800-850 క్వింటాళ్లు
ఏటా ఆదాయం : సుమారు రూ.50 లక్షలు

## నీటి వనరుల రాత మారేనా?

బొబ్బిలి : గత ప్రభుత్వం చిన్న నీటి వనరులను పూర్తిగా పట్టించుకోలేదు. నిర్వహణను గాలికొదిలేసింది. కాలువల్లో పూడిక పెరిగిపోయినా.. తూములు శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోలేదు. అసంపూర్తిగా ఉన్న పనుల జోలికి వెళ్లలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతిపాదనలకు సంబంధించిన దస్త్రాలు కదులుతున్నా ఆలస్యమవుతోంది. నిధులు విడుదలైతేనే మోక్షం కలుగుతుంది.
బొబ్బిలి మండలం నారాయణప్పవలస వద్ద కంచరగెడ్డ జలాశయ నిర్మాణం 16 ఏళ్ల కిందట తలపెట్టారు. సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. మట్టికట్ట పూర్తిచేసి, కాలువల తవ్వకాలు వదిలేశారు. పనులు పూర్తిచేయడానికి అదనంగా రూ.2 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. గత అయిదేళ్లలో పైసా విదల్చలేదు. రామభద్రపురం, బొబ్బిలి మండలాలకు సాగునీరు అందించే ఏడొంపుల గెడ్డ ఆనకట్ట నుంచి 750 హెక్టార్లలో భూములకు సాగునీరు అందాల్సి ఉంది. ఆనకట్ట శిథిలావస్థకు చేరుకోవడం,



కాలువలు పాడవడంతో శివారుకు నీరు అందడంలేదు. ఏడేళ్ల కిందట వీటికి మరమ్మతులు చేపట్టారు. పూడిక పెరిగిపోయి, కాలువలు బలహీనంగా మారాయి. తూములు శిథిలావస్థకు చేరాయి.

**5,500 ఎకరాలకు సాగునీరు కరవు**
వెంగళరాయసాగర్ పరిధిలో రెండు కీలక పథకాలు పడకేశాయి. బొబ్బిలి మండలంలోని 5,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన అదనపు ఆయకట్టు పనులు నిలిచిపోయాయి.
తోటపల్లి కుడి ప్రధాన కాలువ పరిధిలోని బొబ్బిలి మండలం రాముడువలస, తెర్లాం మండలం లోచర్ల వద్ద ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి తెదేపా హయాంలో అనుమతులు మంజూరు చేసి, భూమిపూజ చేశారు. ఒక్కో పథకానికి సుమారు రూ.16 కోట్లు అవసరమని ప్రతిపాదించారు.

**ప్రతిపాదనలు పంపించాం**
- అప్పారావు, ఎస్ఈ, జలవనరుల సర్కిల్, బొబ్బిలి


చిన్ననీటి వనరుల మెరుగుకు ప్రతిపాదనలు పంపించాం. ఏడొంపులగెడ్డ ఆనకట్ట మరమ్మతులు, చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపాం. కంచరగెడ్డకు రూ.2 కోట్లు కావాలని అంచనాలు నివేదించాం. మిగిలిన పనులు జైకాలో చేపడతాం.

## ప్రత్యేక దళం.. బోర్డుకే పరిమితం!

ఒంగోలు : శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన పోలీసు బెటాలియం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకొని సుమారు 15 ఏళ్లు గడిచినా ఇప్పటివరకు అక్కడ ఎలాంటి మౌలిక వసతులు సమకూరలేదు సరికదా సిబ్బందిని సైతం నియమించలేదు. మద్దిపాడులోని 7వ పోలీసు బెటాలియన్ కేవలం బోర్డుకే పరిమితం కావడం గమనార్హం. ప్రముఖులకు రక్షణ, ఎన్నికలు, ఇతరేతర సందర్భాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు రక్షణగా నిలిచే ప్రత్యేక పోలీసు దళం జిల్లాలో ఏర్పాటుకు 94 ఎకరాలు కేటాయిస్తూ 2009లో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ నదిని ఆనుకుని ఉన్న కొండలను కేటాయించారు. ప్రత్యేక దళం పర్యవేక్షణాధికారి, ఇతర అధికారులు, సిబ్బంది అంతా కలుపుకొని సుమారు 1,000 మంది వరకు నియమించాల్సి ఉంది. స్థలమైతే కేటాయించారు గానీ ఎలాంటి భవనాలు నిర్మించకపోవడంతో అధికారులు, సిబ్బంది ఇక్కడకు రాలేదు. ఈ ఏడాది మాత్రం బోర్డు ఏర్పాటు చేసి ఆ ప్రాంతానికి కాపలాగా సిబ్బందిని నియమించారు. ఇక్కడకు కేవలం 15 మంది సిబ్బంది వచ్చారు. వీరి కోసం ఒక గది, రెండు షెడ్లు మాత్రమే నిర్మించారు. ప్రత్యేక దళం ఏర్పాటైతే పోలీసు అధికారులు, సిబ్బంది వారికి సేవలు అందించేందుకు అదనపు సిబ్బంది నియమితులవుతారు. సిబ్బందికి క్వార్టర్స్, పాఠశాల, దేవాలయాలు, పార్కులు వంటివి రూపుదిద్దుకుంటాయి. ఒక ప్రత్యేక కాలనీగా రూపుదిద్దుకుంటుంది. వీరంతా వస్తే పరోక్షంగా స్థానికంగా కొంతమందికి ఉపాధి లభిస్తుంది.

**ఒక్కో అడుగు పడితేనే..**
ప్రస్తుతం సీఐ, ఎస్.ఐ., అధికారులు, ఇతర సిబ్బంది కలుపుకొని 15 మంది వరకు ఉన్నారు. ఇక్కడ ఉండాల్సిన 600 మంది వరకు సిబ్బంది ఇతర బెటాలియన్లలో శిక్షణలో ఉన్నారు. వారంతా ఇక్కడకు రావాలంటే కార్యాలయ భవనాలతో పాటు క్వార్టర్స్ వంటివి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ ఏడాది రూ.60 లక్షల నిధులు కేటాయించారు. బెటాలియన్ స్థలంలోకి వెళ్లేందుకు ప్రధాన రహదారి తప్ప అప్పట్లో స్థలం కేటాయించినప్పుడు కొండలు, గుట్టలతో ఎలా ఉందో.. ఇప్పుడు అలానే ఉంది. దశల వారీగా నిర్మాణాలు చేపట్టి, సిబ్బంది అడుగుపెడితే ప్రత్యేక దళంతో గుండ్లకమ్మ తీరంలో సందడి నెలకొంటుంది.

## విజ్ఞానం విరిసె.. విద్యార్థి మెరిసె




విజయనగరం : పది.. ఇరవై కాదు.. 294 ప్రాజెక్టులు. మా ప్రతిభ చూడమంటూ బాలలంతా సృజన విందు ఆవిష్కరించారు. వ్యవసా యం, పర్యావరణం, పరిశుభ్రత, నీటి సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ ఇలా పలు అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. విజయనగరంలోని బాబామెట్ట బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో సందడిది. డీఈవో మాణిక్యం నాయుడు దీన్ని ప్రారంభించారు. విద్యార్థుల బృంద విభాగంలో ఏడు, వ్యక్తిగత విభాగంలో రెండు, ఉపాధ్యాయుల విభాగంలో రెండింటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమానికి హాజరైన ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే పరిశోధనల దిశగా వెళితే ఉజ్వల భవిత అందుకోవచ్చన్నారు. ఆర్డీవో కీర్తి విజ్ఞాన ప్రదర్శన తిలకించారు. ఉప విద్యాశాఖాధికారులు కె.వి.రమణ, మోహనరావు, జిల్లా సైన్స్ అధికారి రాజేష్ పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బాలికలు నృత్య ప్రదర్శనతో అలరించారు.

# నెట్టికంటయ్య భక్తులకు అల్పాహారం

గుంతకల్లు : ఎంతో ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి సన్నిధికి మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటకల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారికి ఏ లోటూ లేకుండా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే కోట్లది రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టిన అధికారులు... మరో ముందడుగు వేశారు. భక్తుల ఆకలి తీర్చేందుకు అల్పాహార పథకాన్ని తీసుకొచ్చారు. స్వామి వారి దర్శనానికి వచ్చి.. రాత్రి బస చేసే భక్తుల కోసం ఉచితంగా అల్పాహారం అందిస్తున్నారు. వృద్ధులు, పిల్లల కోసం వేడి పాలు పంపిణీ చేపట్టారు. ఈ సదుపాయం ప్రతి రోజూ రాత్రి 7.30 గంటల నుంచి 9.00 వరకు ఉంటుంది.

ఇక ప్రతి రోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3 గంటల



వరకు అన్నప్రసాదం అందిస్తున్నారు. అన్నం, పప్పు, రసం, కూరగాయలతో తాళింపు, పెరుగు వడ్డిస్తున్నారు.

**వెయ్యి మందికి అన్నప్రసాదం**

గతంలో 300 మంది భక్తులకు మాత్రమే మధ్యాహ్నం పూట ఉచితంగా అన్నప్రసాదం అందించేవారు. నాలుగు నెలల కిందట కొత్తగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో ప్రస్తుతం వెయ్యి మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్నారు.

**ఇబ్బందులు పడకూడదని..**

–విజయరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం, కసాపురం

నాణ్యమైన సోనామసూరి బియ్యం, కూరగాయలతో భక్తులకు రుచికరమైన అన్నప్రసాదం, అందిస్తున్నాం. స్వామి సన్నిధిలో రాత్రి నిద్ర చేయడానికి వచ్చే భక్తులు ఆకలితో ఇబ్బందులు పడకూడదని అల్పాహారంతో పాటు అవసరమైన వృద్ధులు, పిల్లలకు వేడి పాలు అందిస్తున్నాం. పథకాన్ని మరింత విస్తృత పరుస్తాం.

# మ్యాజిక్ డ్రెయిన్.. మురుగు ఇంకెన్

కల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో మురుగునీటి సమస్యను పరిష్కరించడానికి మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మిస్తోంది. ఇది తక్కువ ఖర్చుతో కూడిన, దుర్వాసన లేని పర్యావరణ అనుకూలమైన వ్యవస్థ. ఇది గృహ వ్యర్థ జలాలను సహజంగా మట్టిలోకి ఇంకేలా చేస్తుంది. పులిచెర్ల మండలంలో రాజులపల్లె పంచాయతీ పెద్దఎస్సీ కాలనీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మ్యాజిక్ డ్రెయిన్‌ను నిర్మించారు. ఇది విజయవంతం కావడంతో... మిగతా పంచాయతీకు విస్తరించనున్నారు.

**ఖర్చు తక్కువ**సాధారణ మురుగు కాలువ నిర్మాణానికి 100 మీటర్లకు రూ.4.50 లక్షలు ఖర్చవుతుంది. అదే మ్యాజిక్ డ్రెయిన్‌కు రూ.70 వేలు మాత్రమే అవుతుంది.

పెద్దఎస్సీ కాలనీలో 625 మీటర్ల మ్యాజిక్ డ్రెయిన్‌కు రూ.4.50లక్షల అంచనాతో ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతానికి 325 మీటర్ల పనులు పూర్తయ్యాయి.



**నిర్మాణం ఇలా**

అరమీటరు వెడల్పు 0.60 మీటర్ల లోతుతో కాలువ ఏర్పాటు చేస్తారు. 20 నుంచి 30 మీటర్లకు ఒకచోట మీటరు పైనే గుంత తవ్వుతారు. దీన్నే ఇంకుడు గుంతగా వ్యవహరిస్తారు.వంద మీటర్ల కాలువలో నాలుగు వరకు సిమెంటు పలకలు లేదా కడప బండలు పెడతారు.మొత్తం మూడు వరుసలు అంటే 75 నుంచి 100 ఎంఎం, 40 నుంచి 65 ఎంఎం, దానిపై 12 నుంచి 20 ఎంఎం కంకరను కాలువలో పరుస్తారు.ఇందులోకి వచ్చే ఏ నీరైనా సులువుగా ఇంకిపోతుందని ఏపీవో సౌభాగ్యవతి తెలిపారు. మధ్యలో ఉన్న ఇంకుడు గుంతలు నీటిని ఇంకింప చేసుకుంటాయని వివరించారు.

# సాగు యంత్రం.. సాగని ఉద్దేశం


చిత్తూరు : రైతులకు మేలు చేసే రూ.లక్షల విలువైన సాగు యంత్రాలు నిరుపయోగంగా మారి..పాడైపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి నిదర్శనంగా చిత్తూరులోని ఏపీ ఆగ్రోస్ (వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ) నిలుస్తోంది. రైతుల శ్రేయస్సు కోసం ఆగ్రోస్ సంస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేశారు. ఒకప్పుడు అన్నదాతకు ఎరువుల పంపిణీతో పాటు బుల్డోజర్, పొక్లెయిన్ లాంటి భారీ యంత్రాలను తక్కువ అద్దెతో ఇచ్చేవారు. ప్రస్తుతం అవి పాడవడంతో నిరుపయోగంగా మారాయి.

**చాలావరకు పాడయ్యాయి..**

వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఆధునాతన యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ట్రాక్టరు, వరి, వేరుసెనగ విత్తే యంత్రాలు, రొటోవేటరు, మడకలు, నూర్పిడి, గడ్డి కట్టలు కట్టే యంత్రాలను కొనుగోలు చేశారు. వీటికి సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. ఆరేళ్లుగా వినియోగించకపోవడంతో కార్యాలయంలో వృథాగా పడిఉన్నాయి.

ఒక్కరికే రెండు బాధ్యతలు జిల్లా భూసార సంరక్షణ శాఖ డీడీగా వ్యవహరిస్తున్న అధికారి ఆగ్రోస్ ఇన్‌ఛార్జి ఆర్ఎంగానూ కొనసాగుతున్నారు. ఈ విషయం ఇన్‌ఛార్జి ఆర్ఎం శశిచంద్రమౌళిరెడ్డి వద్ద ప్రస్తావించగా.. యంత్రాలను బాగు చేయించి, అద్దె ప్రాతిపదికన అందిస్తామన్నారు.

# గార్మెంట్స్‌కు మంచి రోజులు!



రాయదుర్గం : మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ అబ్దుల్ కలాం కలల సౌధం 'పుర'(ప్రొవిజన్ ఫర్ అర్బన్ ఫెసిలిటీ ఇన్ రూరల్ ఏరియా)లో భాగంగా రాయదుర్గంలో దశాబ్దాల కిందట రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన సీఎఫ్‌సీ(కామన్ ఫెసిలిటీ సెంటర్)కి మంచి రోజుల రానున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన వేలాది మంది మహిళలకు డీఆర్‌డీఏకు చెందిన వెలుగు సంస్థ ఆధ్వర్యంలో సీఎఫ్‌సీ పునఃప్రారంభానికి రంగం సిద్ధమైంది. దుర్గాదేవి మండల సమాఖ్యలోని సభ్యులకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. సీఎఫ్‌సీలోని కుట్టు యంత్రాలు, ఫ్యాన్లకు మరమ్మతులు చేస్తున్నారు. ట్యూబులైట్లు, తాగునీటి సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టారు.ఆరంభంలో సీఎఫ్‌సీ నిర్వహణ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ తీసుకున్నా.. ఆచరణలో సాధ్యం కాలేదు. తరువాత బెంగళూరుకు చెందిన ఒక ప్రైవేటు సంస్థకు బాధ్యతలు అప్పగించారు. కొన్నాళ్లపాటు అరకొరగా శిక్షణ కొనసాగినా.. నిర్వహణ లోపంతో మూతపడింది. దీంతో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన 120 కుట్టు యంత్రాలు, ఇతర సామగ్రి నిరుపయోగంగా మారాయి.

**విస్తరణకు దోహదం**

మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త డిజైన్లతో దుస్తులు తయారు చేసి దేశంలోని ప్రముఖ కంపెనీలకు ఎగుమతి చేయటం.. మార్కెట్ సౌకర్యం కల్పించడం.. తద్వారా మహిళలకు ఉపాధి కల్పించే ఉన్నతాశయంతో ప్రారంభించిన సీఎఫ్‌సీని గాడిలో పెట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సీఎఫ్‌సీ మళ్లీ అందుబాటులోకి వస్తే ఇక్కడ శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. దీంతో గార్మెంట్ విస్తరణకు మార్గం సుగమం కానుంది. మహిళలు ఉపాధితో ఆర్థిక స్వావలంబన పొందనున్నారు.

**అతి త్వరలోనే అందుబాటులోకి తెస్తాం**

– శైలజ, డీఆర్‌డీఏ పీడీ

సీఎఫ్‌సీని అతిత్వరలో పునఃప్రారంభిస్తాం. డీఆర్‌డీఏ, వెలుగు ఆధ్వర్యంలో మహిళలకు పకడ్బందీగా శిక్షణ కొనసాగిస్తాం. క్రమంగా వ్యాపారవేత్తల సహకారం తీసుకుంటాం. సరికొత్త డిజైన్లకు అనుగుణంగా కుట్లు, దుస్తుల తయారీపై తర్ఫీదు ఇప్పించి.. ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటాం.

# దిగుబడి దండిగా.. కొన్నది కొద్దిగా



అనంతపురం : పత్తితీతలు ఊపందుకున్నాయి. కూటమి ప్రభుత్వం పంటకు మద్దతు ధర ప్రకటించింది. జిల్లాలో తాడిపత్రి, గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేస్తామని పేర్కొంది. జిల్లా మార్కెటింగ్‌శాఖ సహకారంతో సీసీఐకు కొనుగోలు బాధ్యతలు అప్పగించింది. ఈనెల 3న అధికారులు గుత్తిలో కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించారు. తాడిపత్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇప్పటికీ మొదలు కాలేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నాణ్యత పేరుతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి దుస్థితి వచ్చిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా నల్లరేగడి నేలల్లో సాగవుతోంది. సుమారు తూర్పు, ఉత్తర మండలాల్లో ఎక్కువగా సాగైంది. గత ఖరీఫ్‌లో 30,110 హెక్టార్లలో సాగు చేశారు.

**మద్దతు ధర కల్పించినా..**

ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పొడవు గింజ పత్తి రకం క్వింటాలు రూ.8,110, పొట్టి గింజ రకం క్వింటాలు రూ.7,770కు కొనుగోలు చేస్తున్నారు. కాగా తేమ, దుమ్ముధూళి, గుడ్డిపత్తి, రంగుమారిన, పురుగుపట్టిన కాయలు, విత్తన వడకలు తదితరాలను చూపుతా... పత్తి నాసిరకంగా ఉందంటూ సీసీఐ కొనుగోలు చేయడంలేదని రైతులు చెబుతున్నారు. మద్దతు ధర దక్కకపోవడంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని... నాణ్యత పేరుతో క్వింటాలు రూ.5వేల నుంచి 6 వేలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాకు రూ.1500–2000 వరకు నష్టపోతున్నట్లు అన్నదాతలు వాపోతున్నారు.

**ఒక కేంద్రంతోనే సరిపెట్టి..**

గతంలో తాడిపత్రి, గుత్తి వ్యవసాయ మార్కెట్ యార్డుల నుంచి పత్తి కొనుగోలు చేసి... నంద్యాల, ఆదోనిలోని జిన్నింగ్ మిల్లులకు పంపారు. ఈ ఏడాది గుత్తిలో కొనుగోలు చేసే పత్తిని ఆదోని జిన్నింగ్ మిల్లులకు పంపుతున్నారు. తాడిపత్రిలో ఇప్పటికీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. జిల్లా మార్కెటింగ్‌శాఖ, సీసీఐ నిర్లక్ష్యం ఫలితంగా పంటను అమ్ముకోలేకపోతున్నామని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కొనుగోలు చేయిస్తాం–రాఘవేంద్రకుమార్, సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ**

తాడిపత్రి వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మాట వాస్తవమే. సిబ్బంది లేకనే కొనుగోళ్లు ప్రారంభించలేదని సీసీఐ ప్రతినిధులు అంటున్నారు. దీంతో పెద్దవడుగూరు మండలంలోని రైతులు గుత్తి కేంద్రానికి తీసుకొస్తున్నారు. తాడిపత్రిలో కేంద్రం ప్రారంభించాలని సీసీఐ ప్రతినిధులకు చెప్పాం. సాధ్యమైనంత మేరకు రైతులు పండించిన పత్తిని కొనుగోలు చేయించి మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకుంటాం.

# డిసిల్టింగ్ పేరు.. అక్రమాల జోరు



గూడూరు : డిసిల్టింగ్ పేరుతో స్వర్ణముఖిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. భారీ యంత్రాలు ఉపయోగించి కొన్ని నెలలుగా తవ్వకాలు జరపడంతో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న సహజ వనరులు ధ్వంసమవుతున్నాయి.

ఉమ్మడి గూడూరు డివిజన్‌లో స్వర్ణముఖి నదిలో కోట మండలం గూడలి, పెళ్లకూరు మండలం కలవకూరు ప్రాంతాల్లో 6,041 హెక్టార్లలో ఇసుక దిన్నెలు ఉన్నట్లు జలవనరులశాఖ అధికారులు గుర్తించారు. మానవశక్తి ద్వారా డిసిల్టింగ్ చేసేలా టెండర్లు పిలిచారు. ఇసుకను గనుల శాఖ గుర్తించిన యార్డుకు తరలించాలి. ఇందుకుగాను గుత్తేదారునికి టన్నుకు రూ.135 చెల్లించేలా నిర్ణయించారు. యార్డులో ఇసుకను గనులు, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో స్థానిక అవసరాలకు టన్ను రూ.250కు విక్రయించాలి. కానీ ఇందుకు భిన్నంగా డిసిల్టింగ్ పేరుతో తవ్వకాలు కొనసాగిస్తున్నారు.

**తీరంలో ఎక్కడబడితే అక్కడ**

డిసిల్టింగ్ ప్రాంతాల హద్దులు చూపకపోవడంతో కోట మండలంలో గూడలి, మెట్టు, రుద్రవరం, పెళ్లకూరు మండలంలో కలవకూరు, పుల్లూరు ప్రాంతాల్లో స్వర్ణముఖి తీరంలో ఎక్కడబడితే అక్కడ తవ్వకాలు జరుగుతున్నాయి. జలవనరుల శాఖ ఈఈ బాబుతో ప్రస్తావించగా డిసిల్టింగ్‌ను మళ్లీ కొంతకాలం పొడగించామన్నారు.యార్డులకు చేరవేయకుండానే తరలింపుడిసిల్టింగ్ పేరుతో తీసిన ఇసుకను యార్డులో అరకొరగా ఉంచుతున్నారు. నదిలో యంత్రాలతో 10–20 అడుగులు తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. ఏడాదిగా ఇదంతా సాగుతున్నా అధికారుల పర్యవేక్షణ లేదు. రైతుల పంపుసెట్లు ధ్వంసమవుతున్నాయి. మూడు ప్రాంతాల్లో నది పొర్లుకట్టలను ధ్వంసం చేసి రోడ్లు నిర్మించారు. డిసిల్టింగ్ పనులు పరపతి కలిగిన వ్యక్తులు దక్కించుకోవడం, రవాణాలో ముఖ్యనేతల జోక్యం ఉండడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. డిసిల్టింగ్ ఎక్కడన్నది భౌగోళికంగా నిర్ణయించకపోవడం, ఎన్ని టన్నులు తీశారు? యార్డులో ఎంత నిల్వ చేశారు? ఎంత విక్రయిం చారన్నది స్పష్టత లేదు. సీసీ కెమెరాల ఏర్పాటు నిబంధనా అమలు కావడం లేదు.

# చూడలేకున్నా.. పరిష్కారం చూపుతారు..!

పలమనేరు : చిన్న గాయమైతే నొప్పి అంటూ అల్లాడిపోతాం..జ్వరం వస్తే రెండు రోజులు పనులకు డుమ్మా కొడతాం..ఏమాత్రం అసౌకర్యంగా ఉన్నా విధులు చేయలేం..కానీ చూపు లేకపోయినా వీరు తమ పనిలో అద్భుతంగా రాణిస్తున్నారు. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

కళ్లు లేనివారు ఒక్కరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంటే ఆశ్చర్యంగా.. ఆసక్తిగా చూస్తాం. పలమనేరులోని మున్సిపల్ కార్యాలయంలో ఒకరు కాదు ఇద్దరు కాదు.. ముగ్గురు అంధులు పని చేస్తుండటం విశేషం. వారు చూడలేరు.. కానీ తమ కౌంటర్ వద్దకు వచ్చిన ప్రజలు చెప్పింది వింటారు.. సమస్యను తెలుసుకొని పరిష్కారాన్ని సమీప గుమస్తాకు చెబుతారు. కార్యాలయానికి చెందిన ప్రొసీడింగ్స్ ఎలా పంపాలి.. నోటీసులు ఎలా ఇవ్వాలనే విషయాలను సహ ఉద్యోగులకు నేర్పిస్తారు.

శంకర్: రెండు కళ్లు కనిపించని ఈయన 2018లో పలమనేరు



మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. ఈయన తన గదిలో ఉంటూ సహోద్యోగులకు సూచనలు ఇస్తుంటారు. ప్రభుత్వ ఉత్తర్వులను తన చరవాణిలో రీడింగ్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఫొటోతీసి వింటారు. దానికి బదులు ఎలా పంపాలనే విషయాలను సహ ఉద్యోగికి చెబుతారు. శానిటేషన్ సమస్యలకు పరిష్కారం చూపుతుంటారు.

ఫౌజియాబి: గతంలో ఈమె నగరి, మదనపల్లె, పుంగనూరు మున్సిపాలిటీల్లో పనిచేశారు. సహోద్యోగులకు పని ఎలా చేయాలో సలహాలు ఇస్తుంటారు. 2024 నుంచి ఇక్కడ పని చేస్తున్నారు.

ఝాన్సీరాణి: ఈమె పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలు విని సిబ్బందికి చెబుతారు. ఈమె 2024 నుంచి ఇక్కడ ఉన్నారు. ఇలా ముగ్గురు అంధులు ఉద్యోగులుగా మున్సిపాలిటీలో పని చేస్తున్నారు. ముగ్గురిలోనూ కామన్‌గా ఉన్న లక్షణం.. ఆత్మస్థైర్యం.

# అవి'నీటి' నిర్వహణ

మంత్రాలయం: మంత్రాలయం ఎస్ఎస్ ట్యాంక్ దుస్థితి ఇది.. ఇక్కడ నీటిని శుద్ధి చేసి ఏడు గ్రామాలకు అందించాలి.. నిర్వహణకు ఏటా రూ.1.02 కోట్లు వెచ్చిస్తున్నారు. ఎనిమిదేళ్లుగా ఇసుక మార్చకపోవడం గమనార్హం.పల్లె ప్ర'జల' గొంతు తడపాల్సిన పథకాలు అవి'నిధి'మయంగా మారాయి. శుద్ధి చేయకుండానే సరఫరా చేస్తున్నారు.. నిబంధనల ప్రకారం.. పథకాల నిర్వహణ అంచనా వ్యయం కన్నా 5 శాతం ఎక్కువకు టెండర్లు దాఖలు చేస్తే రద్దు చేస్తారు. నీటి పథకాలకు సంబంధించి ఎంత తక్కువకు షెడ్యూళ్లు దాఖలు చేస్తే వారికే ఇస్తున్నారు. గోస్పాడు పథకాన్ని 21 శాతం తక్కువకు, ఆదోనిలో 30 శాతం తక్కువకు గుత్తేదారుడు దక్కించుకున్నారు. వీరు నీటిని ఎలా శుద్ధి చేస్తారో అధికారులకే తెలియాలి.

**రూ.46.04 కోట్ల కేటాయింపు**

ఎస్ఎస్ ట్యాంకులకు తుంగభద్ర దిగువ కాల్వ, కేసీ కాల్వ, కుందూ, ఎస్ఆర్ఎంసీ కాల్వల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. అక్కడ రెండు దఫాలుగా శుద్ధి చేసిన తర్వాత ఓహెచ్ఆర్‌లకు పంపింగ్ చేస్తారు. అనంతరం కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయాలి. వీటి నిర్వహణ బాధ్యతను గుత్తేదారులకు అప్పగిస్తారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కర్నూలు జిల్లాకు రూ.25.52 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.20.52 కోట్లు కేటాయించారు.సిబ్బందిని నియమించడం లేదు. కేవలం నీటిని వదిలేందుకు ఇద్దరిని మాత్రమే ఏర్పాటు చేసుకున్నారు. పదుల సంఖ్యలో సిబ్బంది ఉన్నట్లు చెబుతూ వారి పేరుతో బిల్లులు పెట్టుకుంటున్నారు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, మాయలూరు, టంగుటూరు, అవుకు పథకాలకు సంబంధించి భారీగా అవకతవకలు జరిగాయి. కర్నూలు జిల్లాలోని



ఓర్వకల్లు, మంత్రాలయం, నందవరం, కోడుమూరులో నిర్వహిస్తున్న పథకాలపై పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి.

**'ఇసుక'వేస్తే రాలనంత అక్రమాలు**

ఎస్ఎస్ ట్యాంకులకు చేరిన నీటిని పక్కనే ఉన్న ఫిల్టర్ బెడ్లలోకి పంపింగ్ చేస్తారు. అక్కడ ఇసుక, కంకర, ఇటుక ముక్కల్లోకి నీరు చేరుతుంది. అనంతరం ఆలం కలుపుతారు. క్లోరినేషన్ తర్వాత శుద్ధి జరిగాక గొట్టాల ద్వారా ఓహెచ్ఆర్‌లకు పంపింగ్ చేయాలి.

నీటి శుద్ధికి సముద్ర ఒడ్డు ఇసుకను వాడాలి.. గతంలో చీరాల నుంచి తెప్పించి వినియోగించేవారు. ఇది నాణ్యతగా ఉండటంతోపాటు శుద్ధి చేసేందుకు వీలుగా ఉంటుంది.

నిబంధనల ప్రకారం ఇసుక మార్చి ఎస్ఎస్ ట్యాంకుల్లో పూడిక తొలగించాల్సి ఉంది. గుత్తేదారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. పాత ఇసుకనే జల్లెడ పట్టి వాడేస్తున్నారు.

ః పైపైనే క్లోరినేషన్ చేసి నేరుగా ఓహెచ్ఎస్ఆర్‌లకు సరఫరా చేస్తున్నారు. కానీ శుద్ధి చేసినట్లు లెక్కలు రాసుకొంటూ నిధులు బొక్కేస్తున్నారు.

**పనిచేయకున్నా పైసలిచ్చారు**

దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఫిల్టర్ బెడ్లు పనికిరావని అధికారులే నిర్ణయించారు. .ఇలాంటివి కర్నూలు జిల్లాలో 19, నంద్యాలలో 16 వరకు ఉన్నాయి. వీటి నిర్వహణకు మాత్రం బిల్లులు చెల్లిస్తున్నారు.

25 సీపీడబ్ల్యూ పథకాల పరిధిలో ఫిల్టర్ మీడియా (ఇసుక, కంకర కలిపి)లు కొత్తవి ఏర్పాటు చేసేందుకు జడ్పీ అధికారులు రూ.12.45 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిని పరిశీలిస్తే పథకాల నిర్వహణ ఎలా ఉందో చెప్పకనే చెబుతోంది.

ఎస్ఎస్ ట్యాంకులు : 39

నీటి నిల్వ సామర్థ్యం 0.590 సీపీడబ్ల్యూఎస్

పథకాలు : 59

లబ్ధి పొందే గ్రామాలు : 604

# ‘జీవీఎంసీ’లో విలీనానికి సమ్మతమేనా?!

భీమిలి : రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో పంచాయతీలను విలీనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. భీమిలిలో మూడు మండలాలకు సంబంధించి 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇప్పటికే అక్కడి నాయకులతో చర్చించారు. స్థానిక పాలకుల అనుమతితో ప్రక్రియ పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. విలీనమైతే 98 వార్డులతో విస్తరించిన ఉన్న జీవీఎంసీ పరిధి మారుతుంది. మళ్లీ వార్డుల విభజన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

**అభివృద్ధి జరిగేనా..?**

భీమిలి, అనకాపల్లి పరిధికి చెందిన కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, నగరంపాలెం, జేవీ అగ్రహారం, తాడి, వల్లూరు, తల్లపువాని పాలెం, రాజుపాలెం విలీనం తర్వాత గ్రేటర్ విస్తీర్ణం 535 చదరపు కిలోమీటర్ల నుంచి 640 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అయితే ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ గ్రామీణ వాతావరణమే కనిపిస్తుంది. ఇప్పుడు మళ్లీ మరో 64 పంచాయతీలను విలీనం చేస్తే.. నగర విస్తీర్ణం పెరుగుతుందే తప్ప, ప్రజల జీవనం విధానంలో మార్పులు ఆశించొచ్చా



అనే చర్చ కూడా సాగుతోంది.

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పంచాయతీల విలీనం అంశం ఇంకా తమ దృష్టికి రాలేదని జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావు తెలిపారు.

**గతంలో ఇలా..** 2012లో పాలకవర్గం కాలపరిమితి తర్వాత భీమిలి, అనకాపల్లికి చెందిన పది పంచాయతీలను విలీనం చేయడానికి ప్రతిపాదించారు. ఆయా పంచాయతీల నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఏళ్ల పాటు కేసులు పరిష్కారం కాలేదు. ఆ తర్వాత విలీన ప్రక్రియ పూర్తి చేసి, 2020లో జీవీఎంసీ ఎన్నికలు నిర్వహించారు. 2005లో గాజువాకతో పాటు, పలు పంచాయతీలను విలీనం చేశారు. ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం లేదు. తాగునీరు, వీధి దీపాలు, కాలువలు వంటి వసతులు అరకొరగానే ఉన్నాయి.

# కొత్త పంచాయితీలిస్తున్నారహో..

నక్కపల్లి : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలే కీలకం. ప్రస్తుతం మరిన్ని పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయిదేళ్ల కిందట ఏర్పాటు చేసిన నూతన పంచాయతీలకు తోడు ఇప్పుడు మరిన్ని ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖగా ఉన్న సమయంలో 2020లో నూతన పంచాయతీల ఏర్పాటు జరిగింది. ఈ క్రమంలో 50 గ్రామాలు ఏర్పాటు కాగా, ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 49 ఉన్నాయి. ఇందులో చీడిక, ఆవరాజాం, గొర్లి ధర్మవరం, చినమదీనా, సీతయ్యపేట, కంఠారం, రామన్నపాలెం, చామంతిపురం, మామిడిపాలెం, మూలపేట, రామగిరి, దుగ్గాడ, మెట్టపాలెం, సుందరకోట, తిక్కవానిపాలెం, వెంకటాపురం, కె.కోట్నిబిల్లి, రొంగలపాలెం, ములకాపల్లి తదితర అప్పట్లో ఏర్పాటైనవే. ఇందులో ఒకట్రెండు మినహా మిగిలిన వాటన్నింటికి ఎన్నికలూ జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాజాగా నూతన పంచాయతీలు, ఇతరత్రా సవరణలకు ప్రభుత్వం సుముఖత తెలుపుతూ వీటిపై ఉన్న నిషేధాన్ని ప్రస్తుతం సడలించింది.

ప్రభుత్వం చేసిన సడలింపు ద్వారా పంచాయతీని రెండు పంచాయతీలుగా మార్పు చేయడం, రెండు పంచాయతీలను ఒకేదానిగా మార్పు, ఒక పంచాయతీలో గ్రామాన్ని మరో పంచాయతీలోకి విలీనం చేయడం, సమీపంలోని పుర, నగరపాలక సంస్థల్లోకి చేర్చడం వరకు అవకాశం ఉంటుంది. ఓ పంచాయతీని మరో మండలంలోకి విలీనం చేసే సౌలభ్యం మాత్రం లేదు.

జిల్లాలో ప్రస్తుతం నక్కపల్లి మండలం రాజయ్యపేట నుంచి బోయపాడు, పెదతీనార్ల నుంచి దొండవాక, వి.మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారం నుంచి కొండయ్యపాలెం, కోటవురట్ల మండలం కొత్త తంగేడు నుంచి పాత తంగేడు, రాంబిల్లి మండలం గోకివాడ నుంచి మూలకొత్తూరును విభజించి పంచాయతీ చేయాలనే ప్రతిపాదనలు స్థానికుల నుంచి వచ్చాయి. ఇలా జిల్లాలో 40 వరకు ఉంటాయని అంచనా. మరోవైపు దేవరాపల్లి మండలం కొత్తపెంట పంచాయతీని



కె.కోటపాడు మండలంలోకి విలీనం చేయాలనే డిమాండ్ ఉంది.

పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి..ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. గ్రామాల విలీనం, విభజనకు సంబంధించి పంచాయతీల్లో పాలకవర్గం తీర్మానం చేయాలి. పాలకవర్గం లేని చోట్ల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ప్రక్రియ జరుగుతుంది.

**ప్రస్తుతం జిల్లా స్వరూపం**

మొత్తం పంచాయతీలు : 646

ప్రత్యేకాధికారి పాలనలో ఉన్నవి: మూడు (చీడిక, ఎం.చింతువ, అప్పారాయుడుపాలెం)

మేజర్ పంచాయతీలు : 48

జనాభా : 14,94,947

**ఆదేశాలు రాగానే అమలు**

ప్రభుత్వం పంచాయతీల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి నిషేధం ఎత్తివేయడం ద్వారా నూతన ప్రతిపాదనలకు మార్గం సుగమం అవుతుంది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆదేశాలు రాగానే, ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు పంపిస్తాం. అక్కడ ఆమోదం పొందుతాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యే క్రమంలో గ్రామసభలు పెట్టి, తీర్మానాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారు.

సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

# నీటి కొరత.. కాసుల పంట



నాయుడుపేట : నీరు లేకుండా పారిశ్రామిక ఉత్పత్తులను ఊహించలేం.. ఈ విషయాన్నే వైకాపా నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పారిశ్రామికవాడలకు నీరు సరఫరా చేసి కాసులు దండుకున్నారు. ఆ పార్టీ అధికారం ఉన్నన్నాళ్లు నీటి వనరుల పనులకు అడ్డంకులు సృష్టించారు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఈ దందాను కొనసాగిస్తున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో అతిపెద్ద పారిశ్రామికవాడలైన మేనకూరు, అత్తివరంలో అవసరమైన నీటిలభ్యత లేకపోవడంతో ఉత్పత్తులకు పరిశ్రమల నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రెండు పారిశ్రామికవాడల్లో 105 వరకు భారీ, మధ్య తరహా పరిశ్రమలున్నాయి. వీటికి రోజూ 0.27 టీఎంసీల నీరు అవసరం. దీన్ని స్థానిక వైకాపా నేతలు అవకాశంగా చేసుకుని అక్రమార్జన సాగిస్తున్నారు.

**నేతల పెత్తనమిలా..**

పరిశ్రమలకు నీటిని సరఫరా చేయడంలో నేటికీ వైకాపా నేతల పెత్తనం నడుస్తోంది. ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో ఫిల్టర్ పాయింట్లు నిర్మించి నీటిని పంపింగ్ చేసి పరిశ్రమలకు అధిక మొత్తానికి సరఫరా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా నీటి సరఫరా వైకాపా నేతల కనుసన్నుల్లో సాగుతోంది.

**అధికారి ఏమన్నారంటే..**

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు చివరి దశలో ఉన్నాయని.. త్వరలో తెలుగు గంగ నుంచి పారిశ్రామికవాడలకు నీరు సరఫరా చేస్తామని ఏపీఐఐసీ డీజడ్‌ఎం రాంబాబు తెలిపారు.

**పనులకు అడ్డంకులిలా..**

ఈ పారిశ్రామికవాడలకు పదేళ్లుగా నీటిసమస్య నెలకొంది. తెలుగు గంగ నుంచి నీటి సరఫరా చేసేందుకు 2017లో నాటి తెదేపా ప్రభుత్వం రూ.119 కోట్లతో పనులు ప్రారంభించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం చివరి దశలో పనులు నిలిపేసింది. ఏడీబీ ద్వారా జరుగుతున్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తయితే వైకాపా నేతల రాబడికి గండి పడుతుందని, గతంలో పనులకు అంతరాయం కలిగించారనే ఆరోపణలున్నాయి.

# కొయ్య బొమ్మ.. చేయూత అందేనమ్మా



శ్రీకాళహస్తి : కొయ్య బొమ్మలు అంటేనే గుర్తుకొచ్చేది ఏర్పేడు మండలంలోని మాధవమాల కొయ్య బొమ్మల కళాకారులు. గ్రామస్థులంతా బొమ్మల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ సహకారం లేకపోవడంతో కొన్నాళ్లుగా రోజు కూలీలుగా మారుతున్నారు. వీరిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది.

**క్షేత్రస్థాయి పరిశీలనలు..:** రాయితీపై కొయ్య సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అటవీశాఖ అధికారులు కొన్ని రోజులుగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. డిపోలు, అటవీ ప్రాంతం నుంచి ఎంత సరఫరా చేయాలి.. రాయితీ , ఒక్కో యూనిట్‌కు ఇవ్వాల్సిన కలప, ఎదురయ్యే సమస్యలను గుర్తిస్తున్నారు.

**రోజు కూలీలుగా కళాకారులు..**

బొమ్మల తయారీకి నిద్రగన్నేరు, సీమచింత కలపను వాడుతారు. కొయ్య ప్రస్తుతం బయట ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నారు. అడుగు (144 ఇంచులు) రూ.600 నుంచి రూ.700 మధ్య పలుకుతోంది. బొమ్మల ధర పెంచాల్సిన పరిస్థితి ఏర్పడటంతో విక్రయాలు సాగడం లేదు. కళాకారులు ఈ వృత్తిని వదిలి కూలీలుగా మారుతున్నారు.

**ఇవీ వివరాలు..** ప్రత్యేకత: కొయ్య బొమ్మల తయారీ

సంఘం: బాలాజీ సంఘం

కుటుంబాలు: 850

యూనిట్లు: 150

# ఉద్యాన రైతుకు చేయూత



చిత్తూరు : జిల్లా ఉద్యాన పంటలకు నిలయం. మామిడి, టమాటా, పూలు, కూరగాయల పంటలు విస్తారంగా సాగవుతున్నాయి.. ఈ పంట ఉత్పత్తులకు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం వచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్లస్టరు అభివృద్ధి విధానానికి శ్రీకారం చుట్టాయి.. ఈ ఏడాది నుంచే అమలుకు ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

క్లస్టర్ విధానంపై ఇప్పటికే అభ్యుదయ రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఉద్యాన రైతులకు శిక్షణ ఇచ్చారు. స్థానికంగా ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా పండించే ఉత్పత్తులను ఎంపిక చేసి పారిశ్రామికవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో ప్రాజెక్టును నిర్వహిస్తారు. ఔత్సాహికుల ఎంపిక పూర్తి చేసి వారితో నేషనల్ హార్టికల్చర్ బోర్డుకు దరఖాస్తు చేయించేందుకు కసరత్తు ప్రారంభించారు. వచ్చే మూడు నెలల్లో దరఖాస్తు ప్రక్రియ పూర్తిచేయనున్నారు..

**ఇదీ ప్రధాన లక్ష్యం..**

వివిధ ఉద్యాన పంటల్లో విత్తనం మొదలు పంటల సాగు, యాజమాన్యం పోస్ట్ హార్వెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ప్రాసెసింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూర్చుతారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించి ఎగుమతులు ప్రోత్సహించడం, సాగు ఖర్చులు తగ్గించి రైతుల ఆదాయం పెంచడమే దీని ప్రధాన లక్ష్యం.

**ప్రయోజనం ఇలా..**

మామిడి, టమాటా, అరటి, బొప్పాయి తదితర పలు కూరగాయల ఉత్పత్తులను రైతులు మార్కెట్‌లో వచ్చిన ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది. అలాకాక క్లస్టరు నిర్వహణ సంస్థతో యూనిట్ ఏర్పాటు చేస్తే రైతుల ఉత్పత్తులను వారే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తారు. వాటిని ప్రాసెస్ చేయడంతో విలువ జోడించి ఎగుమతి చేస్తారు. క్లస్టరు పరిధిలో వెయ్యి నుంచి రెండు వేల ఎకరాలు, 150 నుంచి 250 మంది రైతులు ఉంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి రాయితీలు అందుతాయి. ఉదాహరణకు జిల్లాలో మామిడి, టమాటా సాగు ఎక్కువగా ఉంది. వీటి ప్రాసెసింగ్ యూనిట్‌లు ఇక్కడ నెలకొల్పేందుకు అవకాశం ఉంది.

రైతులు ఉపయోగించుకోవాలి.. ఉద్యాన రైతులు క్లస్టరు విధానాన్ని ఉపయోగించుకోవాలి. రూ.కోట్లు పెట్టుబడి వ్యయం పెట్టగల ఔత్సాహికులను గుర్తించి దరఖాస్తు చేయిస్తాం. ప్రాజెక్టు వ్యయంలో 40-50 శాతం రాయితీ వస్తుంది. సేంద్రియ పద్ధతిలో కూరగాయలు పండించే వారితోనూ క్లస్టరు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆసక్తి కలిగిన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించవచ్చు.

# తిరుపతిలో పశు పరిశోధనా కేంద్రం!



తిరుపతి: పశుసంపద అభివృద్ధి, దేశీయ బ్రీడ్ల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో భారీ స్థాయిలో లైవ్‌స్టాక్ రీసెర్చ్ కేంద్రం (పశు సంపద పరిశోధనా కేంద్రం) ఏర్పాటుకు తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. దీనికి వందల కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేస్తోంది. రాయలసీమ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలో దీన్ని నెలకొల్పనున్నారు. దీని ద్వారా దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోని పశువుల సంపదపై సమగ్ర పరిశోధనలు చేపట్టనున్నారు.

ఈ పరిశోధనా కేంద్రం ఏర్పాటులో ముఖ్యంగా మూడు అంశాలపై దృష్టి సారించనున్నారు.

**జాతి పరిరక్షణ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణమైన ఒంగోలు జాతి పశువుల జన్యుపదార్థాన్ని (జర్మప్లాజమ్) పరిరక్షించడం, పుంగనూరు బ్రీడ్ అభివృద్ధి, సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**పునరుత్పత్తి:** పశువుల పునరుత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం, వాటి వారసత్వ జన్యు లక్షణాలను బలోపేతం చేయడంతో పాటు పాల ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారిస్తారు.

**వ్యాధి నిరోధకత:** పశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

క్రాస్ బ్రీడ్స్ అభివృద్ధిపై పరిశోధన

దేశీయ బ్రీడ్లే కాకుండా, మెరుగైన ఉత్పాదకత కోసం విదేశీ, దేశీయ జాతుల సంకరం (క్రాస్ బ్రీడింగ్)పైనా పరిశోధనలు చేస్తారు.

**ఫ్రీజివాల్ బ్రీడ్:** తితిదే గోశాల సహకారంతో ఇప్పటికే హాల్‌స్టీన్ ఫ్రీజియన్, స్థానిక సాహివాల్ జాతులను సంకరం చేసి అభివృద్ధి చేసిన ‘ఫ్రీజివాల్’ వంటి కొత్త బ్రీడ్ల పునరుత్పత్తి, సామర్థ్యంపై పరిశోధనలు చేయనున్నారు.

నాణ్యమైన పందులు, కోళ్లు: పశువులే కాకుండా మెరుగైన కోడి, పంది జాతులను అభివృద్ధి చేస్తారు.

ప్రయోజనమిలా.. ఈ కేంద్రంలో పశువులకు వసతి, అత్యాధునిక డయాగ్నసిస్ ల్యాబ్‌లు, పరిశోధనా సౌకర్యాలు కల్పించనున్నారు. హెల్త్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్, బ్రీడ్ కన్జర్వేషన్ పనులు ఒకేచోట చేపడతారు.

# లెక్క తేలుతోంది..

అనకాపల్లి : ఉపాధి హామీ పథకంలో బినామీ మస్తర్లకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందులో పనులకు వచ్చే వారి, రానివారి లెక్క తేలుతోంది. త్వరలోనే వీరికి ముఖ ఆధా రిత హాజరు అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఉపాధి హామీలో ఎక్కువగా బినామీ మస్తర్ల ద్వారా తేడాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే వేతనదారులందరికీ ముఖ ఆధారిత హాజరు వేయడానికి వీలుగా నేషనల్ మస్తర్ మానిటరింగ్ సిస్టం (ఎన్.ఎం.ఎం.ఎస్.) యాప్ ద్వారా ఈ-కేవైసీ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అక్టోబరులో ప్రారంభించారు. 85 శాతం వరకు పూర్తి చేశారు. మరోవైపు కొత్త జాబ్ కార్డులు కావల్సినవారి నుంచి వేల సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి.

ఈ-కేవైసీ నమోదుతో జిల్లాలో దాదాపు 31,467 బోగస్ జాబ్ కార్డులు



వెలుగులోకి వచ్చాయి. వీటిని రద్దు చేశారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**అనుసంధానమైన వారికే ఉపాధి**

ప్రస్తుతం జరుగుతున్న సర్వే త్వరితంగా పూర్తి చేసేలా చూస్తున్నాం. ఇప్పటికే 85 శాతం చేశారు. గ్రామసభల్లో వేతనదారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఈ-కేవైసీ అనుసంధానం జరిగిన వారే పనులకు వస్తున్నారు. దీంతోపాటు నూతన జాబ్ కార్డులను త్వరితగతిన మంజూరు చేయిస్తున్నాం.

# చలికాలం.. జాగ్రత్త చిన్నా

అనకాపల్లి : రావికమతం మండలం తోటకూరపాలెంకి చెందిన 11 ఏళ్ల చిన్నారికి చర్మంపై దద్దుర్లు వచ్చాయి. మందుల దుకాణాల్లో ఆయింట్‌మెంట్ కొని వాడారు. తగ్గకపోగా మరింత పెరిగాయి. అనకాపల్లి ఆసుపత్రికి తీసుకొస్తే చర్మం పొడిబారిన కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు. అచ్యుతాపురానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడికి దగ్గు మొదలైంది. దీనిని నిర్లక్ష్యంగా చేయడంతో ఇది కాస్తా ఆయాసంగా మారి ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది.

జిల్లావ్యాప్తంగా చలి పెరిగింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ కాలంలో చర్మం పొడిబారడం ఎక్కువగా ఉంటుంది. చిన్నారుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలని చిన్నపిల్లల వైద్యులు చెపుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంత ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పరిస్థితి తీవ్రమయ్యాక కానీ ఆసుపత్రికి తీసుకురావడం లేదు. దీనివల్ల చిన్న వయస్సులోనే చర్మసంబంధిత వ్యాధులు వస్తున్నాయి. చలికితోడు పెరుగుతున్న కాలుష్యం వల్ల చిన్నారుల్లో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. దగ్గు, ఆయాసం, శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతూ చికిత్స కోసం ఆసుపత్రి వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఆదిలోనే తగిన చికిత్స చేయించుకుంటే ఎలాంటి సమస్యా ఉండదని వైద్యులు చెబుతున్నారు.

అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 40 మంది వరకు చిన్నారులు చర్మసంబంధిత వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. దగ్గు, శ్వాసకోశ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటోంది.

**ఆధునిక సేవలు అందుబాటులో..**

చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో వసతులు కల్పించారు. నలుగురు చిన్నపిల్లల వైద్య నిపుణులతో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. అప్పుడే పుట్టిన చంటిబిడ్డల నుంచి టీనేజ్ వరకు బాలల వరకు చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలు సమకూర్చారు. చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు**

చలికాలంలో పిల్లలకు చర్మ, శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులున్నాయి. డాక్టర్ వెంకటేశ్

# అమ్మలేం.. అనుభవించలేం

తాడేపల్లిగూడెం : డెల్టాలో రహదారి పక్కన సారవంతమైన భూములున్నాయి. కానీ.. అన్నదాత అవసరానికి ఉపయోగపడటం లేదు. గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో 30వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో వారసులకు బదిలీ చేయలేక, ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు. తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ వెళ్లని కార్యాలయం లేదు.. కలవని అధికారి లేరు. మొగల్తూరులో 722/1ఏ1 సర్వే నంబరు పరిధిలో సుమారు 98 ఎకరాలకు 25 సెంట్లు మాత్రమే ప్రభుత్వ భూమి కాగా మిగిలినది నిషేధిత జాబితాలో చేర్చారు. భీమవరం మండలం రాయలంలో 14/1లో 23 ఎకరాలు, 49/2లో 85 సెంట్లు, 51/2లో ఎకరంన్నర నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి.

**ఏలూరులో గ్రీవెన్స్**

కూటమి సర్కారు చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 వేల ఫిర్యాదులొచ్చాయి. వాటిలో తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చారని సుమారు 300 వరకు ఉన్నాయి. ఇదిగో అదిగో అంటూ అధికారులు చెప్పడమే గానీ ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరకలేదు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో భూ సమస్యల పరిష్కారానికి డిసెంబరు 16న గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి గ్రీవెన్స్‌ను పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**ఎటూ ఉపయోగపడక..** రెవెన్యూ రికార్డుల్లో పట్టాభూములుగా నమోదై క్రయవిక్రయాలు జరిగిన భూములను సైతం 22ఏలో చేర్చారు. పట్టాదారు పాస్ పుస్తకాలున్నా ఆన్‌లైన్‌లో మాత్రం నిషేధిత జాబితాలో చూపిస్తున్నాయి. వైద్య అవసరాలతో పాటు పిల్లల విద్య, వివాహ, ఇతర అవసరాలకు క్రయవిక్రయాలు చేసే వీల్లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా గతంలో ఆ భూములను కొనుగోలు చేసిన రైతులు విక్రయించిన వారిపై గొడవలకు దిగుతున్నారు. మూడేళ్ల కిందట క్రయవిక్రయాలు జరిగిన భూమికి ఇటీవల మొగల్తూరులో ఇద్దరి రైతుల మధ్య తగాదా చోటుచేసుకుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని డీఆర్వో నారాయణరెడ్డి తెలిపారు.

# ఇంగిలాయి... లాభమేనోయి

మండవల్లి : ఆక్వా రంగంలో రైతులంతా వనామీ రొయ్యలు, తెల్లచేపల సాగుతో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇబ్బందుల నుంచి విముక్తి పొంది స్థిరమైన ఆదాయాన్ని సాధించేందుకు మండవల్లి మండలం భైరవపట్నంకు చెందిన కూనపరాజు నాగరాజు కొత్త రకం చేపల సాగుపై దృష్టి సారించారు. పూర్వం కొల్లేరు ప్రాంతంలో విరివిగా లభించి నేడు కనుమరుగైన ఇంగిలాయి(సింగి) చేపలను ప్రయోగాత్మకంగా సాగు చేశారు. మంచి దిగుబడులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**వనామీతో విసుగు చెంది..**

రైతు నాగరాజు నాలుగేళ్లుగా వనామీ రొయ్యల సాగులో ఒడుదొడుకులతో విసుగు చెందారు. డిమాండ్ ఉన్న చేపల సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కృష్ణాజిల్లా బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌లోని ఆక్వానెస్ట్ హేచరీ సహకారంతో మండవల్లి మండలం గన్నవరంలో రెండెకరాల్లో ఇంగిలాయి చేపల సాగు చేపట్టారు. సాధారణంగా ఇతర చేపలు, పురుగులను వేటాడి తినే ఈ చేపలకు ఫ్లోటింగ్ పెల్లెట్‌ను అలవాటు చేయడంతో



ఇబ్బందులు తగ్గినట్లు చెప్పారు.

**కోల్‌కతా మార్కెట్‌కు..**

ఇంగిలాయి చేపల్లో ఔషధ గుణాలు ఉన్నట్లు బెంగాలీల నమ్మకం. దీంతో కోల్‌కతా నుంచి నేరుగా వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరోపక్క ఆకివీడు, భీమవరంలో ఉన్న ట్రేడర్స్ సైతం కోల్‌కతాకు బతికి ఉండగానే చేపలను ఎగుమతి చేస్తున్నారు. నాగరాజు ఎనిమిది నెలల సాగు కాలంలో నాలుగు సార్లు పట్టుబడి చేసి ఏకంగా 9.5 టన్నుల దిగుబడి సాధించారు. కిలోకు రూ.320 నుంచి 350 వరకు మార్కెట్ ఉంటుంది. మంచినీటి సదుపాయం ఉంటే ఆరు నెలల్లోనే పట్టుబడి చేసే వీలుంటుంది.

**ఎకరానికి రూ.2 లక్షల ఆదాయం**

మూడెకరాల్లోపు ఉన్న చిన్న చెరువుల్లో ఇంగిలాయి చేపల పెంపకం ఎంతో అనువుగా ఉంటుంది. ప్రతి 15 రోజులకు మంచినీటి మార్పు చేయాలి. కొంగలు, కాకుల నుంచి రక్షణకు చెరువుపై వలలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. అన్ని కలిసి వస్తే ఖర్చులన్నీ పోయి ఎకరానికి రూ.2 లక్షల వరకు లాభం సాధించవచ్చు. మార్కెటింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు లేవు.' అని కూనపరాజు నాగరాజు తెలిపారు.

# పల్లె వైద్యం.. కాసుల కష్టం

ఆదోని: ప్రభుత్వ ఆస్పత్రులకు అభివృద్ధి నిధులు అందలేదు. దీంతో అప్పు చేసి వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మూడు, ఆరు నెలలకోసారి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా నిధులు విడుదల చేయాల్సి ఉంది. రెండు త్రైమాసికాలు దాటిపోయాయి.. 2025 సంవత్సరం ముగింపునకు చేరినా.. నయా పైసా అందలేదు. దీంతో రోగులకు అవసరమైన తాగునీరు మొదలుకొని శుభ్రతకు వినియోగించే ఫినాయిల్ వరకు అప్పుచేసి కొనాల్సి వస్తోంది. లేదంటే వైద్యులు, సిబ్బంది జేబు నుంచి ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఆదోని మండలం పెద్దతుంబలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు 50- 60 మంది రోగులు వస్తారు. ఇక్కడి ల్యాబ్‌లో రోగుల నుంచి సేకరించిన నమూనాలు, వ్యాక్సిన్లను భద్రపరిచేందుకు రిఫ్రిజిరేటర్ లేదు. ఫార్మసీ విభాగంలోని పెద్ద రిఫ్రిజిరేటర్లో భద్రపర్చాల్సి వస్తోంది. ఆ గది నిత్యం తెరిచి ఉండదు. అవసరమైన ప్రతిసారి అక్కడి వెళ్లి తెచ్చుకోవడం సిబ్బందికి ఇబ్బందిగా మారింది.

**ఏ కేంద్రానికి ఎంతిస్తారు**

ఏడాదికి సీహెచ్‌సీకి రూ.3- 4 లక్షలు, పీహెచ్‌సీకి రూ.1.75 లక్షలు, పట్టణ ఆరోగ్య కేంద్రానికైతే రూ.50 వేలు కేటాయిస్తారు. వీటితో రోగులకు తాగునీటి వసతి కల్పించడం, ఫినాయిల్, స్టేషనరీ కొనుగోలు, ఓపీ చీటీలు, ఓపీ దస్త్రాలు, కంప్యూటర్ మరమ్మతులు, ప్రింటర్ క్యాట్రిడ్జ్, అంతర్జాల బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.

అత్యవసర సమయంలో మందుల కొనుగోలు, ఆస్పత్రులకు వచ్చిన గర్భిణులకు అత్యవసరమైతే రవాణా ఖర్చులు భరించాలి.

జిల్లా కేంద్రం నుంచి ఔషధాలు తెచ్చుకునేందుకు రవాణా ఖర్చులు, ఆస్పత్రుల్లో చిన్నపాటి మరమ్మతులు చేయించడం, గ్రామాలకు వ్యాక్సిన్ల తరలింపు, పైఅధికారులు సందర్శనకు వచ్చినప్పుడు ఏర్పాట్లు.. తదితర



వాటికి వీటి నుంచే వెచ్చించాల్సి ఉంటుంది.

సొంత డబ్బుతో పీహెచ్‌సీల నిర్వహణ

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలోని పీహెచ్‌సీకి ఈ ఏడాది నిధులు రాకపోవడంతో కర్నూలు నుంచి మందులు తెచ్చుకునేందుకు.. పేపర్లు, ప్రింటర్ ఇంకులు, అంతర్జాల బిల్లలకు ఇప్పటి వరకు వైద్య సిబ్బంది రూ.50 వేలు సొంతంగా వెచ్చించారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని యర్రగుంట్ల పీహెచ్‌సీలో ఇన్వర్టరు పాడవడంతో వైద్యులే రూ.4 వేల వరకు సొంత డబ్బు ఖర్చుచేసి మరమ్మతులు చేయించారు.

పడకండ్ల పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్వహణకు సిబ్బంది ఇప్పటి వరకు రూ.40 వేలు వెచ్చించారు. అహోబిలం పీహెచ్‌సీ సిబ్బంది రూ.30 వేలు ఖర్చుచేసి నిధుల కోసం ఎదురుచూస్తున్నారు.

సీహెచ్‌సీలు 18
పీహెచ్‌సీలు 87
పట్టణ ఆరోగ్య కేంద్రాలు : 47

# మనదే సొమ్ము.. మనమే తీసుకుందాం!



అనంతపురం : బ్యాంకు ఖాతాలో డబ్బు ఉన్నప్పటికీ పదేళ్లుగా లావాదేవీలు చేయలేదా? ఖాతాలో సొమ్మును ఎలా తీసుకోవాలి అని ఆలోచిస్తున్నారా..? అలాంటి వారి కోసం రిజర్వు బ్యాంకు మీ సొమ్ము..మీ హక్కు పథకాన్ని ప్రవేశపెట్టింది. పదేళ్లుగా లావాదేవీలు చేయనివారు జమైన నిధులను ఖాతాదారులు, వారు లేకపోతే వారసులు తీసుకునే అవకాశాన్ని కల్పించింది.

**ఎలా పొందాలంటే..**

పదేళ్ల పాటు పలు బ్యాంకుల్లో లావాదేవీలు జరగకపోతే సదరు ఖాతాల్లోని నగదు ఆర్‌బీఐకు చెందిన డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేట్ అవేర్‌నెస్ ఫండ్ (డీఈఏఎఫ్) ఖాతాకు వెళుతుంది. సరైన ఆధారాలు చూపించి తీసుకునే వీలు కల్పించింది. ఈ అవకాశం డిసెంబరు 31 వరకు మాత్రమేనన్న విషయాన్ని గుర్తించుకోవాలి.

అన్‌క్లెయిమ్ డిపాజిట్లు ఉన్నవారు ఆధార్, పాన్, పాస్‌పోర్టు ఫొటోతో సదరు బ్యాంకును సంప్రదించి ఈకేవైసీ పూర్తి చేయాలి. ఆర్‌బీఐ పరస్పర ధ్రువీకరణ ప్రక్రియ అనంతరం 10 నుంచి 15 రోజుల్లో సంబంధిత వ్యక్తుల ఖాతాల్లో డబ్బు జమ అవుతుంది.

ఖాతా తెరిచిన సమయంలో నామినీ పేరు రాసి ఉంటే వారికే ఇస్తారు. ఒకవేళ ఖాతాదారు మరణించిన సందర్భంలో వారసులు, ఇతర సంబంధీకుల మరణ ధ్రువీకరణపత్రం, కుటుంబ సభ్యుల అంగీకారపత్రంతోపాటు బ్యాంకు కోరిన ఇతర ఆధారాలు సమర్పించి నగదు పొందవచ్చు.

**పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు : నరేశ్‌రెడ్డి, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్**

లబ్ధిదారులు ముందుగా ఉద్గమ్ పోర్టల్‌లో వివరాలు పరిశీలించవచ్చు. అందులో పేరు, మొబైల్ నంబరుతో రిజిస్టరు చేసుకోవాలి. ఖాతా తిరిగి వినియోగంలోకి వచ్చి... అందులో నగదు తిరిగి తీసుకోవాలంటే సంబంధిత బ్యాంకు శాఖకు వెళ్లి ఈకేవైసీ చేయించు కోవాలి కొత్త పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# ఈ పాపం ఎవరిది?



అనంతపురం : మొన్న ఎమ్పీఆర్ దక్షిణ కాలువ గేటు.. నిన్న సుబ్బరాయసాగర్.. తాజాగా పీఏబీఆర్ కుడి కాలువ గేటు.. ఇలా కీలకమైన కాలువల గేట్లన్నీ మొరాయిస్తున్నాయి. ఏటా మరమ్మతు, నిర్వహణ లేకపోవడమే దీనికి మూలం. ఈ పాపం ఎవరిది.. అన్న చర్చ తెరపైకి వచ్చింది. గత వైకాపా పాలకులు జలవనరుల శాఖను ఏమాత్రం పట్టించుకోలేదు. ఉమ్మడి అనంత జిల్లాలో హెచ్చెల్సీ, హంద్రీనీవా ప్రాజెక్టులే అత్యంత కీలకం. ఇరు జిల్లాలకు తాగు, సాగునీటిని అందించేవి ఇవే. వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. ప్రతి సంవత్సరం నీటి సీజన్ మొదలయ్యే నాటికి క్రస్ట్ గేట్లు, కాలువల షట్టర్లు, కాలువల్లో పిచ్చిమొక్కలు, వ్యర్థాల తొలగింపు, గట్ల మరమ్మతు.. తదితర వాటికి తగిన నిధులు ఇవ్వాలి. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఇవేవీ అమలు కాలేదు. ఫలితంగా గేట్లు పైకి లేవకుండా మొండికేశాయి.

**నివేదిక బుట్టదాఖలు**

పీఏబీఆర్ ప్రాజెక్టును 1986 ప్రాంతంలో నిర్మించారు. అప్పట్లోనే డ్యాం కుడి కాలువ గేటు ఏర్పాటు చేశారు. తరచూ లీకేజీ, మరమ్మతులు తలెత్తుతుండటంతో 2018లో మెకానికల్ ఇంజనీర్ల బృందం పరిశీలించింది. డ్యాం, కాలువ గేట్ల నిర్మాణమే లోపభూయిష్టంగా ఉందంటూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. 2019లో ఎన్నికలు రావడంతో సమస్య మరుగునపడింది. ఈలోపు వైకాపా అధికారంలోకి వచ్చినా నివేదికను విస్మరించింది.

డ్యాంలో 2023లో నీరు అడుగంటింది. అప్పట్లోనే కాలువ గేటుకు మరమ్మతు చేయాల్సి ఉంది. పాలకులు ఎవరూ నోరుమెదపలేదు.

ప్రస్తుతం 40 చెరువులు... కూడేరు, ఆత్మకూరు, రాప్తాడు, ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో సాగు, తాగునీటి కోసం నిరీక్షిస్తున్నారు. అత్యవసర మరమ్మతు కోసం కూటమి ప్రభుత్వం రూ.29 లక్షలు మంజూరు చేసింది.

**కదిలింది కొద్దిగానే..**

హెచ్చెల్సీ పరిధిలో పుట్లూరు మండలం సుబ్బరాయసాగర్ ఉంది. 1974 ప్రాంతంలో సాగర్ గేటును అమర్చారు. ప్రస్తుతం సాగర్‌లోకి నీరు వస్తోంది. ఇక్కడి నుంచి పుట్లూరు, గరుగుచింతపల్లి, కోమటికుంట్ల చెరువులకు నీరు వదలడానికి గేటును ఎత్తడానికి నాలుగు రోజులుగా శ్రమిస్తున్నారు. నాలుగు ఇంచులు మాత్రమే పైకి లేచింది. 60 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. మూడు చెరువులకు నీరు వెళ్లాలంటే ప్రవాహం స్థాయి పెరగాలి. చెరువులకు నీరు చేరితేనే ఆయా ప్రాంతాల ప్రజల దాహార్తి తీరేది. మరమ్మతులు చేయడానికి కూటమి ప్రభుత్వ ఆదేశాలతో నిధులు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇటీవల ఎమ్పీఆర్ దక్షిణ కాలువ గేటును పైకి లేపడానికి అష్టకష్టాలు పడ్డారు. కర్ణాటక నుంచి సాంకేతిక సిబ్బందిని పిలిపించి గేటును పైకి ఎత్తించారు. కీలకమైన ఎమ్పీఆర్‌ను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవల కూటమి సర్కారు రూ.5.32 కోట్లు మంజూరు చేసింది. నీటి సీజన్ ముగియగానే పనులు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# మొంథా గాయం.. అందని సాయం

పెనుమూరు : రబీకి సంబంధించి వేరుసెనగ డిసెంబరు 15లోపు విత్తితేనే ఆశించిన దిగుబడులు వస్తాయి. అదును దాటితే పంట వేసినా ఆశించిన ప్రయోజనం ఉండదు. ఈ నేపథ్యంలో నగరి వ్యవసాయ డివిజన్‌లో ఇప్పటికే అక్కడక్కడ వేరుసెనగ విత్తడం గమనార్హం. అధిక వర్షాలు కురిస్తే పంట నష్టపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు గతంలో కురిసిన వర్షాలతో చెరువులకు నీరు చేరింది. మళ్లీ వానలు పడితే పంట చేతికందే సమయంలో మొంథా తుపాను ఉమ్మడి జిల్లాలోని రైతులను నట్టేట ముంచింది. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు కొంత ఊరట లభిస్తుందని అనుకున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నివేదిక అందించారు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పరిహారం మాత్రం అందించలేదు. దీంతో రబీలో పంటల సాగుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దూసుకొస్తున్న మరో ముప్పు**

ఉత్తర తమిళనాడు తీరం వైపుగా దిత్వా తుపాను దూసుకొస్తోందని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు కంటిపై కునుకు లేకుండా గడుపుతున్నారు. ఇప్పటికే తూర్పు మండలాల్లో చాలా మంది రైతులు వేరుసెనగ, వరి సాగు చేశారు. కొన్నిచోట్ల ఉద్యాన పంటలైన మిరప వేశారు. భారీ వర్షాలు పడితే పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

**ప్రభావిత మండలాలు**

చిత్తూరు జిల్లాలో గంగాధరనెల్లూరు, సోమల, తవణంపల్లి, వెదురుకుప్పం, ఎస్‌ఆర్‌పురం, పూతలపట్టు, పెనుమూరు, యాదమరి, గుడిపాల, సదుం, బంగారుపాళెం ఐరాల, పాలసముద్రం మండలాల్లో అధికంగా వరి పంట దెబ్బతింది. నూర్పిడి సమయంలో వర్షాలు పడడంతో పొలంలోనే మొలకలు వచ్చాయి.

చిత్తూరు జిల్లాలో పంట నష్టం వివరాలు
మొత్తం రైతులు: 334 మంది
వరి పంట: 176.87 హెక్టార్లు
వేరుసెనగ: 14 హెక్టార్లు

# ఒళ్లు సలసల.. రోగులు విలవిల

చిత్తూరు : చిత్తూరు నగరంలో జ్వరాల కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. టెలిఫోన్ కాలనీ, మురకంబట్టు, ప్రశాంత్‌నగర్, మాపాక్షి, శంకరయ్యగుంట, చవటపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా.. అసౌకర్యాలు, మందుల కొరత కారణంగా చాలామంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల పారిశుద్ధ్యం దిగజారింది. దీంత దోమలు వృద్ధి చెంది.. కునుకు లేకుండా చేస్తున్నాయి.

**ఆ మాత్రం లేవా..?**

నగరంలోని ఏడు యూపీహెచ్‌సీలు ఉన్నా.. చాలాచోట్ల మందుల కొరత ఉంది. చిన్న పిల్లలకు అవసరమైన పారసెటమాల్ సిరప్, దగ్గు నివారణకు ఆమ్‌ప్రాక్స్ సిరప్‌తో పాటు సాధారణమైన పారసెటమాల్-500 ఎంజీ, డైక్లోఫినాక్, పాంటాప్, రాంటాక్, బి-కాంప్లెక్స్, మల్టీ విటమిన్, యాంటీ బయోటిక్స్ మాత్రలు లేవు. రక్త పరీక్షలు చేయడానికి అవసరమైన రీ-ఏజెంట్‌లు లేకపోవడంతో కొన్ని పరీక్షలు చేయలేకపోతున్నారు.

**ప్రైవేటులో బాదుడు తప్పట్లేదు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం లేకపోవడంతో రోగులు ప్రైవేటుకు వెళ్తున్నారు. కన్సల్టేషన్ ఫీజు రూ.350 వరకు వసూలు చేస్తున్నారు. జ్వరం తీవ్రత అధికంగా ఉన్నా, మలేరియా, డెంగీ, ఇతర జ్వరాలకు రక్త పరీక్షల పేరిట రూ.600 నుంచి రూ.1,100లు, మందులకు కనీసం రూ.1,200




వరకు తీసుకుంటున్నారు.

**నగరంలో 15 డెంగీ కేసులు**

నగరంలోని ఏడు ఆస్పత్రుల పరిధిలో 15 డెంగీ కేసులు నమోదయ్యాయి. టెలిఫోన్ కాలనీలో 1, మురకంబట్టులో 1, ప్రశాంత్‌నగర్‌లో 1, మాపాక్షిలో 4, చవటపల్లిలో 4, సత్యనారాయణపురం ఆస్పత్రి పరిధిలో 4 కేసులు నమోదు అయ్యాయి. మురకంబట్టులో గన్యా కేసు ఒకటి నమోదైంది.

# స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్

కర్నూలు : నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతో పాటు డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వివిధ చోట్ల కొన్ని వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్నా.. వ్యర్థాలన్నీ కలిసిపోయి ఉండటంతో వేరుచేయడం కష్టమవుతోంది. దీనికి పరిష్కారంగా కర్నూలుకు చెందిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్ రూపొందించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఇందులో వేయగానే ఆ రెండింటిని వేరుచేస్తోంది. సీఎస్‌ఎం చదువుతున్న ఎన్.హర్షవర్ధన్, ఎం.భరణికుమార్‌రెడ్డి, పి.లహరి కలిసి దీన్ని తయారుచేశారు. ఇందుకోసం ఎరుపు రంగు, ఆకుపచ్చ రంగు గల రెండు చెత్తబుట్టలను తీసుకొన్నారు. దీనికి సెన్సార్‌తో కూడిన



ఆర్డినో అండ్ స్టెప్పర్ మోటారు అమర్చారు. చెత్తబుట్టలపైన వస్తువులను ఉంచేందుకు వీలుగా ఓ అట్టముక్కను ఏర్పాటు చేశారు. ఆపైన ఓ ఇనుప కడ్డీకి ఈఎస్‌పీ32-సీఎంఏ కెమెరా బిగించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్‌కు సంబంధించిన 88 రకాల వస్తువులను గుర్తించేందుకు వీలుగా వాటి చిత్రాలను ముందుగానే అందులో నిక్షిప్తం చేశారు. వివిధ రకాల వస్తువులను అట్టముక్కపై ఉంచగానే సెన్సార్ సాయంతో వాటిని గుర్తిస్తోంది. రీసైక్లింగ్ చేసే వస్తువులను ఆకుపచ్చ రంగు చెత్తబుట్టలో, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఎరుపు రంగు చెత్తబుట్టలో వేస్తోంది. ఇందుకు అనుగుణంగా మోటారు ఎడమ, కుడివైపు సులువుగా తిరుగుతోంది. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైంది. తమిళనాడులోని చెంగల్పట్టులో సెప్టెంబరు 4న ఇన్ఫోసిస్-పాల్స్ టెక్ జూకా హ్యాకథాన్-2025లో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయస్థాయిలో రెండో బహుమతి సాధించింది. నమూనా రూపొందించగా.. పూర్తిస్థాయిలో తయారీకి కసరత్తులు చేస్తున్నారు.

# గుట్ట దిగని మైలు'రాయి'

నంద్యాల : నిధులున్నా 'దారి'న పడటం లేదు. ఈ-పాస్ విధానంతో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రహదారులు, వంతెనల నిర్మాణాలు ఆగిపోయాయి. రోడ్డు, వంతెనలకు సంబంధించి నంద్యాల జిల్లాలో 27 పనులు(రూ.663 కోట్లు), కర్నూలులో 11 పనులు(రూ.523 కోట్లు) చేపట్టాల్సి ఉంది. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి అవసరమైన కంకరను గతంలో నేరుగా క్వారీలు, గనుల నుంచి సేకరించేవారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ-పాస్ విధానంతో గుత్తే'దారి' కదలడం లేదు.

**అన్నింటికీ ఆటంకం**

కొత్తగా తీసుకొచ్చిన ఈ-పాస్ విధానం పలు అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. కేంద్ర రహదారుల పనులు, కోర్‌నెట్ ప్లాన్, ఆర్ఐడీఎఫ్, మేజర్ జిల్లా రహదారులు, ఎన్‌డీబీ పనులు, భవన నిర్మాణాలు, నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఫేజ్-2, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ఫేజ్-1, ఫేజ్-2, జీవో నంబరు 350, 151 కింద మంజూరైనా ప్రధాన జిల్లా, రాష్ట్ర రహదారులు, నాబార్డు, ఎండీఆర్ పనులు ఉన్నాయి.

నంద్యాల నియోజకవర్గం పరిధిలో ఆరు, మంత్రాలయంలో మూడు, ఆలూరులో నాలుగు, పత్తికొండలో ఆరు, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో రెండు చోట్ల రహదారి పనులు ప్రారంభమే కాలేదు.

**ఈపాస్ కష్టాలు** రహదారి, వంతెన తదితర నిర్మాణాలకు అవసరమైన మెటల్, గ్రావెల్, కంకర తదితరాల కోసం ముందుగా ఆర్‌అండ్‌బీ హెచ్‌వోడీ వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. ఇందుకు తగ్గ అంచనాలు పేర్కొనాలి. ఆ దస్త్రం శాఖకు చేరుతుంది. అప్పుడు సీనరేజ్ పుస్తకం ఇస్తారు. ఆ వివరాలు తిరిగి ఆర్‌అండ్‌బీకి చేరుతాయి.

కంకర, గ్రావెల్ తదితర సామగ్రికి సంబంధించిన చలానాను 'ఆన్‌లైన్'లో చెల్లించాలి. అప్పుడు గనుల శాఖ సీనరేజ్ 'ఈ-పాస్' బిల్లు జారీ చేస్తుంది. దాని ప్రకారం రోడ్డు నిర్మాణ సామగ్రిని తెచ్చుకోవాల్సి ఉంటుంది.ఇదంతా జరగడానికి నెలల తరబడి పట్టే అవకాశం ఉంది.

వీటిపై తీవ్ర ప్రభావం

కర్నూలు జిల్లాలో ఎండీఆర్ పథకం కింద 13 పనులు మంజూరయ్యాయి. 2 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు షాదీఖానాకు డిపాజిట్ వర్క్స్ బిల్డింగ్ కింద నిధులు మంజూరు కాగా కొత్త నిబంధనలతో పనులు ముందుకు సాగడం లేదు.

కర్నూలులో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న న్యాయస్థానాల భవనాలపై ప్రభావం చూపాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జీవో నంబరు 350 కింద 42 సీడీ పనులు మంజూరయ్యాయి. రూ.40 కోట్లతో చేపట్టాల్సిన ఈ పనులు ఒక్కటీ ప్రారంభం కాలేదు.

# తేనె తోట.. ఉపాధి బాట

నందికొట్కూరు : ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల పరిధిల్లోని పంట పొలాల పక్కన ఎక్కువగా తేనెటీగల బాక్సులు కనిపిస్తాయి. గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు వచ్చి, ఇక్కడ తేనె ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఏటా నవంబరు నుంచి జనవరి వరకు ఎక్కువగా తేనె బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో చుట్టుపక్కల పంటల్లోని పుష్పాల మకరందాన్ని తేనెటీగలు తీసుకొచ్చి బాక్సుల్లో ఉన్న ప్లేట్లకు తెట్టను ఏర్పాటు చేసుకొని సంతతితోపాటు తేనెను ఉత్పత్తి చేస్తాయి.

ఒక బాక్సు నుంచి ఐదు కిలోలు తేనెటీగల ఫారం పెట్టేవారు రూ.4,600 వెచ్చించి ఒక్కొక్క బాక్సు కొనుగోలు చేయాలి. గుంటూరు, హైదరాబాద్‌లలో ఉన్న ఉత్పత్తి కేంద్రాల నుంచి రెండు వేల ఈగలను రూ.2వేల చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మొదట 10 బాక్సులతో ఉత్పత్తి ప్రారంభిస్తారు. ప్రస్తుతం 50 నుంచి 150 వరకు బాక్సులు ఏర్పాటు చేస్తున్నారు. తేనెటీగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె తయారు కావడానికి నెల సమయం పడుతోంది. ఒక్కొక్క బాక్సు నుంచి ఐదు కిలోల తేనె ఉత్పత్తి అవుతుంది.

మూడు రకాల ఈగలు ఒక్కొక్క బాక్సులో తొమ్మిది వరకు ప్లేట్లు ఉంటాయి. ప్లేటుకు 2వేల చొప్పున ఒక్క బాక్సులో 18వేల వరకు ఈగలు ఉంటాయి. పోతు, రాణి, కూలి ఈగలు ఉంటాయి. కూలి ఈగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె ఉత్పత్తి చేస్తాయి. ఆడ, పోతు ఈగలు సంతానాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. ఈగలు అధికమైతే వాటిని ఇతర బాక్సుల్లోకి మార్చవచ్చు, కొత్తగా ఫారాలు నిర్వహించే వారికి విక్రయించవచ్చు. ఏటా బాక్సులు ఏర్పాటు చేస్తాను మణికంఠ, గుంటూరు మొదట భయంగా, కష్టంగా ఉన్నా.. కాలక్రమేన అలవాటు కావడంతో లాభాలు తీయవచ్చు. నేను గుంటూరు నుంచి ఇక్కడికి వచ్చాను. ఏటా రెండు నెలలు ఇక్కడ బాక్సులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. పంటలను బట్టి బాక్సుకు 5 నుంచి 8 కిలోల తేనె ఉత్పత్తి అవుతోంది. ఆసక్తి ఉంటే ఉచితంగా శిక్షణ ఇస్తా రమేష్, శిక్షకుడు యూపీ, ఎంపీ, రాజస్థాన్, గుజరాత్, తెలంగాణ, ఏపీ ప్రాంతాల్లో పంటల కాలాన్ని బట్టి బాక్సులు ఏర్పాటు చేస్తుంటాను.

# కపూర్ బ్యూటీ మళ్లీ సర్‌ప్రైజ్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ సోనమ్ కపూర్ మరోసారి అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. 2018లో వ్యాపారవేత్త ఆనంద్ ఆహుజాను వివాహం చేసుకున్న సోనమ్ కపూర్ 2022లో మొదటి సారి తల్లి అయింది. ఆ సమయంలోనూ తాను తల్లి కాబోతున్నాను అంటూ సర్‌ప్రైజింగ్ ఫోటోలు షేర్ చేసింది. బేబీ బంప్‌తో సోనమ్ కపూర్ షేర్ చేసిన ఫోటోలు ఆ సమయంలో చర్చనీయాంశం అయ్యాయి. స్టార్ హీరోయిన్ తల్లి కాబోతుంది అంటూ తెగ ప్రచారం జరిగింది. మొదటి సారి బాబుకు జన్మనిచ్చిన సోనమ్ కపూర్ దంపతులు అతడికి వాయు అని పేరు పెట్టారు. వాయు ఇప్పుడు మూడు ఏళ్ల వయసు పిల్లాడు. ఇంతలోనే అతడు అన్న కాబోతున్నాడు అంటూ అధికారికంగా ప్రకటన వచ్చింది. వాయు అన్న



కాబోతున్నట్లుగా అధికారికంగా సోనమ్ కపూర్ ఫోటోలు షేర్ చేసి మరీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

**బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రెగ్నెంట్...** సోనమ్ కపూర్ పింక్ కలర్ డ్రెస్‌లో బేబీ బంప్‌తో ఉన్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సాధారణంగానే సెలబ్రిటీల యొక్క ప్రెగ్నెన్సీ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. కానీ సోనమ్ కపూర్ యొక్క సెకండ్ ప్రెగ్నెన్సీ పెద్దగా చర్చ జరగలేదు. సోషల్ మీడియాలోనూ ఆమె ప్రెగ్నెన్సీ గురించి ప్రచారం జరగలేదు. దాంతో అసలు విషయం ఏంటో అనేది క్లారిటీ లేదు. ఇప్పుడు సోనమ్ కపూర్ నుంచి క్లారిటీ వచ్చింది. ఆమె బేబీ బంప్ తో ఫోటో షూట్ ఇచ్చింది. దాంతో ఒక్కసారిగా అంతా సర్‌ప్రైజ్ అయ్యారు. సాధారణం గా అయితే సోషల్ మీడియాలో ప్రచారం జరిగి ఆ తర్వాత విషయాన్ని కన్ఫర్మ్ చేస్తారు. కానీ సోనమ్ కపూర్ సెకండ్ ప్రెగ్నెన్సీ విషయం గురించి వార్తలు రాకపోవడంతో ఇప్పుడు అంతా సర్‌ప్రైజ్ అవుతున్నారు అనేది సోషల్ మీడియా కామెంట్స్‌ను చూస్తే అర్థం అవుతుంది.

## ఖుషికి 100% ఫ్రీ... బోనీకపూర్ ఫుల్ హ్యాపీ

ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ కూతురు, హీరోయిన్ జాన్వీ కపూర్ సోదరి అయిన ఖుషి కపూర్ ఇప్పటికే నటిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన విషయం తెల్సిందే. కెరీర్ ఆరంభంలో నటిగా కాకుండా డైరెక్షన్ వైపు ఆసక్తి చూపించిన ఖుషి కపూర్ ఇప్పుడు పూర్తి స్థాయి నటిగా మారి హీరోయిన్‌గా సినిమాలు చేసింది, ముందు ముందు ఈమె నుంచి మరిన్ని సినిమాలు వస్తాయని అంతా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ఖుషి కపూర్ కి న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీ వారు 100% స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు సిద్ధం కావడం జరిగిందట. ఈ విషయాన్ని చాలా గర్వంగా ఖుషి కపూర్ తండ్రి బోనీ కపూర్ ప్రకటించారు. తన కూతురు ప్రతిభ పట్ల తనకు చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నాడు. ఖుషి కపూర్ న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో నటనలో మరింతగా శిక్షణ తీసుకునేందుకు అతి త్వరలోనే వెళ్లే అవకాశాలు ఉన్నాయని బాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

**ఖుషి కపూర్‌కి 100% స్కాలర్‌షిప్...** బోనీ కపూర్ తల్చుకుంటూ ఎంత ఫీజ్ అయినా కూతురు ఖుషి కపూర్‌కి చెల్లించి న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో జాయిన్ చేయగలరు. కానీ ఆమె నూరు శాతం స్కాలర్ షిప్‌ను దక్కించుకోవ



డంతో ఆమె ప్రతిభ ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆమెకు నటనపై ఉన్న ఆసక్తి దీంతో బయట పడిందని కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి సోషల్ మీడియాలో ప్రస్తుతం ఖుషి కపూర్ నూరు శాతం స్కాలర్‌షిప్ గురించి గొప్పగా మాట్లాడుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. ఖుషి కపూర్ నటిగా ముందు ముందు మరిన్ని మంచి సినిమాలు చేస్తుందనే విశ్వాసం మాకు ఉంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, మరికొందరు అక్క గ్లామర్‌తో గుర్తింపు దక్కించుకుంటే ఖుషి ఖచ్చితంగా తన నటన ప్రతిభతో గుర్తింపు దక్కించుకుంటుంది అనే విశ్వాసంను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నారు.

**బోనీ కపూర్ హ్యాపీ..** ఇటీవల బోనీ కపూర్ ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఖుషి కపూర్ గురించి మాట్లాడుతూ.. తన యొక్క బెస్ట్ ఆడిషన్స్ వీడియోను న్యూయార్స్ ఫిల్మ్ అకాడమీకి ఖుషి పంపించడం వల్లే వంద శాతం స్కాలర్‌షిప్‌కు ఎంపిక అయిందని బోనీ కపూర్ అన్నాడు.

మీరు కూడా ఇలా చేయవచ్చు అంటూ ఆ కార్యక్రమానికి హాజరు అయిన వారికి బోనీ కపూర్ సూచించాడు. ఖుషి కపూర్ సాధించిన ఈ స్కాలర్‌షిప్ తండ్రిగా గర్వించేలా చేసిందని అన్నాడు. ఆమె రాబోయే రోజుల్లో బెస్ట్ నటిగా మరిన్ని గుర్తింపు, గౌరవాలు దక్కించుకోవాలని ఆశ పడుతున్నట్లుగా బోనీ కపూర్ చెప్పుకొచ్చాడు. ఖుషి కపూర్ ప్రతిభ విషయంలో బోనీ కపూర్ మాట్లాడుతున్న సమయంలో తండ్రిగా ఆయన చాలా సంతృప్తితో ఉన్నట్లుగా అర్థం అవుతుంది. ఖుషి కపూర్ బాలీవుడ్‌తో పాటు సౌత్‌లోనూ నటిస్తుందేమో చూడాలి.




# ది రాజా సాబ్: ఓవర్సీస్ లో అసలు రచ్చకు కారణమిదే



ప్రభాస్ అంటేనే భారీ కటౌట్, చేతిలో పెద్ద కత్తి, యుద్ధం.. గత కొన్నేళ్లుగా మనకు ఇవే గుర్తొస్తున్నాయి. 'బాహుబలి' నుంచి మొన్నటి 'కల్కి' వరకు ప్రభాస్ ను ఒక సీరియస్ వారియర్ గానే చూస్తున్నాం. కానీ ఫ్యాన్స్ మనసులో మాత్రం ఎక్కడో ఒక చిన్న వెలితి ఉంది. మా పాత 'డార్లింగ్' ఎప్పుడు వస్తాడు? 'బుజ్జిగాడు' లాంటి ఈజ్, ఆ చిలిపి నవ్వులు మళ్ళీ ఎప్పుడు చూస్తాం? అని వారు ఎదురుచూడని రోజు లేదు. సరిగ్గా ఆ కోరిక తీర్చడానికే 'ది రాజా సాబ్' వస్తున్నాడు. నార్త్ అమెరికాలో ఈ సినిమాపై ఉన్న క్రేజ్ చూసి ట్రేడ్ పండితులు ఆశ్చర్యపోవడానికి ప్రధాన కారణం ఇదే. ఇది వందల కోట్ల విజువల్ ఎఫెక్ట్స్ సినిమానే, యుద్ధం లేదు. కేవలం మారుతి మార్క్ హారర్ కామెడీ. గ్రాఫిక్స్ లోన్ భయపెడుతూ నవ్వించనున్నారు. అయినా సరే, 2026న జనవరి 8 ప్రీమియర్స్ ఉంటే, నెల రోజుల ముందే (డిసెంబర్ 4న) టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేస్తున్నారు. సాధారణంగా రాజమౌళి సినిమాకో, లేదా భారీ యాక్షన్ సినిమాకో ఇలాంటి హడావిడి ఉంటుంది. కానీ ఒక ఫన్ ఎంటర్టైనర్ కి ఈ రేంజ్ రెస్పాన్స్ రావడం ప్రభాస్ స్టార్ డమ్ కి నిదర్శనం. అసలు విషయం ఏంటంటే.. ప్రభాస్ ని సీరియస్ రోల్స్ లో చూసి చూసి ఆడియన్స్ కి ఒక రకమైన ఫీలింగ్ వచ్చింది. అందుకే ఈసారి ఆయన్ని ఒక ఫన్, ఈజీ గోయింగ్ రోల్ లో చూడాలని డిసైడ్ అయ్యారు. మారుతికి కామెడీ టైమింగ్, హీరోల బాడీ లాంగ్వేజ్ ని స్టైలిష్ గా చూపించడంలో మంచి పట్టుంది. ఈ కాంబినేషన్ లో 'వింటేజ్ ప్రభాస్' బయటకు వస్తాడనే నమ్మకమే ఇప్పుడు ఓవర్సీస్ లో టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యే ఛాన్స్ ఉంది. మరోవైపు సందీప్ రెడ్డి వంగాతో చేయబోయే 'స్పిరిట్' సినిమా పనులు డిసెంబర్ లో మొదలవుతున్నాయి. లుక్ టెస్ట్ కూడా పూర్తయింది. అది ఎలాగూ వయొలెన్స్ తో కూడిన సీరియస్ సినిమా.

కాబట్టి ఆ రక్తపాతం చూసేలోపు, ప్రేక్షకులకు కాస్త రిలీఫ్ ఇచ్చేలాగా 'రాజా సాబ్' ఉపయోగపడనుంది. ప్రభాస్ కెరీర్ గ్రాఫ్ లో ఇదొక పర్ఫెక్ట్ బ్యాలెన్సింగ్ స్టెప్. నార్త్ అమెరికాలో మొదలైన ఈ హంగామా చూస్తుంటే, 'రాజా సాబ్' బాక్సాఫీస్ దగ్గర నవ్వుల జాతర చేయడం ఖాయంగా కనిపిస్తోంది. బాహుబలి 2 రికార్డులను (22 మిలియన్ డాలర్లు) టచ్ చేయాలంటే కత్తులే అవసరం లేదు, డార్లింగ్ నవ్వితే చాలు అని ఈ సినిమా నిరూపించేలా ఉంది. చూడాలి మరి ఓపెనింగ్స్ రికార్డులు ఏ రేంజ్ లో ఉంటాయో.

# ట్రైలర్: 'యూరి' డైరెక్టర్.. ఒళ్లు గగుర్పొడిచే టార్చర్..





'యూరి: ది సర్జికల్ స్ట్రైక్' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత డైరెక్టర్ ఆదిత్య ధర్ నుంచి ఆరేళ్ల గ్యాప్ వచ్చింది. ఇంత గ్యాప్ తీసుకుని ఆయన ఏం చేస్తున్నాడా అని ఆడియన్స్ ఎదురుచూస్తుండగా, ఇప్పుడు "ధురంధర్" అంటూ ఒక పవర్ ప్యాక్డ్, రా యాక్షన్ ట్రైలర్‌తో షాక్ ఇచ్చాడు.

డిసెంబర్ 5న రిలీజ్ కానున్న ఈ సినిమా ట్రైలర్ ని రిలీజ్ చేశారు. ఇక ట్రైలర్ చూస్తుంటే, ఇది కేవలం యాక్షన్ సినిమా కాదు, అంతకుమించి ఒళ్లు జలదరించే హింస, పచ్చి నిజాలు ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ట్రైలర్ సినిమాలోని మెయిన్ క్యారెక్టర్లను పరిచయం చేసే తీరు చాలా భయంకరంగా ఉంది. ముఖ్యంగా అర్జున్ రాంపాల్ పోషించిన 'మేజర్ ఇక్బాల్' ISI ఏజెంట్ గా పాత్రను పరిచయం చేసిన విధానం గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. ఒక వ్యక్తి శరీరం నుంచి కొక్కేలతో మాంసాన్ని వేలాడదీస్తున్నట్లు చూపించిన షాట్స్ చాలా డిస్టర్బింగ్‌గా, రాగా ఉన్నాయి. రణ్‌వీర్ సింగ్ ఈ సినిమాలో హీరోగా, ఒక కొత్త రకమైన లాంగ్ హెయిర్, గడ్డంతో రగ్డ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ట్రైలర్ మొత్తం ఇండియా పాకిస్తాన్ సెటప్‌లో, టెర్రరిజం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఈ కథ 2000ల తొలినాళ్లలో హిజ్బుల్ ముజాహిదీన్‌లో అండర్‌కవర్‌లో చొరబడిన మేజర్ మోహిత్ శర్మ (ఇఫ్తికార్) నిజ జీవిత కథ ఆధారంగా తెరకెక్కినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాలో స్టార్ కాస్టింగ్ గట్టిగానే ఉంది. నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ అజిత్ దోవల్ పాత్ర స్ఫూర్తితో ఆర్. మాధవన్ 'అజయ్ సన్యల్'గా కనిపిస్తుండగా, సంజయ్ దత్ 'ఎస్పీ చౌదరి అస్లాం'గా, అక్షయ్ ఖన్నా 'రెహ్మాన్ డకైత్'గా పవర్ ఫుల్ రోల్స్‌లో కనిపించారు. ట్రైలర్ మొత్తం యాక్షన్ మోడ్‌లోనే సాగింది. అయితే, ఇది రొటీన్ బాలీవుడ్ దేశభక్తి టెంప్లేట్‌ను ఫాలో అవుతుందా అనే అనుమానం కూడా కలుగుతోంది. కానీ, డైరెక్టర్ ఆదిత్య ధర్ 'యూరి'తో ప్రూవ్ చేసుకున్నాడు కాబట్టి, యాక్షన్ సీక్వెన్సులు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్ అయ్యేలా ఉన్నాయి. అయితే, ట్రైలర్‌లో చూపించిన హింస డోస్ కాస్త ఎక్కువగానే ఉంది. ఇది ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# సముద్ర తీరాన మంచు లక్ష్మి.. గ్లామర్ క్వీన్!

కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమైనా, తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు, ఫ్యాన్ బేస్ను ఏర్పరచుకున్నారు మంచు లక్ష్మి. నటిగా, నిర్మాతగా, టీవీ హోస్ట్గా ఆల్ రౌండర్‌గా నిరూపించుకుంటూ దూసుకుపోతున్నారు. తనదైన యాస, భాషతో, ముక్కుసూటితనంతో తెలుగు ప్రేక్షకులలో డిఫరెంట్ ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. లేటెస్ట్ గా మంచు లక్ష్మి తన వెకేషన్కు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. సముద్ర తీరాన, బోట్ల మధ్య నిలబడి వైట్ కలర్ షార్ట్ డ్రెస్లో ఎంతో స్టైలిష్గా, ఉల్లాసంగా కనిపిస్తున్నారు. తలపై టోపీ, కళ్లకు కూలింగ్ గ్లాసెస్ ధరించి చిల్ అవుతున్న ఈ ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. "అలలు, మంచి వైబ్స్ కలిసే చోట నన్ను చూడండి" అంటూ ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ ఇచ్చారు. అమెరికాలో ఉన్నప్పుడే ఇంగ్లీష్ సిరీస్లలో నటించిన



లక్ష్మి, ఇండియాకు వచ్చాక 'ప్రేమతో మీ లక్ష్మి', 'మేము సైతం' వంటి షోలతో పాపులర్ అయ్యారు. ఇక వెండితెరపై 'అనగనగా ఓ ధీరుడు', 'గుండెల్లో గోదారి', 'దొంగాట' వంటి చిత్రాల్లో విలక్షణమైన పాత్రలు పోషించి విమర్శకుల ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. ప్రయోగాత్మక పాత్రలు చేయడానికి ఆమె ఎప్పుడూ ముందుంటారు. ఈ మధ్య కాలంలో మంచు లక్ష్మి హైదరాబాద్ కంటే ముంబైలోనే ఎక్కువగా ఉంటున్నారు. టాలీవుడ్తో పాటు బాలీవుడ్లోనూ సత్తా చాటాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. కేవలం రెగ్యులర్ పాత్రలే కాకుండా, నటనకు ప్రాధాన్యమున్న ఛాలెంజింగ్ రోల్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల 'మాన్స్టర్' వంటి మలయాళ చిత్రంలోనూ నటించి మెప్పించారు. సినిమాలు, షోలతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో మాత్రం మంచు లక్ష్మి ఫుల్ యాక్టివ్గా ఉంటారు. తన ఫిట్నెస్ వీడియోలు, గ్లామరస్ ఫొటోషూట్లు, వెకేషన్ రీల్స్ను ఎప్పటికప్పుడు షేర్ చేస్తూ ఫాలోవర్లకు టచ్లో ఉంటారు. వయసు పెరుగుతున్నా, తన ఎనర్జీ, గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని ఈ లేటెస్ట్ ఫొటోలు చూస్తే అర్థమవుతోంది.

## అందుకే డెలివరీ తర్వాత బరువు తగ్గా..

బాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది అలియా భట్. తన అద్భుతమైన నటనతో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె కెరియర్ పీక్స్ లో ఉండగానే ప్రముఖ హీరో రణబీర్ కపూర్ తో ఏడడుగులు వేసింది. అదే ఏడాది పండంటి అమ్మాయికి కూడా జన్మనిచ్చింది. కూతురుకి రాహా అని నామకరణం చేసింది ఈ జంట. ఇకపోతే రాహా జన్మించిన తర్వాత తమ జీవితంలోనే కాదు లైఫ్ స్టైల్ లో కూడా చాలా మార్పులు వచ్చాయి అని.. అలవాటు లేని పనులు కూడా చేయాల్సి వస్తోంది అంటూ సరదాగా చెప్పుకొచ్చింది ఆలియా భట్. అంతేకాదు తాను డెలివరీ తర్వాత వేగంగా బరువు తగ్గడానికి గల కారణాన్ని కూడా ఆమె బయటపెట్టింది. అసలు విషయంలోకి వెళ్తే.. ప్రముఖ బాలీవుడ్ నటీమణులు కాజోల్, ట్వింకిల్ కన్నా అమెజాన్ ప్రైమ్ వీడియోలో "టూ మచ్" అనే ఒక టాక్ షో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ సహనటుడు వరుణ్ ధావన్ తో కలిసి ఆలియా భట్ ముఖ్య అతిథిగా హాజరయ్యింది. ఈ టాక్ షోలో తన నిద్రతీరు గురించి కూడా ఆమె మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ కూడా త్వరగా పడుకొని త్వరగా లేచే వ్యక్తిని. కానీ రాహా పుట్టిన తర్వాత నా నిద్ర టైమింగ్లో చాలా మార్పులు వచ్చాయి. నేను మేల్కొనకూడదు అనుకున్నాను. సాధారణంగా నేను తొమ్మిదిన్నర గంటలకే నిద్రపోతాను. అయితే ఇప్పుడు నిద్రపోయిన



గంటలను లెక్కిస్తున్నాను. కానీ ఇదంతా నా కూతురు కోసమే అని తెలిసి మరింత సంతోషంగా ఉంది"అంటూ చెప్పుకొచ్చింది. అలాగే రాహాకు జన్మనిచ్చిన తర్వాత నేను వేగంగా బరువు తగ్గిపోయాను. దీంతో చాలామంది నాపై విమర్శలు గుప్పించారు.. అసలు నిజం ఏమిటంటే.. రాహాకు జన్మనిచ్చిన తర్వాత నేను వేగంగా బరువు తగ్గాను. తల్లిపాలు ఇవ్వడం వల్ల చాలా క్యాలరీలు ఖర్చు అవుతాయి. ముఖ్యంగా నేను ఎంత తిన్నా సరే సహజంగానే బరువు తగ్గాను. అయితే నా ఫోటో బయటకు వచ్చినప్పుడు నేను అసహజ పద్ధతులలో బరువు తగ్గాను అంటూ నాపై చాలామంది ట్రోల్స్ చేశారు.. ఎందుకు అంత త్వరగా బరువు తగ్గాల్సి వచ్చింది అంటూ కూడా కామెంట్లు చేశారు. అయితే మేము ఆ ట్రోల్స్ ని పెద్దగా పట్టించుకోలేదు. సాధారణంగా చాలామందిలో ఇలాంటి మార్పులు జరుగుతూనే ఉంటాయి. కానీ నేను సహజ పద్ధతిలోనే బరువు తగ్గాను"అంటూ అలియా భట్ చెప్పుకొచ్చింది. ఇకపోతే ఆలియా భట్ లో వచ్చిన ఈ మార్పులను అటు కాజోల్ ఇటు ట్వింకిల్ కన్నా ప్రోత్సహించారు. ప్రస్తుతం మహిళలు తమ శరీరాలను ఏ పరిమాణంలోనైనా సరే ఆలింగనం చేసుకోవాలని.. అదే దిశగా తమను తాము ప్రోత్సహించుకోవాలని తెలిపారు. అటు ప్రజలు కూడా నువ్వు అలా చేయి.. నువ్వు ఏ పరిమాణంలో ఉండాలనుకుంటున్నావో అలాగే ఉండు.. అని నాతో కూడా చెప్పారు. ప్రస్తుత కాలంలో బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లిలో వచ్చే మార్పులను నిజంగా ఎవరూ పట్టించుకోరు. అది రిఫ్రెషింగ్ గా ఉంది అంటూ కూడా ఆలియా తెలిపింది. మొత్తానికైతే బరువు తగ్గడంపై వచ్చిన ట్రోల్స్ కి గట్టి కౌంటర్ ఇచ్చింది ఆలియా.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536